RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

22 మార్చ్ 2025 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:250





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయిన నాబార్డు చైర్మన్ షాజీ కేవీ

## బడ్జెట్‌పై శాసనసభలో వాడివేడి చర్చ



**హరీశ్ వర్సెస్ భట్టి**

**నేను ఉద్దేశపూర్వకంగా విమర్శించటం లేదు**

**బడ్జెట్‌లోని లోపాలను మాత్రమే ఎత్తి చూపుతున్నా...హరీశ్‌రావు**

**చులకన భావంతో మాట్లాడొద్దు ... డిప్యూటీ సీఎం**

**పరిధి దాటటం మంచిది కాదు ... మంత్రి శ్రీధర్‌బాబు**

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఏడో రోజైన శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు సభ ఆరంభం కాగానే ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ నిధి సవరణ బిల్లు 2025ను, తెలంగాణ న్యాయవాదుల క్లర్కుల సంక్షేమ నిధి సవరణ బిల్లు 2025ను సభలో ఉంచినట్టు స్పీకర్ తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వార్షిక నివేదికను, రాష్ట్ర తోళ్ల పరిశ్రమ సంస్థ వార్షిక నివేదికను ప్రభుత్వం సభ ముందు ఉంచినట్టు తెలిపారు. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిపాదించిన వార్షిక బడ్జెట్‌పై సాధారణ చర్చను స్పీకర్ ప్రారంభించారు. తొలుత ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ నుంచి తన్నీరు హరీశ్‌రావును మాట్లడాల్సిందిగా ఆయన సూచించారు. ఈ క్రమంలో హరీశ్‌రావుకు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, హరీశ్‌రావుకు, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మధ్య కొద్ది సేపు సంవాదం నడిచింది. ప్రతిపక్ష సభ్యుడిగా బడ్జెట్‌ను సమగ్రంగా విశ్లేషించటం ద్వారా అందులోని లోపాలను ఎత్తి చూపటం తన బాధ్యతని హరీశ్‌రావు తెలిపారు. తద్వారా రాష్ట్రంలోని పేదలు, బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేయాలన్నదే తన తపన తప్ప ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా విమర్శించటం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... బడ్జెట్ పై ప్రతిపక్ష సభ్యులు ఎంతసేపు మాట్లాడినా తనకు అభ్యంతరం లేదనీ, కానీ ఆ పరిధిని దాటి, అవాస్తవాలు, సత్యదూరమైన మాటలు మాట్లాడటం సరికాదన్నారు. బడ్జెట్‌పైన ప్రసంగించాలని సూచిస్తే రాజకీయ ప్రసంగాలు చేయటమేంటని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్కమార్క కలుగజేసుకుని... హరీశ్‌రావు తన ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌ను, తనను, ఇతర మంత్రులను ఉద్దేశించి చులకన భావంతో మాట్లాడటం సమంజసం కాదని అన్నారు. బుద్ధిహీనులు, అజ్ఞానులు అనే పదాలను ఉపసంహరించుకోవాలని హరీశ్‌రావుకు సూచించారు. సభాపతితో వాదనకు దిగటం సరికాదని హితవు పలికారు. మరోవైపు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇంకోవైపు బీఆర్ ఎస్ సభ్యుడు తలసాని శ్రీనివాస యాదవ్ సైతం వారి వారి పక్షాలకు మద్దతుగా మాట్లాడారు. బడ్జెట్‌పై చర్చలో హరీశ్‌రావుతోపాటు అధికార పక్షం నుంచి బాలూ నాయక్, బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ ప్రసంగించారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారుహరీశ్‌రావు ఆవేదన

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను, వివిధ రంగాలకు నిధుల కేటాయింపులు, గత బడ్జెట్ తీరు తెన్నులను బీఆర్ ఎస్ హయాంలోని పద్దులను సరిపోల్చుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు. గతంలో అమలైన వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు, ఇప్పటి వాటి పరిస్థితులను ఏకరువు పెట్టారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపాదించిన బడ్జెట్ మీద రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఆ వాగ్దానాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లిందని వాపోయారు. ఆ పార్టీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి తదితర హామీల సంగతేంటని ప్రశ్నించారు. తమ బీఆర్ ఎస్ పాలనలో లక్షా 62 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు. తామిచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకే నియామక ప్రతాలను అందజేసిన ముఖ్యమంత్రి, మంత్రులు ఆ ఘనత తమదేనంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదంటూ అధికార పక్షం ఆరోపిస్తోందనీ, కానీ తమ ప్రభుత్వ హయాంలో 6,47,479 రేషన్ కార్డులను జారీ చేశామని హరీశ్‌రావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తద్వారా మొత్తం 20,69,033 మందికి లబ్ది జరిగిందని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల కోసం రూ.4 వేల కోట్లు కేటాయించి, ఖర్చు చేశామని వివరించారు. తాము అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కింద మూడు బ్యారేజీలు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌజులు, 16 రిజర్వాయర్లు. 203 కి.మీ. టన్నెళ్లు, 231 కి.మీ.గ్రావిటీ కాలువలు భాగంగా ఉన్నాయని విశదీకరించారు. అందులోఒక్క మేడిగడ్డలోని 7 బ్లాకుల్లోని 1 బ్లాకులో, 1 పిల్లర్ మాత్రమే

మిగతా 2లో

### వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి: రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో ఈదురు గాలులు, వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రాణ నష్టం, ఆస్తి నష్టం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముందస్తు చర్యలు చేపట్టాలని అప్రమత్తం చేశారు. వెంటనే సంబంధిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ని ఆదేశించారు.

తర్వాత సంబంధిత జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన శాంతి కుమారి , రానున్న 48 గంటలలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని సూచన ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలంటూ అవసరమైన సూచనలు చేశారు.

### ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించదు- కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా




న్యూఢిల్లీ మార్చి 5 : ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని విధానాన్ని అనుసరిస్తోందని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం రాజ్యసభలో ఉద్ఘాటించారు. దేశంలో నక్సలిజాన్ని 2026 మార్చి నాటికి నిర్మూలించనున్నట్లు కూడా మంత్రి స్పష్టం చేశారు. హోమ్ మంత్రిత్వశాఖ నిర్వహణపై చర్చకు అమిత్ షా సమాధానం ఇస్తూ, ప్రభుత్వం 370 అధికరణం రద్దు ద్వారా రాజ్యాంగ నిర్మాతల కలను సాఫల్యం చేసిందని వెల్లడించారు. '370 అధికరణం కాశ్మీర్‌లో వేర్పాటువాదానికి ప్రాతిపదిక. అయితే, ఆ అధికరణాన్ని తాత్కాలికం చేసినందుకు, దానిని రద్దు చేసే విధాన్ని కూడా అధికరణంలో చేర్చినందుకు రాజ్యాంగ రూపశిల్పులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను' అని చెప్పారు.'అయితే, వోటు బ్యాంకు రాజకీయాలు, మూర?పు పట్టుదల కారణంగా 370 అధికరణం కొనసాగింది. 2019 ఆగస్టు 5న 370 అధికరణాన్ని రద్దు చేయడమైంది. దేశంలో ఇద్దరు ప్రభుత్వాధినేతలు, రెండు రాజ్యాంగాలు, రెండు పతాకాలు ఉండరాదన్నది మన రాజ్యాంగ రూపశిల్పుల కల' అని ఆయన తెలిపారు. 370 అధికరణం రద్దు అనంతరం జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులతో భారతీయ యువత బంధం దాదాపుగా మాయమైందని హోమ్ శాఖ మంత్రి చెప్పారు. యుపిఎ

మిగతా 2లో

### ఈ నెల 31 వ తేదీలోగా ఎల్ఆర్ఎస్ అమలులో నూరు శాతం పురోగతి సాధించాలి

**:రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్**

**- కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్య కార్యదర్శి**



**కార్వాన్ ప్రజాబలం ప్రతినిధి:**ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి సారించి ఈ నెల 31 వ తేదీలోగా ఎల్ఆర్ఎస్ అమలులో నూరు శాతం పురోగతి సాధించాలనీ రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు. తప్పిదాలకు తావు లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు. దరఖాస్తుదారులు భవన నిర్మాణ అనుమతులు తీసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.

హైదరాబాద్ నుండి శుక్రవారం రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్ ఎల్ఆర్ఎస్ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు సంబంధించి ప్రొసీడింగ్ జనరేట్ చేసి అందజేయాలన్నారు.ఇప్పటికీ ఫీజు చెల్లించని దరఖాస్తుదారులు రెండో దఫా ఫోన్ చేసి మార్చి 31 లోగా ఫీజులు చెల్లించేలా చూడాలనీ చెప్పారు.ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ లు సంబంధిత మున్సిపల్ కమిషనర్ లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించాలాన్నారు. ఎల్ఆర్ఎస్ వల్ల కలిగే ప్రయోజనాలను దరఖాస్తుదారులకు తెలిసేలా ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ లకు సూచించారు. ఈ నెల 24 వ తేదీన మరోసారి ఎల్?ఆర్?ఎస్? పై జిల్లా కలెక్టర్ లు , కమిషనర్ లతో సమీక్ష నిర్వహిస్తానని ముఖ్య కార్యదర్శి చెప్పారు.

### తిరుమలలో నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు

వార్తా 2 లో



### వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం ట్రస్ట్

**ప్రతి రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం...**

**అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖ రాస్తాం**

**తిరుపతిలో ముంతాజ్, ఎమర్, దేవాలోక్ హోటల్స్‌కు కేటాయించిన 35 ఎకరాలు రద్దు**

**24 క్లేమోర్స్ పేలినా బతికున్నానంటే వేంకటేశ్వరస్వామి భిక్షతోనే**

**-తిరుమలలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

వార్తా 2 లో



ప్రజాబలం

22 మార్చ్ 2025 శనివారం

# డీలిమిటేషన్‌తో ఎవరికి ప్రయోజనం?

ఉత్తరాన బిజెపి ఎత్తుగడలు నెగ్గినాయి. దేశంలో కొన్ని లౌకిక పార్టీలు చీకటి లోకంలో మగ్గినాయి అన్న గజ్జెల మల్లారెడ్డి మాటలు మళ్ళీ గుర్తొస్తున్నాయి. తాము చేసే ప్రతీ పనిలో ఏదో ఒక మెలిక పెట్టడం బిజెపికి అలవాటే. ఆ మెలిక కూడా మామూలుగా ఉండదు, దాని ప్రభావం చాలా పెద్దగానే ఉంటుంది. తనకు మాత్రమే ప్రయోజనం చేకూరి, ఇతరులు ఇరుకున పడేసేలా బిజెపి చక్కటి వ్యూహంతో ఇరుకున పెడుతుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కూడా అదే పని చేసింది. ఆ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందింది కానీ అది అమలు అవ్వాలంటే మాత్రం కొన్ని మెలికలు ఉన్నాయి. అది జనాభా గణన, డీలిమిటేషన్. ఈ రెండింటిలో జనాభా గణన అంశాన్ని పక్కనపెడితే డీలిమిటేషన్ ప్రక్రియ మాత్రం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పార్లమెంటరీ లేదా అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్నిర్మించే ప్రక్రియనే డీలిమిటేషన్ అంటారు. జనాభా ప్రాతిపదికన ప్రజాప్రతినిధులు ఉండేలా సీట్లు కేటాయించాలన్న ఆలోచనతో ఈ డీలిమిటేషన్‌ని తెరమీదకు తీసుకొచ్చారు. అంటే పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభలో, ప్రతి ప్రతినిధి సభలో సమాన సంఖ్య లో జనాభాకు ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది. అయితే ఈ డీలిమిటేషన్ ప్రక్రియని అమలు చేయాలంటే ముందుగా రాజ్యాంగం ప్రకారం జనాభా గణన చేయాల్సి ఉంటుంది. నిజానికి 2021లో జనాభా గణన జరగాల్సి ఉంది. కానీ అప్పుడు కొవిడ్ మహమ్మారి కారణంగా అది జరగలేదు. మరో విషయం ఏమిటంటే మోడీ ప్రభుత్వం ఇంతవరకూ జనాభా గణన ప్రారంభించలేదు. ఉత్తర భారతంతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా రేటు చాలా తక్కువ. ఉత్తరాదిన జనాభా గణనీయంగా పెరిగిపోతుంటే దక్షిణాదిలో మాత్రం జనాభా నియంత్రణపై కేంద్రం నిబంధనల్ని పాటిస్తున్నారు. అందుకే జనాభా పెరుగుదల దక్షిణాది రాష్ట్రాల్లో ఒక క్రమంలో ఉంది. మొత్తంగా చెప్పాలంటే దక్షిణాది కన్నా ఉత్తరాది జనాభా ఎక్కువ. ఇలాంటప్పుడు డీలిమిటేషన్ ప్రక్రియ అనేది ఉత్తరాది రాష్ట్రాలకే ప్రయోజనం చేకూరుస్తుంది. జనాభా ప్రాతిపదికన సీట్లు ఉండాలన్నది నియమం కాబట్టి ఉత్తరాదిన జనాభా ఎక్కువగా ఉండటంతో అక్కడ సీట్లు పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తక్కువగా ఉండటంతో, ఉన్న సీట్లలో కోతపడే ప్రమాదం ఉంది. రాజ్యాంగం ప్రకారం జనాభా లెక్కింపు తర్వాత కేంద్రం ఖచ్చితంగా చేయాల్సిన పనుల్లో నియోజకవర్గాల పునర్విభజన ఒకటి. జనాభా ప్రాతిపదికన దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నియోజకవర్గాలను విభజించి, సరిహద్దులు గుర్తిస్తారు. అలాగే ఏయే నియోజకవర్గాలకు ఎస్‌సి, ఎస్‌టి ప్రాతినిధ్యం అవసరం ఉందనే లెక్కలు కూడా తేలుస్తారు. పార్లమెంట్ చట్టం ప్రకారం కేంద్రం ఒక డీలిమిటేషన్ కమిషన్‌ని ఏర్పాటు చేస్తుంది. సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి ఈ కమిటీకి చైర్మన్‌గా ఉంటారు. కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌తో పాటు అన్ని రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్స్ ఇందులో సభ్యులుగా ఉంటారు. 1952లో తొలి డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటైంది. 1951 జనాభా లెక్కల ప్రకారం 36 కోట్ల 10 లక్షల జనాభాకు 494 లోక్‌సభ స్థానాలను గుర్తించారు. 1963లో రెండో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటైంది. 1961 జనాభా లెక్కల ప్రకారం 43 కోట్ల 90 లక్షల జనాభాకు లోక్‌సభ స్థానాల సంఖ్యను 522కు పెంచారు. అలాగే 1973లో 54 కోట్ల 80 లక్షల జనాభాకు గాను ఆ సంఖ్యను 543 కు పెంచారు. ఆ తరువాత 2002 కూడా మరోసారి నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. 2001 జనాభా లెక్కల ప్రాతిపదికన కాకుండా 1973 నాటి జనాభా లెక్కల ప్రకారమే లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా, తగ్గించకుండా 543 స్థానాలనే కొనసాగించారు. అంతేకాదు మరో 25 ఏళ్ల వరకు అంటే 2026 వరకు డీలిమిటేషన్ ప్రక్రియను చేయరాదని 84వ సవరణ ద్వారా పార్లమెంట్‌లో ఒక చట్టం చేశారు.

1952లో అప్పటి భారత ప్రభుత్వం జనాభా పెరుగుదలను అదుపులో పెట్టడం కోసం ఫ్యామిలీ ప్లానింగ్ ప్రోగ్రాంను తెరపైకి తీసుకొచ్చింది. 1976 తర్వాత ఈ కార్యక్రమం ఉధృతంగా కొనసాగింది. కేంద్రం ఆదేశాల ప్రకారమే దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను అమలు చేయడంలో చాలా చురుకుగా వ్యవహరించాయి. జనాభా పెరగకుండా చూసుకోవడంలో విజయం సాధించాయి. దీంతో ఉత్తరాది రాష్ట్రాల జనాభాతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల చాలా వరకు తగ్గింది. కానీ దక్షిణాది రాష్ట్రాలు సాధించిన ఈ విజయమే ఇప్పుడు తమ పాలిట శాపమైంది. ఎందుకంటే జనాభా ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరగనుండటంతో ఎక్కువ జనాభా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ లోక్‌సభ స్థానాలు పెరుగుతాయి. తక్కువ జనాభా ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు లోక్ సభ స్థానాల సంఖ్య తగ్గుతుంది. ఇది కేవలం లోక్‌సభలోనే కాదు రాజ్యసభలో రాష్ట్రాలకు కేటాయించే రాజ్యసభ సభ్యుల సంఖ్యపై కూడా అంతే ప్రభావం చూపిస్తుంది. దీంతో భవిష్యత్‌లో పార్లమెంట్‌లో అన్ని రకాలుగా తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుంది. దీని వల్ల పార్లమెంట్‌లో తమ డిమాండ్లను వినిపించే అవకాశాలు, హక్కులతో పాటు కేంద్రం ఇచ్చే నిధులను కూడా కోల్పోతుంది. ప్రస్తుతం లోక్‌సభలో మొత్తం 543 స్థానాలు ఉండగా అందులో దక్షిణాది రాష్ట్రాల నుండి 129 మంది లోక్‌సభ సభ్యులు ఉన్నారు. అంటే మొత్తం సంఖ్యలో ఇది కేవలం 24 శాతం మాత్రమే. వాటిలో తెలంగాణ నుండి 17, ఎపి నుండి 25, కేరళ నుండి 20, తమిళనాడు నుండి 39, కర్ణాటక నుండి 28 స్థానాలు ఉన్నాయి. 1951, 1961, 1971 జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాలు పెరిగిన తీరు చూస్తే ఇప్పుడున్న జనాభా ప్రకారం ప్రతీ 20 లక్షల మందికి ఒక లోక్‌సభ స్థానం ప్రకారం విభజించే అవకాశం ఉంది. అలా చూసుకుంటే మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుండి 753 కు పెరుగుతాయి. అప్పుడు తెలంగాణకు 3 స్థానాలు పెరిగి 20, ఆంధ్రప్రదేశ్‌కు 3 స్థానాలు పెరిగి 28, తమిళనాడుకు 2 స్థానాలు పెరిగి 41, కర్ణాటకకు 8 స్థానాలు పెరిగి 36 స్థానాలు ఉండగా కేరళకు 1 స్థానం తగ్గి 19 స్థానాలు ఉండనున్నాయి. పెరగబోయే మొత్తం 753 స్థానాల్లో దక్షిణాది రాష్ట్రాల వాటా కేవలం 144 మాత్రమే ఉంటుంది. అంటే మొత్తం పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల వాటా ఇప్పటి వరకు ఉన్న 24 శాతం నుండి 19 శాతానికి తగ్గుతుంది. ఇప్పటికే 80 లోక్‌సభ స్థానాలతో ఉత్తరప్రదేశ్ ఎక్కువ స్థానాలు ఉన్న రాష్ట్రంగా నెంబర్‌వన్ స్థానంలో ఉంది. అందుకే కేంద్రం లో అధికారంలోకి రావాలంటే ఏ పార్టీకైనా యుపిలో విజయం ఎంతో ముఖ్యం. 2026 డీలిమిటేషన్ తరువాత యుపిలో లోక్‌సభ స్థానాల సంఖ్య 80 నుండి 128కి పెరిగే అవకాశం ఉంది. అదే కానీ జరిగితే ఈ నియోజకవర్గాల పునర్విభజనతో ఎక్కువ లాభం పొందే రాష్ట్రం యుపి అవుతుంది. ఇక ప్రస్తుతం యుపిలో ఎక్కువగా ఏ పార్టీ హవా నడుస్తుందో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. ఆ తరువాత ఎక్కువ లాభం పొందే రాష్ట్రాల్లో బీహార్ ఉంటుంది. యుపి తరువాత ఎక్కువ జనాభా ఉన్న బీహార్ లో ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల సంఖ్య 40 నుండి 70కి పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో ఇప్పుడున్న 48 లోక్‌సభ స్థానాల నుండి 68కి పెరిగే అవకాశం ఉంది. మధ్యప్రదేశ్‌లో ఇప్పుడున్న 29 స్థానాల నుండి 47కు పెరిగే అవకాశం ఉంది. అలాగే రాజస్థాన్‌లో 25 స్థానాల నుండి 44 స్థానాలకు పెరిగే ఛాన్స్ ఉంది. ఈ అంచనాల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం భారీగా తగ్గిపోనుండగా ఉత్తరాది రాష్ట్రాల ప్రాతినిధ్యం భారీగా పెరిగిపోనుంది. అంటే దక్షిణాది రాష్ట్రాలు భయపడుతున్నట్టు ఇక్కడి ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండానే ఉత్తరాది సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చు. బిజెపి వాదన ప్రకారం సీట్లు పెరుగుతాయన్నది నిజమే. కానీ ఇదే సమయంలో ఉత్తరాదికి ఎన్ని సీట్లు పెరుగుతున్నాయో చెప్పడం లేదు.

# బడ్జెట్‌పై శాసనసభలో వాడివేడి చర్చ

మొదటి పేజీ తరువాయి

కుంగిందని గుర్తు చేశారు. ఇలాంటి వాస్తవాలను మరుగుపరిచి, కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందంటూ దుష్ప్రచారం చేయటం సరికాదన్నారు.

రుణమాఫీ ఘనత మాదే... బాలూ నాయక్

కాంగ్రెస్ సభ్యుడు బాలూ నాయక్ మాట్లాడుతూ...తమ ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఆయా సంఘాలకు ఆర్టీసీ బస్సులను కేటాయించిందని గుర్తు చేశారు. ప్రతీ పేదవాడికీ ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలనేది తమ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా, వాటిని పక్కనబెట్టి సుమారుగా 21 వేల కోట్ల మేర రైతులకు రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. ఏకకాలంలో ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. తన నియోజకవర్గమైన దేవరకొండలోనే రూ.350 కోట్ల మేర రుణాలను మాఫీ అయ్యాయని వివరించారు. రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలన్నింటినీ మాఫీ చేశామని తెలిపారు. బీఆర్ ఎస్ హయాంలో గొర్రెలు, బర్రెలు, చేపల పంపిణీ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందన్నారు. ఈ తతంగంపై ఏసీబీ విచారణ కొనసాగుతోందని తెలిపారు.

హామీలకు పాతరేశారు... ఏలేటి

బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ప్రస్తుత బడ్జెట్ పాతరేసిందన్నారు. గత బడ్జెట్ సమయంలో బీఆర్ ఎస్ ప్రభుత్వంలో అనేక కుంభకోణాలు, ఆర్థిక అరాచకాలు జరిగాయంటూ ఇప్పటి కాంగ్రెస్ సర్కారు చెప్పిందని గుర్తు చేశారు. వాటి మీద కేసులు, విచారణలు ఎంత వరకు వచ్చాయని ప్రశ్నించారు. సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. బిల్లులు చెల్లించకపోవటంతో కాంట్రాక్టర్లు సైతం ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చివేయటం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో లేని ఫ్యూచర్ సిటీని ఎందుకు ముందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. పేదల భూములను కబ్జా చేయటంపై ఉన్న శ్రద్ధ హామీల అమలుపై లేదని ఎద్దేవా చేశారు.

అప్పులెలా తీరుస్తారు...?

కూనంనేని సూటి ప్రశ్న

సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించేనాటికి మన అప్పు రూ.70 వేలుగా ఉందని తెలిపారు. ఇప్పుడది రూ.8 లక్షల కోట్లకు చేరిందని వాపోయారు. దీన్ని తీర్చటానికి ఉన్న మార్గాలేమిటో చెప్పాలంటూ ప్రశ్నించారు. మరోవైపు సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఎలా ముందుకు తీసుకుపోతారని నిలదీశారు. మన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వచ్చినా ఈ అప్పులను తీర్చలేరని వ్యాఖ్యానించారు. రాబోయే మూడు తరాల నెత్తిన కూడా అప్పులు వేశామని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్నుంచి బయటపడే మార్గాలను అన్వేషించాలని ప్రభుత్వానికి సూచించారు.

# అమెరికా విద్యావ్యవస్థలో సమూల మార్పులు విద్యాశాఖనే మూసివేస్తూ ఉత్తర్వులపై సంతకం

వాషింగ్టన్ మార్చి 21 అమెరికా విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తానని ట్రంప్ గతంలో చెప్పిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే ఆ శాఖలో భారీగా ఉద్యోగులను తొలగించారు. ఇప్పుడు విద్యాశాఖనే మూసివేస్తూ ఉత్తర్వులపై సంతకం చేశారు. గురువారం వైట్‌హౌస్ లో పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. విద్యాశాఖ మూసివేత ఆర్డర్లపై సంతకాలు చేశారు. దీన్ని త్వరలోనే అమలు చేయనున్నట్లు ఈ సందర్భంగా ట్రంప్ ప్రకటించారు. ఈ శాఖ ద్వారా ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని వ్యాఖ్యానించారు. అంతేకాదు విద్యాశాఖ అధికారులను రాష్ట్రాలకు తిరిగి ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. అయితే, విద్యార్థుల ఫీజుల రాయితీలు, కొన్ని ముఖ్యమైన పథకాలను మాత్రం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయంపై డెమోక్రాట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం ట్రస్ట్ ఏర్పాటు

మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న సీఎం అనంతరం భక్తులకు అన్నవితరణ కేంద్రంలో భోజనం వడ్డించిన సీఎం, కుటుంబ సభ్యులు

తిరుమల, మార్చి 21 :- రాష్ట్రంలో ఇప్పటికీ చాలా గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి దేవాలయాలు లేవు. ఆయా గ్రామాల్లో వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం నిధులు సేకరించేందుకు ట్రస్టు ఏర్పాటు చేస్తాం. నాడు ఎన్టీఆర్ అన్నదానం, నేను ప్రాణదానం కార్యక్రమాలు ప్రవేశపెట్టాం. మూడవ కార్యక్రమంగా ఆలయాల నిర్మాణాలను తలపెడుతున్నాం. మాధవ సేవ కోసమే ఆలయాల నిర్మాణానికి ట్రస్ట్ ఏర్పాటు చేస్తాం. ట్రస్ట్‌కు వచ్చే నిధులు పగడ్బంధీగా ఖర్చు చేస్తాం. వేంకటేశ్వరస్వామి ఆస్తులు ఎవరు కబ్జా చేసినా వాటిని తిరిగి దేవుడికే చెందేలా చేస్తాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తన మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం వేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు వెంగమాంబ అన్నవితరణ కేంద్రంలో అన్నప్రసాదం స్వయంగా వడ్డించారు. అనంతరం మీడియాతో సీఎం మాట్లాడారు.

వేంకటేశ్వరుడి ప్రాణభిక్షతోనే బతికున్నా

దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నాం. ప్రతి పుట్టిన రోజు నాడు తిరుమలలో అన్నదానం చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నాం. తిరుమలలో అన్నదానాన్ని ఎన్టీఆర్ ప్రారంభించారు. ఇప్పటికి విరాళాల ద్వారా రూ.2,200 కార్పస్ ఫండ్ ఏర్పాటైంది. అన్నదానం ఒక మహత్తర కార్యక్రమం. ఇది శాశ్వతంగా జరుగుతుంది. నేను ప్రాణదానం కార్యక్రమం ప్రారంభించా. మానవ సేవ మాధవ సేవ రెండూ ఉంటాయని ప్రాణదానం తీసుకొచ్చాం. ఏడు కొండలు వేంకటేశ్వరస్వామి సొంతం. ఇక్కడ అపవిత్రం చేయడం, వ్యాపారాలు జరగకూడదు. గతంలో అసెంబ్లీలో ఏడుకొండలు కాదు 5 కొండలు అని వ్యాఖ్యానించినప్పుడు పోరాడాం. ప్రాణదానం కార్యక్రమం ప్రారంభించి కిందకు వస్తున్న సమయంలో నాపై 24 క్లేమోర్‌మైన్స్ పేల్చారు. అన్ని క్లేమోర్స్ పేల్చినప్పుడు నేను ప్రాణాలతో బతికేవాడిని కాదు..సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి ప్రాణభిక్ష పెట్టారు. ఇందులో వేంకటేశ్వరస్వామి మహిమ ఏంటో ఆలోచించుకోవాలి. 24 క్లేమోర్ పేలితే ప్రాణాలతో తప్పించుకోలేరు. వేంకటేశ్వరస్వామి మహిమ వల్లే బతికాను.

3 హోటళ్లకు కేటాయించిన భూమి రద్దు చేస్తున్నాం

గత ఐదేళ్లలో తిరుమల పవిత్రత కోసం చాలా పోరాటాలు చేశాం. అందుకే అధికారంలోకి వచ్చాక వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచే ప్రక్షాళన చేపడతామని చెప్పి చేశాం. కొండకు ఆనుకుని ఉన్న ముంతాజ్, ఎమర్, దేవాలోక్ హోటల్స్‌కు అనుమతులు ఇచ్చి 35.32 ఎకరాలు కేటాయించారు. ఈ కేటాయింపులను రద్దు చేస్తున్నాం. ఏడు కొండనలు ఆనుకుని ఎవరూ వ్యాపారం చేయడం, అపవిత్రం చేయడానికి వీల్లేదు. టీటీడీలో పని చేసే ప్రతి ఒక్కరినీ కోరుతున్నాం...వేంకటేశ్వరస్వామి పవిత్రను కాపాడటానికి ఒకడుగు ముందుకేయాలిగానీ వ్యక్తిగత ప్రయుజనాల కోసం వ్యవహరించ వద్దు. దేశం, ప్రపంచలో వేంకటేశ్వరస్వామి ఆస్తులను కాపాడటానికి కంకణం కట్టుకున్నాం. టీటీడీలో పని చేసేవారు హిందువులై ఉండాలి...ఇతర మతస్తులను గౌరవ ప్రదంగా మరోచోట అవకాశం కల్పిస్తాం. క్రిస్టియన్, ముస్లిం ఆలయాల్లో కూడా ఇతర మతస్తుల ఉండరు. ఏ మతానికి సంబంధించిన ఆలయాల్లో ఆ మతం వారే ఉంటారు. దేశంలోని అన్ని రాజధానుల్లో వేంకటేశ్వరస్వామిని దేవాలయం నిర్మించాలని సంకల్పించాం. దీనికోసం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాస్తాం. ప్రపంచ దేశాల్లో హిందువుల ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వేంకటేశ్వరస్వామి దేవాలయాలు నిర్మిస్తాం.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# తిరుమలలో నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు

## శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందిన నారా కుటుంబం

## అన్నప్రసాద వితరణకు రూ.44 లక్షల విరాళం

## అన్నప్రసాద సముదాయంలో భక్తులకు స్వయంగా అల్పాహారం వడ్డించిన కుటుంబ సభ్యులు





తిరుమలః నారా దేవాన్ష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నారా కుటుంబం కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు నారా దేవాన్ష్ శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, స్వామివారి ఆశీస్సులు పొందారు. నారా దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్, ఇతర కుటుంబ సభ్యులకు మహాద్వారం వద్ద ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి, నారా దేవాన్ష్ భక్తులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. ఒక్కరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షలను చంద్రబాబునాయుడి కుటుంబం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కు విరాళం ఇచ్చారు. ఏటా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా నారా కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుని అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఆలయ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్. వెంకయ్య చౌదరి, పలువురు టీటీడీ బోర్డు సభ్యులతో పాటు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించదు- కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా

మొదటి పేజీ తరువాయి

యుపిఎ హయాంలో ఒకప్పుడు పరిపాటిగా ఉన్న ఉగ్రవాదులను ఘనంగా కీర్తించడం ఎన్‌ఎడి పది సంవత్సరాల పాలనలో అంతమైందని తెలిపారు. 'పది సంవత్సరాల క్రితం ఉగ్రవాదుల అంత్యక్రియల ఊరేగింపులు సాధారణంగా ఉండేవి. జనం వారిని కీర్తిస్తుండేవారు. కానీ ఇప్పుడు, ఉగ్రవాదులు హతమైనప్పుడు వారిని వెంటనే ఖననం చేస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ సౌకర్యాలు అనుభవించిన వారి బంధువులను ప్రభుత్వ పదవుల్లో నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించి గట్టి సందేశం పంపింది' అని ఆయన తెలియజేశారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదం, రాష్ట్రాల్లో వామపక్ష తీవ్రవాదం, ఈశాన్య ప్రాంతంలో తిరుగుబాటు సమస్యలు భారత్‌కు అతిపెద్ద సమస్యలు ఉన్నాయని అమిత్ షా చెప్పారు. 'నాలుగు దశాబ్దాల్లో సుమారు 92 వేల మంది పౌరులు హతులయ్యారు. వాటిని అణిచేందుకు సంఘటిత కృషి ఏమీ జరగలేదు. మోడీ ప్రభుత్వం ఆ పని చేసింది' అని ఆయన తెలిపారు. మోడీ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించడం లేదని హోమ్ శాఖ మంత్రి స్పష్టం చేశారు. ఉగ్ర సంఘటనల్లో పౌరులు, భద్రత సిబ్బంది మరణాల సంఖ్య బాగా తగ్గిపోయిందని, కాశ్మీర్ లోయలో రాళ్లు రువ్వే ఘటనలు ముగిసాయని కూడా ఆయన తెలిపారు. 'మోడీ ప్రభుత్వ హయాంలో జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదం వల్ల మరణాలు 70 శాతం తగ్గాయి. ఉగ్ర ఘటనలు కూడా బాగా పడిపోయాయి' అని ఆయన చెప్పారు. 'పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా జమ్మూ కాశ్మీర్‌లో అట్టడుగు స్థాయి నుంచి ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగిందని కూడా అమిత్ షా తెలియజేశారు. 'జమ్మూ కాశ్మీర్‌లో 201924 కాలంలో సుమారు 40 వేల ప్రభుత్వోద్యోగాల కల్పన జరిగింది. 1.51 లక్షల మందికి స్వయం ఉపాధి కల్పన జరిగింది. నైపుణ్య క్లబ్‌లు పని చేస్తున్నాయి' అని ఆయన చెప్పారు. పూర్వపు ప్రభుత్వాలు నక్సలిజానికి వ్యతిరేకంగా చర్య తీసుకోలేదని కూడా ఆయన ఆరోపించారు. '2026 మార్చి 21 నాటికి దేశంలో నక్సలిజం అంతం అవుతుంది' అని హోమ్ శాఖ మంత్రి స్పష్టం చేశారు. ఈశాన్య ప్రాంతం గురించి అమిత్ షా ప్రస్తావిస్తూ, ఆ ప్రాంతం మొత్తం మీద ప్రశాంతంగా ఉందని. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నూతన అభివృద్ధి శకం ఆవిర్భవించిందని చెప్పారు. '2019 నుంచి మేము దాదాపు 19 ఒప్పందాలపై సంతకాలు చేశాం. అదే కాలంలో ఈశాన్య ప్రాంతంలో దాదాపు పది వేల మంది తీవ్రవాదులు లొంగిపోయారు' అని అమిత్ షా తెలియజేశారు.

# జానపద సినీ కథానాయకుడు

తెలుగు సినీ రంగంలో నందమూరి, అక్కినేనిల హవా నడుస్తున్న రోజు ల్లో, సినిమాలు పరిమితంగా నిర్మిస్తున్న కాలంలో మరో హీరోకి అవసరం ఉందన్న ఆలోచన సినీ పరిశ్రమ చెయ్యని వేళ ఆ టాప్ హీరోల తర్వాత హీరోగా గుర్తింపు పొందిన అందాల నటుడు, జాన పద హీరో, నాటి యువతుల కలల రాకుమారుడు కాంతారావు.తాడేపల్లి లక్ష్మీ కాంతారావు అంటే వెంటనే స్ఫురణకు రాక పోవచ్చు. కానీ కత్తి కాంతారావంటే తెలుగు నాట తెలియని వారుండరు. వెండి తెరపై జానపద కథా నాయకుడిగా టి.ఎల్.కాంతారావు వేసిన ముద్ర అలాంటిది. కత్తి పట్టిన జానపద వీరుడు అంటే ఇప్పటికీ కూడా మొదటగా గుర్తుకు వచ్చేది కాంతా రావే. విఠలాచార్య, కాంతా రావుల కలయిక అపూర్వం. ప్రేక్షకులకు గుర్తుండి పోయినప్పటికీ ఆయన పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో సైతం మంచి పాత్రల ద్వారా అరుదైన అభినయాన్ని చూపించారు. నార దుడిగా, కృష్ణుడిగా, అర్జునుడిగా కూడా నటించారు. ఎన్టీఆర్ రాముడిగా నటించిన 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడిగా నటించిన కాంతా రావు, రాష్ట్రపతి అవార్డును కూడా అందుకున్నారు. ఆయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2000లో రఘుపతి వెంకయ్య అవార్డు ప్రదానం చేసి సత్కరిం చింది. ఆయన స్వీయ చరిత్ర "అనగనగా ఒక రాకుమారుడు". తెలంగాణ లోని నల్గొండ జిల్లా కోదాడ ప్రాంతంలో గుడిబండ గ్రామములో 1923లో ఒక కరణీకపు కుటుంబంలో పుట్టి, వంశపారంపర్య పట్వారీ వృత్తిమీద కన్నా ముఖానికి రంగు వేసుకుని నటించటం మీద మక్కువ పెంచు కున్నాడు కాంతారావు. ఏడాది వయసులోనే తండ్రిని కోల్పో యారు. చదువుకునే రోజుల్లోనే నాటకాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆపై వెండితెరపైకి వచ్చి నటుడిగా, నిర్మాతగా కూడా మరపురాని సినిమాలను అందించారు. తెలుగు సినిమా రంగములో అనేక సాంఘి క, జానపద, పౌరాణిక పాత్రలు ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశాడు. హెచ్.ఎం. రెడ్డి తీసిన 'నిర్దో షి' (1951), 'ప్రతిజ్ఞ' (1953) మొదలుకుని 450కి పైగా సినిమా ల్లో నటించారు. విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన జానపద చిత్రాల్లో కథానాయకుడిగా ధీరోదాత్తంగా నటించి పేరు సంపాదించారు. నిర్మాతగా 'సప్త స్వరాలు', 'గండర గండడు', 'ప్రేమ జీవులు', 'గుండెలు తీసిన మొన గాడు' సినిమాలు తీశారు. రామారావు, నాగేశ్వరరావు లకు సమకాలికులుగా కొన్ని సందర్భా లలో వారితో సమానమైన గుర్తింపు పొందారు. దాసరి నారాయణరావు మాటల్లో "తెలుగు చలనచిత్ర సీమకు రామారావు నాగేశ్వర రావులు రెండు కళ్ళైతే , వాటి మధ్య తిలకం వంటివారు కాంతారావు. ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. ఈయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2000 లో రఘుపతి వెంకయ్య పురస్కారంతో సత్కరిం చింది. ఆయన మొత్తం 400 పైగా చిత్రాలలో నటించాడు. ఒక దశాబ్దంపాటు హీరోగా రెండవ హీరోగా ఎన్నెన్నో పాత్రలు పోషించారు. 'నారదుడి' పాత్రకు కాంతారావును తప్పించి మరెవరినీ ఊహించు కోలేనంతగా మెప్పిం చాడు. పౌరాణిక పాత్రలైన రాముడు, కృష్ణుడు పాత్ర ల్లోనూ ఎన్టీఆర్ తరువాత కాంతారావుగా గుర్తింపు జానపద హీరోగా కాంతారావుకు తిరుగులేదు. కాంతారావు కుమారుడు రాజా, సుడిగుండాలు సినిమాలో నటించాడు. ఆ చిత్రానికి ఉత్తమ బాల నటుడిగా నంది అవార్డు అందుకున్నాడు. యువ నటులు రావడం, జానపద చిత్రాలు తగ్గిన క్రమంలో, స్వయంగా సప్తస్వరాలు (1969)బీ గండర గండడు (1969)బీ ప్రేమ జీవులు (1971)బీ గుండెలు తీసిన మొనగాడు (1974)బీ స్వాతి చినుకులు (1989) తదితర చిత్రాలకు నిర్మాతగా వ్యవహ రించారు. సినీ ప్రొడక్షన్ లో ఏ మాత్రం అనుభవం లేని కాంతా రావు స్వయంగా సినిమాలు తీసిన సమయాన 1969 నాటికి తెలంగా ణ రాష్ట్ర సాధన తొలిదశ ఉద్యమం సాగుతోంది. సినిమాలు ఆడే పరిస్థితి లేదు. 'సప్త స్వరాలు' 'గండర గండడు' వంటి సినిమాలు బాగున్నా ఆయన్ని ఆర్థికంగా ఆదుకోలేక పోయాయి. 'ప్రేమ జీవులు' సినిమా ఫ్లాప్. భారీ నష్టం. అయినా సినీ రంగంలోనే వెతుక్కో వాలని ఆ తర్వాత తీసిన మరో రెండు సినిమాలు కూడా లాభాలను చేతికి అందివ్వలేదు. ఫైనాన్షియర్లకు వడ్డీలు కట్టటంతో సరిపోయింది. క్యారక్టర్ ఆర్టిస్ట్ గా కొత్త అవతారం ఎత్తాల్సి వచ్చింది. ఈ లోగా తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్ కు తరలింది. పెరిగిన అప్పుల వల్ల చివరికి కట్టు కున్న ఇల్లును అమ్ముకుని, అప్పులు తీర్చి, ఒక చిన్న పెట్టెతో హైదరా బాద్ చేరారు. చిరుపాత్రలు, టి.వి. సీరియళ్ళు చేశారు. నటుడిగా కాక, వ్యక్తిగతం గా చాలా ఇబ్బందులు పడ్డారు. ఏవయినా సభలకు పిలిస్తే ఇచ్చే డబ్బులు, సన్మానాలు చేసి ఇచ్చే డబ్బుల కోసం ఆశగా ఎదురుచూసే పరిస్థితి. ప్రభుత్వ పరంగా గుర్తింపు లేదు. అతికష్టం మీద ఇచ్చిన రఘుపతి వెంకయ్య అవార్డు తప్పించి మరేమీ లేదు. అన్నీ నిరాశలే. చిట్టచివరి వరకు సొంత ఇంటికల కంటూనేవున్నారు. అడపాదడపా సినీ పెద్దలు ఎవరయినా సహాయం అందించినా అది ఇంటికి సరిపోయేంత కాదు. ఇల్లు గడవటానికి సరిపోయేంత మాత్రమే. చివరికి క్యాన్సర్ బారిన పడ్డారు. అదీ ఆలస్యంగా గుర్తింపు. ఏ దురలవాట్లూ లేక, ఎవరికీ హాని చేయని మనిషి ఒక్క సంవత్సరంలో శరీరాన్ని తినేసిన క్యాన్సర్ దెబ్బకు మరణించారు. సినీరంగానికి వెలుపల స్నేహితులు ఉన్న వాడు కాదు కాంతారావు. తాను పుట్టి పెరిగిన సముద్రమే చేపను ఎత్తి అవతల వేస్తే అది ఎలా విలవిలా కొట్టుకుంటుందో, అలా సినీరంగమనే సముద్రపు ఆటు పోట్లకు బలైన రాకుమారుడు కాంతారావు. ప్రేక్షకుల మనసులో చెరగిపోని ముద్ర వేసిన కాంతా రావు, తన 85వ ఏట, 2009 మార్చి 22న క్యాన్సర్ వ్యాధి మూలంగా హైదరాబాద్‌లో మరణించారు.

# నీటి పరిరక్షణ సామాజిక బాధ్యత

నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారము. ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపరూపమైన పదార్థము. మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో నీరూ అంతే అవసరం. నీరే లేకపోతే పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహాసముద్రాలు ఏమీ ఉండవు. ఇవేమీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి.

భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. అంతటి అమూల్యమైన నీటి విలువను తెలుసు కోడానికి, దానిని వృథా చేయకుండా అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి 1993 నుంచి ప్రతి సంవత్సరం మార్చి 22న అంతర్జాతీయ జల దినోత్సవంగా గుర్తించాలని నిర్ణయించింది.

ఐక్య రాజ్య సమితి, ప్రపంచ జల దినోత్సవాన్ని 1992 యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, రియో డి జెనీరియో సమావేశంలో ప్రతిపాదించింది. దీన్ని 1993వ సంవత్సరం నుంచి నిర్వహించడం ప్రారంభించారు.

మెరుగైన మంచి నీటి వనరుల నిర్వహణ, ప్రాముఖ్యత పట్ల అవగాహనా కల్పించడం కోసం ఐక్య రాజ్య తెలంగాణ ప్రతి సంవత్సరం మార్చి 22ను ప్రపంచ జల దినోత్సవంగా జరుపుతుంది. భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. మన చరిత్రంతా జలవనరుల తోనే ముడిపడి ఉంది. నీటిని పరిరక్షించు కోవాలనే నినాదాన్ని ప్రాచీన నాగరికతలు వెల్లడించాయి. భారతీయులకు నీటి విలువ తెలుసు కనుకే నదులను పూజించే ఆచారం ఉంది. నీటిని పూజించి, నదులకు, చెరువులకు, జలాశయాలకు హారతులిస్తారు. నారం అంటే నీరు. నీటిలో ఉంటాడు కాబట్టి శ్రీమహావిష్ణువుకు నారాయణుడు అని పేరు. నీటినే రూపంగా స్వీకరించి విష్ణువు నీటి విలువను చెప్తున్నాడు. శివుడు ఏకంగా గంగను తన తలపై ధరించి గంగాధరుడయ్యాడు. నీటిని వృధా చేయడం సృష్టికి, భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకమని పురాణాలు, ప్రాచీన గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. నీరు మూడు రూపాలలో... ఘన రూపం అంటే మంచు గడ్డల రూపంలోను, ద్రవ రూపం, సముద్రాలు, నదులు, తటకములు మొదలగునవి, వాయు రూపంలో భూమండలం పై 71 శాతానికి పైగా ఆవరించి ఉంది.

క్రొత్త క్రొత్త సమ్మేళన పదార్థముల తోను, విష పూరిత రసాయన పదార్థాల తోను నీరు కలుషిత మౌతున్నది.

అలా కలుషితమైన జలము జల చక్రము ద్వారా తిరిగి ఆవిరి రూపం ధరిస్తుంది. ఈ క్రమంలో ఆ జలం తనలోని ఇతర కలుషిత పదార్థములను, అనగా రసాయన పదార్థములను కూడా కలుపుకొని వాయు రూపంలో మేఘాలుగా మారి అక్కడి వాతావరణం అనుకూలించ గానే ద్రవించి తిరిగి వర్ష రూపంలో తిరిగి భూమిని చేరుతున్నది. ఆ కలుషిత మేఘాలు వర్షించినపుడు రంగులలో వర్షము కురవడము, ఆమ్ల వర్షాలు కురవడము సర్వ సాధారణము. దాంతో ప్రకృతికి అపార నష్టము జగురుతున్నది. జీవ వ్యవస్థలో నీరు మంచి ద్రావణి, ఇందులో చాలా వరకు లవణాలు కరుగుతాయి. అందుకే దాన్ని విశ్వవ్యాప్త దావణి అంటారు. ఇంచుమించు అన్ని జీవ రసాయనాలు నీటిలో కరుగుతాయి.

ఇందువల్ల నీరు జీవ పదార్థాల రవాణాకు తోడ్పడుతుంది. నీటి ఎద్దడిని ప్రపంచంలో 80 దేశాలు ఎదుర్కొంటున్నాయి. గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచి పోవాల్సిన పరిస్థితిలో కూడా ప్రజలు ఉన్నారు. మంచి నీల్లు దొరకక కుంటల్లో, గుంటల్లో అడుగు బొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితిలో ఎంతో మంది ఉన్నారు. వేసవిలో చాలా చోట్ల నీటి కొరత మూలంగా, కనీసం తాగు నీరు దొరకక ఎంతో మంది బిందెలతో బహు దూరం కిలో మీటర్ల వరకు నడిచి వెళ్లి త్రాగు నీటిని తెచ్చుకునే అనివార్య పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. మంచినీటి కంటే సముద్రపు నీరు చాలా ఎక్కువ పరిమాణంలో ఉంది. మనం నివసించే భూగోళంలో ఉన్న నీటి వనరులలో 99% ఉన్నది ఉప్పునీరే.

ఇది 97% సముద్రాల్లోనే ఉంది. మిగతాది నదులు, చెరువుల్లో ఉంది త్రాగడానికి పనికొచ్చే నీరు 1% మాత్రమే. ఇందులో చెరువుల్లో 0.86%, నదుల్లో 0.02% ఉండగా మిగిలినవి భూగర్భ జలాలు. ప్రపంచ వ్యాప్తంగా త్రాగడానికి ఉపయోగపడే నీరు 0.3% మాత్రమే.

నీటితో జీవం అంకురించింది. ప్రకృతి మనుగడ నీటితోనే కొనసాగుతోంది. జీవవైవిధ్య పరిరక్షణ. జీవం జలంతోనే సాధ్యమవుతుంది. ఇవన్నీ తెలిసినా..నీటిని వృధా చేస్తున్నాం..నీటి వనరుల్ని వ్యర్థాలతో కలుషితం చేస్తున్నాం.

ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుంటే..మనకు అందుబాటులో ఉన్న నీటిని వృధా చేస్తున్నాం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన నీరు ఉండనే ఉండదని. ప్రజలు స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు రాసుకుంటారనీ..(కెమికల్ బాత్) వాటితోనే స్నానాలు చేస్తారనీ..దేశ సరిహద్దుల్లో కాపలా కాయాల్సిన సైనికులు నీటి వనరుల చుట్టు కాపలా కాసా పరిస్థితి ఉంటుందని.. తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారనీ, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చు. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసు కోవడం, వృథాను అరికట్టడం, పొదుపుగా వాడటం, పునర్వి నియోగం..తదితరాలన్నింటికీ ప్రాధాన్య మివ్వాలి.

# మంచి నీటి ఊటలు హిమానీనదాలు

జీవులకు ప్రాణాధారం జలం. భూగ్రహంపై జీవకోటి ఉనికికి కారణం ద్రవరూపంలో ఉన్న నీరు మాత్రమే. అతి ముఖ్య సార్వత్రిక ద్రావణిగా జలధారలు భూఉపరితలంపై నిరంతరం ప్రవహిస్తూనే ఉన్నాయి. భూమిపై ఉన్న జల సంపదలో అత్యధిక మొత్తం సముద్ర జలం రూపంలో లేదా హిమానీనదాలు లేదా గ్లేసియర్స్ రూపంలో ఉండడంతో పాటు కేవలం 3 శాతం మాత్రమే మంచి నీటి జలంగా మానవాళికా అందుబాటులో ఉంటున్నది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి తీవ్రమైన నీటి కొరత లేదా నీటి ఒత్తిడిని అనుభవిస్తున్నది. నేడు మార్కెట్‌లో నీటిని పాల వలె అధిక ధరలకు కొనుక్కోవలసిన అగత్యం ఏర్పడింది. రానున్న కొన్ని దశాబ్దాల్లో నీటి కొరత ఎక్కువై దేశాలు, ప్రాంతాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ జనాభాలో దాదాపు 2.2 బిలియన్ల ప్రజలకు సురక్షిత నీరు అందడం లేదు. రాను రాను నీటి కొరత పెరిగి గొంతులు ఎండిపోయే ప్రమాదం కూడా ఏర్పడనుందని అర్థం అవుతున్నది. మంచి నీటి వనరుల్లో నదులు, చెరువులు, సరస్సులు, వాగులు వంకలు, భూగర్భ జలాలు లాంటి నీటి నిల్వలు వస్తాయి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-6 ప్రకారం "2030 నాటికి అందరికీ నీరు - పారిశుద్ధ్యం" అనే లక్ష్యం సుసాధ్యం అయ్యేట్లుగా కనిపించడం లేదు. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ - పరిశ్రమలకు నీటి అవసరాలు పెరగడంతో రానున్న రోజుల్లో ప్రపంచ మానవాళి నీటి ఒత్తిడి సంక్షోభంలో పడే విధంగా కనిపిస్తున్నది.

తాగు నీరు, సాగు నీరు, పరిశ్రమలు, జన విద్యుత్ కేంద్రాలు, ఉత్పత్తి రంగాలు జల వనరులను అత్యధికంగా వినియోగించుకుంటున్నాయి. ప్రాణికోటి మనుగడకు కారణమైన నీటి కొరతను అధిగమించడానికి ప్రజలకు నీటి ఆవశ్యకత పట్ల తగు అవగాహన పెంచాల్సిన అవసరం ఏర్పడుతున్నదని గమనించిన ఐరాస ప్రతి ఏట 22 మార్చిన "ప్రపంచ నీటి దినోత్సవం లేదా వరల్డ్ వాటర్ డే"ను 1993 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది. నేటి పర్యావరణ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పులు, కార్బన్ ఉద్గారాల పెరగడం, హరిత గృహ వాయువులు అధికం కావడం, భూతాపం పెరగడం లాంటి కారణాలతో హిమానీనదాలు లేదా గ్లేసియర్లు వేగంగా కరుగుతూ తరుగుతూ రానున్న ప్రమాద హెచ్చరికగా మారనున్నాయి. గ్లేసియర్లు వేగంగా కరగడం వల్ల సముద్ర మట్టాలు పెరగడం జరిగి మానవాళికా మరో ప్రమాద ఘంటికలు మోగించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. హిమానీనదాల పరిరక్షణ కేంద్రంగా నేటి మానవాళి తన దృష్టిని పెట్టవలసి ఉందనే విషయాన్ని పరిగణలోకి తీసుకొని 2025 ప్రపంచ నీటి దినం ఇతివృత్తంగా "హిమానీనదాల పరిరక్షణ లేదా గ్లేసియర్స్ ప్రిజర్వేషన్" అనబడే అంశశం కేంద్రంగా అవగాహన కలిపించడం జరుగుతున్నది.

హిమానీనదాల పరిరక్షణే ఏకైక లక్ష్యంగా చేసుకొని 2025 ఏడాదిని "అంతర్జాతీయ హిమానీనదాల సంవత్సరం"గా కూడా ప్రకటించు తగు ప్రచార కార్యక్రమాలను నిర్వహించుటకు భారీ ఏర్పాట్లు చేయడం జరిగింది. అదే విధంగా ప్రప్రథమంగా 2025, మార్చి 21న "ప్రపంచ గ్లేసియర్స్ దినం" కూడా నిర్వహించడం జరిగింది. క్రియోస్ఫియర్, వాతావరణ మార్పులు, నీటి చక్రం, ఆర్థికాభివృద్ధి, పర్యావరణం, పౌర సమాజాల మధ్య నెలకొని ఉన్న సంబంధాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతున్నది. నీరు ద్రవ రూపంలో కాకుండా ఘన మంచు రూపంలో అధికంగా ఉన్నపుడు దాని ప్రతికూల ప్రభావం భూమిపై పడుతుంది. దీనితో పాటు 2025-34 దశాబ్దాన్ని కూడా "క్రియోస్ఫియరిక్ సైన్సెస్ చర్యల దశాబ్దం"గా ప్రకటించడం జరిగింది. ఇదే క్రమంలో నీరు - పారిశుధ్యాలకు సంబంధించిన నివేదికను "వాటర్ టవర్స్ : మౌంటేన్స్ అండ్ గ్లేసియర్స్" అనబడే పేరుతో విడుదల చేయడం జరిగింది.

భూతాపం పెరిగిన కొద్ది హిమానీనదాలు క్రమంగా, వేగంగా కరుగుతూ తరిగిపోతున్నాయి. అధిక మొత్తంలో హిమానీనదాలు కరిగితే వరదలు, కొండచరియలు విరిగి పడడం, సముద్ర మట్టాలు పెరగడం, కరువు కాటకాలు రావడం, జీవ వ్యవస్థల్లో లోపాలు జరగడం లాంటి ప్రతికూలాలు అనుభవంలోకి వస్తాయి. 2023లో గ్లేసియర్స్ కరగడం వల్ల 600 గిగాటన్నుల నీరు వ్యర్థంగా ప్రవహిస్తున్నది. భూగోళంపై ఉన్న మంచి నీటిలో 70 శాతం వరకు మంచు రూపంలోనే ఉంటున్నది. గ్లేసియర్స్ కరగడంతో 1900 నుంచి నేటి వరకు దాదాపు 20 సెమీ సముద్ర టట్టం పెరగడం గమనించారు. భూతాపాన్ని తగ్గిస్తేనే గ్లేసియర్స్ కరిగే వేగం అదుపు చేయబడి ఉంటుందని తెలుసుకోవాలి. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 2025 నివేదిక "సహజ వనరుల కొరత" ఆధారంగా విడుదల చేయబడింది. రానున్న రోజుల్లో అతి ముఖ్యమైన కొరత ప్రమాదాల్లో 4వ స్థానం నీటి ఒత్తిడి స్వీకరించడం జరుగుతున్నది. నీరు తాగడానికి, పారిశుద్ధ్యానికి, వ్యవసాయానికి, పరిశ్రమలకు మాత్రమే కాకుండా పర్యావరణ సమతుల్యత కాపాడడంలో సఫలీకృతం అవుతున్నది. ప్రపంచ నీటి దినం వేదికగా నీటి వనరులను కాపాడడంతో పాటు హిమానీనదాల వేగవంతమైన కరగడాన్ని కూడా తగ్గించడానికి ప్రజలకు పలు మార్గాల్లో ప్రచారాలు పెద్ద ఎత్తున నిర్వహించాల్సింది ఉన్నది. సహజ వనరైన నీటిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, నీటిని ఆదా చేస్తూ, హిమానీనదాలను రక్షించుకుంటూ రాబోయే తరాలకు సుజల వాతావరణం కల్పిద్దాం, నీటిని చుక్క చుక్క సద్వినియోగం చేసుకుందాం.

## ఉమ్మడి వరంగల్ లో పది పరీక్షలు ప్రారంభం

**ప్రజాబలం ప్రతినిధి:** వరంగల్ ఉమ్మడి జిల్లాలో టెన్త్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. అధికారులు పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసారు. ఈసారి ఐదునిమిషాలు ఆలస్యమైనా అనుమతించమన్నారు అధికారులు. పరీక్ష డ్యూటీ కి వచ్చే ఇన్విజిలేటర్లు మొబైల్స్ తీసుకురావద్దని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల దగ్గర సెక్షన్ 163 బీఎన్ఎస్ అమలు చేసారు. సీసీ కెమెరాలతో పూర్తి పర్యవేక్షణ చేస్తున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో245 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసారు. హనుమకొండ జిల్లాలో 67 పరీక్షా కేంద్రాలు,వరంగల్ జిల్లాలో 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసారు. ములుగు జిల్లాలో21 పరీక్షా కేంద్రాలు, భూపాలపల్లి జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలు వున్నాయి. జనగామ జిల్లాలో 41 పరీక్షా కేంద్రాలు, మహబూబాబాద్ జిల్లాలో 46 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసారు.

## పదవ తరగతి కేంద్రాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

**సిద్దిపేట ప్రజాబలం ప్రతినిధి:** పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు పరీక్షా కేంద్రాల వద్ద 163 బి ఎన్ ఎస్ ఎస్, 2023 అమలు, సిద్దిపేట పట్టణంలో ఉన్న పదవ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్ ఆర్ కే టెక్నో స్కూల్ తదితర పరీక్ష కేంద్రాలను పరిశీలించి పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు గురించి తగు సూచనలు సలహాలు చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 79 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షలు జరిగే సమయంలో సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు పేపరు వచ్చేటప్పుడు తీసుకొని వెళ్లేటప్పుడు తప్పకుండా ఎస్కార్ట్ ఉండాలని సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో అధికారులు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

# అఖిలప్రియ సొంత పార్టీలో శత్రువులు..

# బయిట పడేదెలా...

**కర్నూలుప్రజాబలం ప్రతినిధి: మార్చి 21,** మాజీమంత్రి అఖిలప్రియ నిత్యం కాంట్రవర్సీకి కేరాఫ్ అడ్రస్ గా ఉంటారు. ఎవరికైనా ప్రత్యర్థి పార్టీల నుంచి శత్రువులుంటారు. కానీ అఖిలప్రియకు మాత్రం శత్రువులందరూ సొంత వాళ్లే. వాళ్లతో ఈమె శతృత్వం పెంచుకుంటుందో లేక అఖిలప్రియతో వాళ్లు విభేదిస్తున్నారో తెలియదు కానీ సొంత పార్టీ నేతలే ఆమెకు ఇబ్బందికరంగా మారారు. ఆళ్లగడ్డ తన సొంత అడ్డా అని భావించిన అఖిలప్రియకు 2019 ఎన్నికల్లో ఓటమి తప్పలేదు. అయితే ఆ ఓటమికి గల కారణాన్ని అఖిల ప్రియ విశ్లేషించుకోకుండా ఈసారి గెలిచిన తర్వాత కూడా అదే పంథాను కొనసాగిస్తుండటంతో పరిస్థితి మారలేదు. తండ్రి, తల్లి కి ఉన్న బంధాలను కావలని తెంచుకున్నట్లే కనపడుతుంది. ఒంటరిపోరు చేయడానికే అఖిలప్రియ ఇష్టపడుతున్నారని స్పష్టంగా తెలుస్తోంది. భూమా శోభానాగిరెడ్డి, నాగిరెడ్డితో అనుచరులు, బంధువులను అఖిలప్రియ ఇప్పటికే దూరం చేసుకున్నారు. సొంత బంధువులను కూడా ఆమె దగ్గరకు రానివ్వడం లేదు. కనీసం వారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అఖిలప్రియ 2014లో తల్లి మరణంతో ఆమె రాజకీయాల్లోకి చిన్న వయసులో అడుగు పెట్టారు. వెంటనే ఏకగ్రీవంగా ఆళ్లగడ్డకు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత తన తండ్రి భూమా నాగిరెడ్డితో కలసి ఆమె టీడీపీలో చేరారు. నాగిరెడ్డి మరణంతో అఖిలప్రియను మంత్రి పదవి వరించింది. అప్పటి నుంచి ఆమె వ్యవహార శైలి మారింది. మంత్రి పదవిలో ఉన్నంత కాలం అయిన వారిని కూడా కాల్చుకుతిన్నారన్న పేరు పొందడంతో 2019 ఎన్నికలలో ఓటమి పాలు కావాల్సి వచ్చింది.. భూమా నాగిరెడ్డికి అత్యంత సన్నిహితుడు ఏవీ సుబ్బారెడ్డితో బద్ధ శత్రుత్వాన్ని పెంచుకున్నారు. బంధుత్వం లేకపోయినా చిన్న నాటి నుంచి మామా అని పిలచే ఏవీతో వైరం ఆమెకు మంచి కంటే చెడు చేసిందనే చెప్పాలి. ఆస్తుల వివాదమే కారణమని చెబుతున్నప్పటికీ, ఆధిపత్య పోరు కోసమేనన్నది అఖిలప్రియను దగ్గర నుంచి చూసిన వాళ్లు చెబుతున్న విషయం. ఏవీతో వైరం చివరకు హత్యలు చేసుకునే వరకూ వెళ్లింది. ఇక అఖిలప్రియ మేనమామ ఎస్.వి. జగన్ తోనూ వైరం పెట్టుకున్నారు. జగన్ మోహన్ రెడ్డి విజయ డెయిరీ ఛైర్మన్ గా ఉన్నారు. ఆయనను ఆ పదవి నుంచి దించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. దీంతో ఎస్వీ కుటుంబం నుంచి కూడా ఆమెకు మద్దతు కొరవడినట్లయింది. వెంకట్రావు ఓపెన్ అయిపోయారుగా సొంత జిల్లా మంత్రులతోనే... ఇక సొంత జిల్లాలోని టీడీపీ నేతలతోనూ ఆమెకు సఖ్యత లేదు. ఏకంగా మంత్రులతోనే అఖిలప్రియ విభేదాలు పెట్టుకున్నట్లే కనపడుతుంది. మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డిలు ఇద్దరూ అఖిలప్రియకు వ్యతిరేకంగానే ఉన్నట్లు కనపడుతుంది. ఆమె వ్యవహరిస్తున్న తీరును ఇద్దరు మంత్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. వారితో కూర్చోవడం ఇష్టం లేక జడ్పీ సమీక్ష సమావేశానికి తనకు బదులు తన సోదరుడు జగద్విఖ్యాత్ రెడ్డిని పంపడం కూడా వివాదంగా మారింది. మొత్తం మీద అఖిలప్రియ ఏమనుకుంటున్నారో తెలియదు కానీ, నాలుగేళ్లు నా దే రాజ్యం అన్నట్లు వ్యవహరిస్తున్నారని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారంటే ఆమె పునరాలోచించుకోవడం మంచిదన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# ఏపీలో రెండు కొత్త రైల్వే లైన్లు

ఒంగోలు మార్చి 21, ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైలు మార్గాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు కొనసాగుతున్నాయి. అలాగే ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కలగా మిగిలిన ఒంగోలు-దొనకొండ, మార్కాపురం -శ్రీశైలం రైలు మార్గాలను ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈ రైల్వే లైన్ల అంశాన్ని లోక్‌సభలో ప్రస్తావించారు. ఈ రైల్వే లైన్లను నిర్మించాలని కేంద్రాన్ని కోరడంతో పశ్చిమ ప్రాంత వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కేంద్రంలో కదలిక వచ్చి రైల్వేమంత్రి స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారుగతంలోనే ప్రకాశం జిల్లాకు సంబంధించి ఒంగోలు - దొనకొండ రైల్వేలైను నిర్మాణం అంచనాలు తయారుచేయాలని ఆదేశాలు వచ్చాయి. మార్కాపురం నుంచి శ్రీశైలంకు రద్దీ పెరగడంతో ఈ రైల్వేలైను ఉపయోగంగా ఉంటుందని భావించారు. ఈ రైల్వే లైన్ పూర్తి చేస్తే గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే మల్లన్న భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ అంశాన్ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గతంలో కూడా లోక్‌సభలో ప్రస్తావించారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి ఈ రెండు కొత్త రైల్వేలైన్లకు అనుమతులు ఇవ్వాలని కోరారు. తాజాగా మరోసారి ఆయన నడికుడి -శ్రీకాళహస్తి రైల్వేమార్గంలో డెమో రైళ్లను నడపటంతో పాటుగా జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని కోరారు. పశ్చిమ ప్రాంతంలోని ఈ మూడు రైల్వేలైన్లు కనుక పూర్తి చేస్తే రైతులకు, ప్రజలకు రవాణా సౌకర్యం కూడా మెరుగవుతుందంటున్నారు.ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం మీదుగా నడికుడి -శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ రైలు మార్గంలో గుంటూరు జిల్లా నడికుడి నుంచి శ్యామలాపురం, దర్శి, పొదిలి వరకు పట్టాల పనులు పూర్తి చేశారు. దర్శి వరకు రైళ్లతో ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. ప్రస్తుతం పొదిలి మండలంలోని దాసళ్లపల్లి, పొదిలిలో స్టేషన్ల నిర్మాణం కొనసాగుతోంది. పొదిలికి సమీపంలోని రాజుపాలెం దగ్గర నిర్మిస్తున్న స్టేషన్‌కు ముందు ట్రాక్ పనులు ప్రారంభం కాలేదు. అక్కడ రైతులు కోర్టుకు వెళ్లడంతో 200 మీటర్ల పనులు నిలిపివేసి.. మిగిలిన చోట్ల పనులు చేపట్టారు. ఈ రైలు మార్గంలో పొదిలి రైల్వేస్టేషన్ అవతల నుంచి కనిగిరి వరకు వాగులపై వంతెనల నిర్మాణాలు పూర్తి చేయగా.. ట్రాక్ పనులు సైతం ముగింపు దశకు వచ్చాయి. పొదిలి, కనిగిరి, పామూరు మీదుగా ఉమ్మడి నెల్లూరు జిల్లా వైపు ట్రాక్ నిర్మాణ పనుల్ని చేపట్టాలని భావిస్తున్నారు. ఈ మేరకు నెల్లూరు జిల్లాలో కూడా ట్రాక్ పనులు త్వరలో ప్రారంభిస్తారని చెబుతున్నారు.

# పది నెలలైనా ఇంతేనా

# తమ్ముళ్లలో పెరుగుతున్న అసహనం

గుంటూరు మార్చి 21, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటుతుంది. అయితే ఇప్పటికే క్యాడర్ లో ఒకరకమైన అహసనం కనపడుతుంది. తమకు ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కించడమేంటని క్యాడర్ సూటిగానే ప్రశ్నిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలతో కొందరు కుమ్మక్కై వెనకాడుతున్నారని కూడా తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. తమపై గత ప్రభుత్వంలో తప్పుడు కేసులు నమోదు చేసిన వారిపై ఇప్పటి వరకూ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సోషల్ మీడియా వేదికగా తెలుగు తమ్ముళ్లు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. అయితే చట్ట ప్రకారమే చర్యలకు దిగుతామని చంద్రబాబు పదే పదే చెబుతున్నా తమ్ముళ్లు మాత్రం తొందరపడుతున్నారన్న టాక్ వినపడుతుంది. ఇదిలా ఉండగానే ఎమ్మెల్యేలు కూడా అసహనం వ్యక్తం చేస్తుండటం పార్టీని ఇరకాటంలోకి నెట్టేసింది. తాజాగా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీ వేదికగా చేసిన కామెంట్స్ పార్టీలో కాక రేపుతున్నాయి. యార్లగడ్డ వెంకట్రావు వ్యాఖ్యలను పార్టీ అగ్ర నాయకత్వం సీరియస్ గా తీసుకుంది. ఏదైనా ఉంటే ఇటువంటి విషయాలు అంతర్గతంగా మాట్లాడాలి తప్పించి ఇలా అసెంబ్లీలో మాట్లాడటేమేంటని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అసెంబ్లీలో యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయ్యామన్న ఆనందం లేదని, తమ పనులు ఒక్కటి కూడా జరగడం లేదని, ఎందుకు ఎన్నికయ్యామో కూడా అర్థం కావడం లేదని వెంకట్రావు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. యార్లగడ్డ వెంకట్రావు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కృష్ణా జిల్లా డీసీసీబీ బ్యాంకు ఛైర్మన్ గా పనిచేశారు. ఆ సమయంలో అనేక సంస్కరణలను చేపట్టారు. అయితే ఆయన తర్వాత వైసీపీకి రాజీనామా చేసి యార్లగడ్డ వెంకట్రావు టీడీపీలో చేరిపోయారు. వెంకట్రావు రాజీనామా చేసిన తర్వాత బ్యాంకులో అనేక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. పెద్దయెత్తున అవినీతి జరిగిందని యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి రావడంతో వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. కానీ కొన్ని నెలలు గడుస్తున్నా అధికారులు డీసీసీబీలో జరిగిన అవకతవకలపై విచారణ జరపకపోవడంపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ఉన్నతాధికారుల తప్పిదమా? లేక అగ్రనేతల నిర్లక్ష్యమా? అన్నది తేలకుండా ఉంది. .. ఇది ఒక యార్లగడ్డ వెంకట్రావు మాత్రమే కాదు టీడీపీలో ఉండి గత ప్రభుత్వంలో కేసులు నమోదు చేయించుకుని, జైలుకు వెళ్లి వచ్చిన వారు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. చట్టం పేరుతో కాలయాపన చేస్తూ పోతుంటే క్యాడర్ లో తాము పలచన అవ్వక తప్పదని వారు చెబుతున్నారు. రాయలసీమలోని కొందరు ఎమ్మెల్యేలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మరికొందరు ఎమ్మెల్యేలు కూడా మంత్రుల వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. అయితే తొందరపడవద్దని వరసగా వేధించిన వైసీపీ నేతలపై కేసులు నమోదు చేస్తామని బుజ్జగించి పంపుతున్నారు. దీంతో టీడీపీలో ఇటు క్యాడర్ తో పాటు అటు ఎమ్మెల్యేలు కూడా పెల్లుబుకుతున్న ఆగ్రహంపై నీళ్లు చల్లాల్సిన అవసరం అధినాయకత్వంపై ఉంది.

# వైసీపీలో కలకలం

# దొంగ సంతకాలపై చర్చ

విజయవాడ, మార్చి 21, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ సమావేశాలను వైఎస్ఆర్‌సీపీ బహిష్కరించింది అనేది అందరికీ తెలిసిన విషయం. అయితే ఏడుగురు ఎమ్మెల్యేలు మాత్రం రహస్యంగా వచ్చి హాజరైనట్లుగా రిజిస్టర్ లో సంతకాలు చేసి వెళ్లారు. మొత్తంగా ఉన్నకొండు మంది ఎమ్మెల్యేల్లో జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రం సంతకాలు చేయలేదు. అసెంబ్లీ చివరి రోజున ఈ విషయం స్పీకర్ అయ్యన్న పాత్రుడు దృష్టికి వచ్చింది. ఆయన సభలో ప్రకటించారు వైసీపీ ఎమ్మెల్యేలు దొంగల్లా వచ్చి రిజిస్టర్ లో సంతకాలు పెట్టి కోవాల్సిన అవసరం ఏముదని ప్రశ్నించారు. ఆయన బయట పెట్టడంతో ఆ ఎమ్మెల్యేలు ఎవరో తెలిసిపోయింది. స్కూలు, ఆఫీసుల్లో విద్యార్థులు, ఉద్యోగులు పంచ్ కొట్టి బయటకు వెళ్లిపోయినట్లుగా ఈ ఎమ్మెల్యేల వ్యవహారం ఉండటంతో ఎమ్మెల్యేల్లోనే కాదు..రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది.

అసెంబ్లీకి వెళ్లకూడదని అనుకున్నప్పుడు వెళ్లకుండా ఉండాలి కానీ రహస్యంగా సంతకాలు పెట్టాల్సిన అవసరం ఏమిటన్నది చర్చనీయాంశం అయింది. అసెంబ్లీకి హాజరు కాకపోతే అనర్హతా వేటు పడుతుందని స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదే పదే చెబుతున్నారు. అందుకే వారు గవర్నర్ ప్రసంగం రోజున హాజరై కొంత సేపు ఉండి వెళ్లిపోయారు.

అయితే తర్వాత ఆ రోజు వర్కింగ్ డే కాదని అసెంబ్లీ వర్గాలు చెప్పాయి. దాంతో మరో రోజు హాజరు కావాల్సిన అవసరం పడింది. అలా హాజరు కాకుండా.. ఎప్పుడు వచ్చారో కానీ.. నేరుగా అసెంబ్లీకి వచ్చి రిజిస్టర్ లో సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. ఒక్క నిమిషం కూడా సభలోకి రాలేదు. ఈ సంతకాలు చెల్లుతాయా లేదా అన్నది స్పీకర్ రూలింగ్ ను బట్టి ఉంటుంది. చెల్లుబాటు అంశంపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఎలాంటి ప్రకటన చేయలేదు. అదే సమయంలో అసెంబ్లీకి హాజరైనప్పుడు ప్రత్యేకంగా జీతభత్యాలు వస్తాయి. వాటి కోసం సంతకాలు చేసి ఉంటారని అంటున్నారు. ఎమ్మెల్యేలకు జీతభత్యాలు లక్షల్లోనే ఉంటాయి. అసెంబ్లీకి హాజరు కాని కారణంగా వాటిని ఆపేస్తే.. సమస్యలు వస్తాయని వచ్చి సంతకాలు పెట్టి ఉంటారని భావిస్తున్నారు. ప్రజలు ఓట్లు వేసి పంపించింది..అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలు చర్చించడానికి. అయితే ఎమ్మెల్యేలు జగన్ కు ప్రతిపక్ష హోదా ఇవ్వాలన్న కారణంగా అసెంబ్లీకి వెళ్లడం లేదు. జగన్ కు ప్రతిపక్ష హోదా ఇస్తేనే వెళ్తామంటున్నారు. వైసీపీకి ఉన్న పదకొండు మంది ఎమ్మెల్యేలలో చాలా మంది కొత్త ఎమ్మెల్యేలు. అసెంబ్లీకి హాజరై అధ్యక్ష అని ప్రసంగించాలని అనుకుంటున్నారు. కానీ అధినేత అంగీకరించకపోవడంతో అసెంబ్లీకి వెళ్లలేకపోతున్నారు.

దొంగ సంతకాలపై వైసీపీ సైలెన్స్

అసెంబ్లీలో వైసీపీ సభ్యులు దొంగల్లా వచ్చి సంతకాలు పెట్టి సభలోకి రాకుండా పారిపోతున్నారంటూ సాక్షాత్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చాలా పెద్ద కామెంట్ చేశారు. సహజంగా ఇలాంటి కామెంట్లపై వెంటనే వైసీపీ నుంచి రియాక్షన్ రావాలి. సభకు వస్తున్నామనో, లేక రాలేకపోతున్నామనో, అసలు తాము సంతకాలు పెట్టలేదనో, లేక తమ పేరుతో ఇంకెవరైనా పెడుతున్నారనో అనాలి. కానీ ఇంత వరకు వైసీపీ నుంచి సౌండ్ లేదు. అంటే దొంగ సంతకాలు నిజమేనని ఆ పార్టీ ఒప్పుకున్నట్లైందని టీడీపీ ఎద్దేవా చేస్తోంది. ఆఖరికి ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న నేతలు కూడా ఇంత చీప్ గా ప్రవర్తిస్తారా అంటూ కౌంటర్లిస్తున్నారు.వైసీపీ వాళ్లు జగన్ ని సింగిల్ సింహంతో పోలుస్తుంటారు.

ప్రతి ఎన్నికల్లోనూ ఎవరితో పొత్తు పెట్టుకోకుండా జగన్ సింగిల్ గా బరిలో దిగుతారనేది వారి మాటల సారాంశం. ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్యేలు కూడా జగన్ ని ఒంటరి చేశారంటూ టీడీపీ ఓ రేంజ్ లో కౌంటర్లివ్వడం విశేషం. ఎమ్మెల్యేలుగా తమపై అనర్హత వేటు పడుతుందేమోననే భయంతో కొంతమంది అసెంబ్లీ రిజిస్టర్ లో సంతకాలు పెడుతున్నారు. అయితే సభకు మాత్రం రావడం లేదు. ఇది జగన్ తీర్మానానికి విరుద్ధం. తనను ప్రతిపక్షనేతగా గుర్తిస్తేనే సభకు వస్తామని భీష్మించుకు కూర్చున్నారాయన. అయితే వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రం ఆయన శపథం పట్టించుకోకుండా తమ సీట్లు కాపాడుకోవడం కోసం పాకులాడటం విశేషం.జగన్ కి ప్రతిపక్ష నేత హోదా కావాలి, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రం తమ పదవులు మిగలాలి.

ఈ క్రమంలో స్పష్టంగా అక్కడ సంఘర్షణ మొదలైంది. ఒకవేళ జగన్ పై అనర్హత వేటు పడినా.. ఆయన మాత్రం తన సీటులో గెలిచే అవకాశాలు ఎక్కువ. అదే సమయంలో మిగతా వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే.. ఆయా ప్రాంతాల్లో వారు గెలవాలంటే కత్తిమీద సాము చేయాలి. ఆర్థికంగా బాగా చితికిపోతారనేది వేరే విషయం. దీంతో వారంతా సేఫ్ గేమ్ ఆడుతున్నారు. అసెంబ్లీకి వచ్చి సంతకాలు పెట్టిపోతున్నారు. అయితే ఇక్కడ సంతకాలపై వైసీపీ పూర్తిగా కార్నర్ అయిపోయింది. తమ సభ్యులు అసెంబ్లీకి వస్తున్నారనే విషయంపై కనీసం స్పందించడానికి కూడా ఆ పార్టీ తరపున ఎవరూ ముందుకు రాకపోవడం విశేషం. ఈ విషయంలో వైసీపీ, ఆ పార్టీ అనుకూల మీడియా తేలు కుట్టిన దొంగలా మారింది. కనీసం దానిపై స్పందించేంత సాహసం కూడా వైసీపీ నేతలెవరూ చేయట్లేదు. జగన్ పేరెత్తితేనే అంతెత్తున ఎగిరిపడే సోషల్ మీడియా మేధావులు కూడా ఈ దొంగసంతకాలను కవర్ చేయలేక కష్టపడుతున్నారు. ఇప్పటి వరకూ వైసీపీ స్పందించలేదంటే దానర్థం దొంగ సంతకాలు నిజమనే. దీంతో ఆ పార్టీ పరువు పూర్తిగా మంటగలిసిందని అంటున్నారు. అయితే ఇక్కడ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాత్రం స్పందించారు. ఇక్కడ కూడా ఆయన బహుజన ఎమ్మెల్యేలను దొంగలన్నారంటూ టాపిక్ ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడం విశేషం. ఆయన రెస్పాన్స్ ని మాత్రం వైసీపీ సోషల్ మీడియా ప్రచారం చేసుకుంటోంది కానీ, పార్టీ తరపున ఎవ్వరూ మాట్లాడే సాహసం చేయడం లేదు.

# వెతుకుతున్న నిఘా కళ్లు

విజయవాడ, మార్చి 21, ట్రాఫిక్ పోలీసులు లేరని లైట్ తీసుకున్నారు.. నిబంధనల్ని పట్టించుకోలేదు. కట్ చేస్తే ఆన్‌లైన్‌లో చెక్ చేస్తే వాహనాలకు భారీగా చలానాలు కనిపించాయి. విజయవాడకు చెందిన ఆటో డ్రైవర్ ఒక రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా జంప్ చేశాడు. రెండు రోజుల తర్వాత ఈ-చలానా చెక్ చేస్తే రెడ్ సిగ్నల్ జంప్ చేసినందుకు రూ.వెయ్యి జరిమానా పడింది. మరో విద్యార్థి హెల్మెట్ లేకుండా ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి ఒకే బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేశారు.

దీంతో ఈ బైక్‌కు రూ.2000 జరిమానా పడింది. పోలీసులు లేకుండా జరిమానాలు ఎలా సాధ్యమంటూ ఆరా తీస్తే అసలు సంగతి తెలిసింది.విజజయవాడలో ట్రాఫిక్ కూడళ్లపై పోలీసులు నిఘాను పెంచారు. మొన్నటి వరకు సిగ్నల్స్ దగ్గర వాహనదారులకు అవగాహన కల్పించిన పోలీసులు.. తాజాగా ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ/ ఐటీఎంఎస్ (ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)ల ద్వారా నిఘా పెంచారు. ఐటీఎంఎస్ ద్వారా ఈ చలానాలను నమోదు చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు లేరని గీత దాటితే జరిమానాలు పండుతున్నాయి. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ఈ ఐటీఎంఎస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మార్చి 1 నుంచి అమల్లోకి రాగా.. ముందే అధికారులు ప్రకటనలు కూడా ఇచ్చారు. ఐటీఎంఎస్ విధానం ఉందని చాలామందికి తెలియలేదు.. దీంతో కెమెరాలకు అడ్డంగా దొరికిపోతున్నారు.విజయవాడలో ట్రాఫిక్ పెరిగిపోయింది.. పోలీసు సిబ్బంది కూడాసరిపడా లేరు. అయినా సరే మొన్నటి వరకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. అయితే పోలీసులు లేనిచోట్ల కొందరు వాహనదారులు రెడ్ సిగ్నల్ పడినా ఆగకుండా వెళ్లిపోతున్నారు. ఇలా వెళ్లడంతో మిగిలిన వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. నిబంధనల్ని పాటించనివారిని కట్టడి చేసేందుకుఐటీఎంఎస్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు ట్రాఫిక్ పోలీసులు. విజయవాడలోని ఆరు కూడళ్లలో ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పాటు చేయగా.. మరో 10 చోట్ల కూడా తీసుకురావాలని భావిస్తున్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని.. చలనాలు కొని తెచ్చుకోవద్దంటున్నారు పోలీసులు.రెడ్ సిగ్నల్ పడిన తర్వాత వెళితే జరిమానా పడుతుందన్నారు. ట్రాఫిక్ పోలీసులు లేరని ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వెళితే కెమెరాకు దొరికిపోతారంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు రెడ్ సిగ్నల్ జంప్, హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆటోడ్రైవర్‌కు యూనిఫాం లేకపోవడం, వన్ వే నిబంధన ఉల్లంఘన, ఓవర్‌లోడ్ వంటి అంశాలను గమనిస్తున్నారు. మార్చి 6 నుంచి ఈ ఐటీఎంఎస్ చలానాల విధింపును అమలు చేస్తున్నారు. విజయవాడలో వారం రోజుల్లో 211 మంది ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించడంతో జరిమానా విదించారు. ఏ ఉల్లంఘనకైనా రూ.1000లు కట్టాల్సిందే.. ఒకవేళ ట్రాఫిక్ ఉల్లంఘన అత్యంత తీవ్రమైనదైతే.. కొత్త మోటారు వాహనాల చట్టం ప్రకారం రూ.10వేల వరకు జరిమానా విధించే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరించారు పోలీసులు. వాహనదారులు ఈ విషయాలను గమనించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# పది పరీక్షలు షురూ



కుత్బుల్లాపూర్ : తెలంగాణ రాష్ట్రములో లో శుక్రవారం పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం నుంచి ఏప్రిల్ నాలుగవ తేదీవరకు పరీక్షలు నిర్వహిస్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో మొత్తం 53 పరీక్షా కేంద్రాలు.. 12,672 మంది విద్యార్థులు వ్రాస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకుంటున్నారు. హాజరవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు అన్ని సదుపాయాలుఅధికారులు ఏర్పాట్లు చేసారు.

# మూడున్నర కోట్ల జనాభా...

# నాలుగున్నర కోట్ల మొబైల్ ఫోన్లు

హైదరాబాద్ మార్చి 22, తెలంగాణలో జనాభా కంటే మొబైల్ ఫోన్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇది ఆధునిక టెక్నాలజీ వినియోగం, రాష్ట్రంలోని కనెక్టివిటీ స్థాయిని సూచిస్తుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ జనాభా సుమారు 3.50 కోట్లు (35 మిలియన్లు)గా ఉంది. అయితే, 2025 నాటికి ఈ సంఖ్య కొంత పెరిగి 3.77 కోట్లు లేదా అంతకంటే ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేయవచ్చు, ఎందుకంటే రాష్ట్ర జనాభా దశాబ్ద వృద్ధి రేటు (2001?2011) 13.58%గా ఉంది. మొబైల్ ఫోన్ సంఖ్యల విషయానికొస్తే, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా తాజా డేటా ప్రకారం, తెలంగాణలో యాక్టివ్ మొబైల్ కనెక్షన్ల సంఖ్య జనాభా కంటే ఎక్కువగా ఉంది. 2023 సెప్టెంబర్ నాటికి తెలంగాణలో 4.5 కోట్లకు పైగా మొబైల్ సబ్‌స్క్రిప్షన్లు ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఇది జనాభా కంటే సుమారు 20?25% ఎక్కువ.

బహుళ సిమ్ వినియోగం: చాలా మంది వ్యక్తులు ఒకటి కంటే ఎక్కువ సిమ్ కార్డులను ఉపయోగిస్తారు ఒకటి వ్యక్తిగత వినియోగం కోసం, మరొకటి వ్యాపారం లేదా ఇంటర్నెట్ కోసం. ఇది మొబైల్ కనెక్షన్ల సంఖ్యను పెంచుతుంది.

ఇంటర్నెట్ వ్యాప్తి: తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో, ఇంటర్నెట్ వినియోగం చాలా ఎక్కువ. దీని కోసం చాలా మంది డేటా సిమ్‌లను అదనంగా కొనుగోలు చేస్తారు.

వ్యాపార కనెక్షన్లు: ఐటీ హబ్‌గా ఉన్న హైదరాబాద్‌లో వ్యాపార సంస్థలు, కంపెనీలు ఉద్యోగుల కోసం బహుళ కనెక్షన్లను నిర్వహిస్తాయి.

పిల్లలు, వృద్ధులు: జనాభాలో కొంత శాతం (పిల్లలు, వృద్ధులు) ఫోన్‌లను ఉపయోగించకపోయినా, కనెక్షన్ల సంఖ్య వారిని కూడా మించిపోతుంది.

5 కోట్లకు చేరే అవకాశం..

ఈ ట్రెండ్ కొనసాగితే, తెలంగాణలో మొబైల్ కనెక్షన్ల సంఖ్య 5 కోట్లకు చేరవచ్చు, అదే సమయంలో జనాభా 4 కోట్ల లోపే ఉండవచ్చు. ఇది జనాభా కంటే ఫోన్ సంఖ్యలు ఎక్కువగా ఉన్నాయనే వాస్తవాన్ని బలపరుస్తుంది. ఈ ధోరణి భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా కనిపిస్తుంది, కానీ తెలంగాణలో ఐటీ రంగం మరియు అధిక అక్షరాస్యత (66.46% ? 2011, ఇప్పుడు మరింత పెరిగి ఉండవచ్చు) దీనిని మరింత ప్రోత్సహిస్తున్నాయి.

# ప్రైవేటీకరణపై ఇంకా ఆందోళనే

విశాఖపట్టణం, మార్చి 21, గత కొద్దిరోజులుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం కుదిపేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించడంతో ప్రైవేటీకరణ నిలిచిపోయిందని అంతా భావిస్తున్నారు. అయితే కార్మికులతో పాటు ఉద్యోగుల్లో మాత్రం ఆందోళన కొనసాగుతోంది. ఇలా ప్యాకేజీ ఇచ్చే కంటే విశాఖ స్టీల్ కు సొంత గనులు కేటాయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్లాంట్ తన కాళ్ళ మీద తాను నిలబడేలా చేయాలని కోరుతున్నారు. ఇప్పటికీ ప్రైవేటీకరణ ఆగలేదన్నది కార్మికుల అభిప్రాయం. ఈ విషయంలో కేంద్రం కూడా పూర్తి స్పష్టత ఇవ్వలేదు. తాజాగా మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. పాడి త్రినాథ్ అనే కార్మిక సంఘం నేత కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు ఒక లేఖ రాశారు. ప్రైవేటీకరణ అంశంపై స్పష్టత కోరుతూ ఆయన ఈ లేఖ రాశారు. తమ నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని ఉక్కు మంత్రిత్వ శాఖ స్పష్టత ఇచ్చేసింది. దీంతో కార్మిక సంఘాలు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉద్యమించడానికి సిద్ధపడుతున్నాయి.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తెర పైకి వచ్చింది. అప్పట్లో జగన్మోహన్ రెడ్డి సర్కార్ ఈ ప్రైవేటీకరణను అడ్డుకోలేకపోయిందని కార్మిక సంఘాలు ధ్వజమెత్తాయి. అదే సమయంలో తాము అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చంద్రబాబుతో పాటు పవన్ హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే విశాఖ ఉక్కు కు వేల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించింది కేంద్రం. కానీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిచిపోయిందని విస్పష్ట ప్రకటన చేయలేదు కేంద్రం. దీంతో కార్మిక సంఘాల్లో ఒక రకమైన అనుమానం ఉంది. ఫాక్ట్ చెక్ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేశారు. అందులో భాగంగా కార్మిక సంఘం నేత లేఖ రాశారు. అయితే దానికి రిప్లై ఇచ్చే క్రమంలో ఉక్కు పరిరక్షణకు తమ వంతు కృషి ఉంటుందని చెప్పిందే కానీ.. ఇక్కడ కూడా స్పష్టత ఇవ్వలేదు. పైగా విశాఖ ఉక్కును కేంద్రం విక్రయిస్తుందనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొంది.గతంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై ఉద్యమాలు తీవ్రంగా సాగుతున్న సమయంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి రంగంలోకి దిగారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను సందర్శించారు. అనంతరం విశాఖ స్టీల్ ను ప్రైవేటీకరించబోమని తేల్చి చెప్పారు. అటు తరువాత పదివేల కోట్లకు పైగా నిధులను కూడా కేటాయించారు. దీంతో ఇక ప్రైవేటీకరణ అనేది ముందుకు సాగదని అంతా భావించారు. కానీ ఇప్పుడు విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అంశంపై పూర్తి స్పష్టతనివ్వడం లేదు కేంద్రం. నిలుపుదల చేస్తామని నేరుగా చెప్పడం లేదు. ప్రైవేటీకరణ ఆగదని సంకేతాలు ఇచ్చేలా చెప్పడంతో మరోసారి అనుమానాలు ప్రారంభమయ్యాయి.

# జైలు పక్షిలా పోసాని...

# పాపం.. పట్టించుకొనేవారేరి

కడప, మార్చి 21, పోసాని కృష్ణమురళీ జైళ్లు పట్టుకు తిరుగుతున్నారు. ఒకచోట కస్టడీ అయిపోగానే మరోచోటకు వెళుతూ రాష్ట్రంలోని అన్ని జైళ్లను చుట్టేస్తున్నారు. సినిమా రంగంలో అత్యంత గౌరవ, మర్యాదలు అందుకున్న వ్యక్తికి ఇలా జరగాలని ఎవరూ కోరుకోరు.. కానీ ఆయన ప్రవర్తన, మాటలే ఆయన ప్రస్తుతం అనుభవిస్తున్న జీవితానికి కారణం అని అంతా అంటున్నారు. అయితే.. ఇదే పోసాని ఎవరి కోసం అయితే నోటికి వచ్చినట్లు మాట్లాడారో.. అదే నాయకుడు కనీసం పోసాని గురించి మాట్లాడడం లేదు. ఆయన్ను పలకరించేందుకు సైతం ప్రయత్నించలేదు. ఏ వైసీపీ కోసం అయితే కష్టపడ్డారో, ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారో.. అదే వైసీపీ పోసాని గురించి పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. మొదట్లో.. వైసీపీలోని కొంత మంది నేతలు.. ముఖ్యంగా పొన్నవోలు సుధాకర్ రెడ్డి ప్రయత్నాలు చేసారు. కానీ..ఇప్పుడు మాత్రం ఎవరూ స్పందించడం లేదు.కూటమి పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అందరికీ మాటలు హద్దులు దాటాయి. వాళ్ల స్థాయిని, స్థానాన్ని మరిచిపోయి? పార్టీల రొచ్చులో దొర్లారు. అలాంటి వారిలో పోసానికి కూడా పెద్ద గజమాలే వేయాలి అంటున్నారు కూటమి మద్దతుదారులు. పోసాని కంటే ముందు మరింత పెద్ద సత్కారం చేయాల్సి వస్తే.. బోరుగడ్డ అనిల్ కుమార్ అనే వ్యక్తికి చేయాల్సి ఉంటుంది. అతని నోటికి అయితే పచ్చి బూతులే వస్తుంటాయి. ఆయా వీడియోలు ఇప్పటికీ.. సోషల్ మీడియాలో అందుబాటులోనే ఉన్నాయి. కాగా.. అతని పరిస్థితీ పోసాని లాగానే రాష్ట్రంలోని జైళ్లకు రిమాండ్ మీద సందర్శించుకుని వస్తున్నాడు. వీరిద్దరి విషయంలో వైసీపీ డైరెక్టుగా సపోర్టు చేయకపోవడాన్ని చాలా మంది ప్రశ్నిస్తున్నారు.వాస్తవానికి వైసీపీ అధినేతకు ఓదార్పులు బాగా కలిసి వస్తాయంటున్నారు కూటమి నేతలు.. ఆయన తొలినాళ్ల నుంచి ఓదార్పులతోనే పార్టీని నెట్టుకు వస్తున్నారు. అలా.. టీడీపీ కేంద్ర కార్యాలయం మీద దాడి కేసులో అరెస్టు అయిన వల్లభనేని వంశీ, ఎలక్షన్ సమయంలో ఈవీఎం మెషిన్ పగులగొట్టిన కేసులో పిన్నెల్లి రామకృష్ణా రెడ్డితో సహా వివిధ కేసుల్లో జైలుకు వెళ్లిన నందిగం సురేష్ వంటి వారిని జగన్ స్వయంగా పలకరించారు. మిగతా వారికి వైసీపీ కేడర్, జిల్లా స్థాయి పార్టీ నాయకులు అండగా నిలుస్తున్నారు. కానీ.. పోసాని, బోరుగడ్డకు మాత్రం ఎవరూ మద్ధతు నిలవడం లేదు. అంటే.. ఎవరైనా దిగజారుడు మాటలు మాట్లాడితే.. వారిని అవసరాలకు వాడుకుంటారు కానీ, ఆపదలో ఆదుకోరు అనే విషయం వీరిని చూసైనా తెలుసుకోవాలంటున్నారు.పోసాని కృష్ణమురళి సినిమా పరిశ్రమలో గుర్తింపు స్థాయి రచయిత, నటుడిగానే ఉన్నారు. ఆయనను పట్టించుకోని వైసీపీ నాయకులు.. వివాదాస్పద సినిమాల దర్శకుడు రామ్ గోపాల్ వర్మ విషయంలో మాత్రం హడావిడి చేశారు. ఒంగోలు పోలీసు స్టేషన్ లో విచారణకు హాజరైన ఆర్జీవీ కి స్వాగతం పలికే దగ్గర నుంచి తిరిగి ఆయన్ను విచారణ అనంతరం విడిచిపెట్టే వరకు దగ్గరుండి వైసీపీ నాయకులు చూసుకున్నారు. అంత మాత్రం గౌరవం కూడా పోసానికి దక్కలేదు.అయితే.. స్టార్టింగ్ లో గట్టిగానే నిలబడిన పోసాని.. ఆ తర్వాత మాత్రం తన మాటల వెనుక అసలు కారణాల్ని వెల్లడించారు. తొలుత వైసీపీ సకల శాఖ మంత్రి సజ్జల రామాకృష్ణ రెడ్డి డైరెక్షన్ లోనే తాను మాటల్ని తూలానని ఒప్పుకున్నారు. ఆ తర్వాత వైసీపీకి చెందిన ఓ పత్రికకు సంబంధించిన వ్యక్తులు అందించిన స్క్రిప్ట్ కారణంగానే మాట్లాడాను అంటూ ఉన్నది ఉన్నట్లు చెప్పేసారు. దాంతో? వైసీపీ కార్నర్ కావాల్సిన పరిస్థితులు తలెత్తాయి. దాంతో.. అతనికి సపోర్టు చేసి మరీ ఇరుకున పడడం ఎందుకులే అనుకుని.. వైసీపీ క్యాడర్ సైలెంట్ అయ్యింది అంటున్నారు.

# కడప జెడ్పీ పీఠంపై కూటమి.. ?

కడప, మార్చి 21, వైయస్సార్ కాంగ్రెస్( పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి మరో సవాల్ ఎదుర్కొంటున్నారు. కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఉప ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో జడ్పీ పీఠం నిలబెట్టుకోవడం ఇప్పుడు జగన్మోహన్ రెడ్డికి సవాల్ గా మారనుంది. జడ్పీ చైర్మన్ గా ఉన్న అమర్నాథ్ రెడ్డి రాజంపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దీంతో జడ్పీ చైర్మన్ ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లాలో కూటమి భారీ విజయం నమోదు చేసుకుంది. ఉమ్మడి కడప జిల్లాలో పులివెందుల, బద్వేలు, రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గాల కు మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిమితం అయింది. ఈ తరుణంలో జిల్లా పరిషత్ చైర్మన్ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2021 లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా పరిషత్తు స్థానాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకుంది. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి అమర్నాథ్ రెడ్డికి వరించింది. 2024 ఎన్నికల్లో అమర్నాథ్ రెడ్డి రాజంపేట నియోజకవర్గం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. దీంతో అమర్నాథ్ రెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఇంకా 15 నెలలపాటు జిల్లా పరిషత్ కు గడువు ఉంది. ప్రస్తుతం వైస్ చైర్పర్సన్ గా ఉన్న శారద చైర్ పర్సన్ గా వ్యవహరిస్తూ వచ్చారు.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన జడ్పిటిసి సభ్యులు ఐక్యంగా కనిపిస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా వారిని శిబిరాలకు తరలించే పనిలో పడింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే జడ్పీ చైర్మన్ కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో నేతలు వేరువేరు శిబిరాలుగా విడిపోయారు. ప్రధానంగా బ్రహ్మంగారిమఠం జడ్పిటిసి సభ్యుడు రామ గోవిందరెడ్డి అభ్యర్థిత్వం వైపు జగన్ మొగ్గు చూపినట్లు వార్తలు వస్తున్నాయి. కానీ ఆయన వైపు చాలామంది జడ్పిటిసిలు ఆసక్తి చూపడం లేదు. ఈ తరుణంలో చాలామంది జడ్పిటిసిలు కూటమి పార్టీల వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమయింది. తమ పార్టీ జడ్పిటిసి లను కాపాడుకునే పనిలో పడినట్లు తెలుస్తోంది. అవసరం అనుకుంటే భారీగా తాయిలాలు సైతం ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.ఉమ్మడి కడప జిల్లాలో50 మంది జడ్పిటిసి సభ్యులు ఉన్నారు. 2021 లో జరిగిన ఎన్నికల్లో 49 మంది సభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. గోపవరం మండలం నుంచి మాత్రమే టిడిపి అభ్యర్థి అప్పట్లో విజయం సాధించారు. అయితే చాలామంది జడ్పిటిసిలు కూటమి పార్టీలకు అనుకూలంగా వ్యవహరించారు. కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలతో తిరుగుతున్నట్లు కూడా తెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అనుమానం కూడా అదే. అయితే కడప జిల్లా పరిషత్తు చైర్మన్ పీఠాన్ని వదులుకుంటే మాత్రం రాజకీయంగా జగన్మోహన్ రెడ్డికి మరింత ఇబ్బందులకు గురిచేసే అంశమే. అందుకే జగన్ సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా మొత్తం 50 మంది సభ్యులకు గాను.. 47 మంది జడ్పీటీసీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో కూటమి పార్టీల వైపు జడ్పీటీసీలు వెళ్లిపోయారని. ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యేలతోపాటు ఎంపీలు ఉండడంతో విజయం తమదేనని కూటమి భావిస్తోంది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తమ జడ్పిటిసి లను తీసుకుని క్యాంపు రాజకీయానికి బయలుదేరినట్లు సమాచారం. మరి కడప జిల్లా రాజకీయం ఎంతవరకు తీసుకెళ్తుందో చూడాలి.

# ఉమ్మడి నల్గొండ లో ప్రశాతంగా పది పరీక్షలు

**నల్గొండప్రజాబలం ప్రతినిధి:** ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో.. ప్రశాంతమైన వాతావరణంలో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం అయ్యాయి. నల్లగొండ, యాదాద్రి-భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో.. మొత్తం 222 పరీక్షా కేంద్రాల్లో.. 39 వేల 368 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలకు మొదటి రోజు కావడంతో తల్లిదండ్రులు వచ్చి పిల్లలను ఎగ్జామ్ సెంటర్ దగ్గర వదిలి.. టెన్షన్ లేకుండా పరీక్షలు రాయాలంటూ వారికి జాగ్రత్తలు చెప్పి వెళ్లారు. ఇక.. 9 గంటల 30 నిమిషాలకు పరీక్ష ప్రారంభం కాగా.. 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారికి సైతం పరీక్ష కేంద్రంలోనికి అనుమతించే

# యాంటీ ఇండియా టెర్రరిస్టుల గుండెల్లో టెర్రర్

ఎప్పుడు ఎవడొస్తాడో తెలియదు! ఎలా వేసేస్తాడో అర్థం కాదు! వారి చావు ఎంత ఘోరంగా ఉంటుందో.. అస్సలు ఊహించలేరు. వారి నేల మీదే.. క్షణాల్లో ఖతమైపోతున్నారు. టెర్రర్ ఎటాక్స్‌ని ప్లాన్ చేస్తున్న టెర్రరిస్టులందరి గుండెల్లో ఇప్పుడు టెర్రర్ మొదలైంది. పాకిస్థాన్ ఉగ్రవాదులకైతే.. కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఎక్కడున్నా.. ఎంత రహస్య ప్రదేశంలో దాక్కున్నా.. వారి చావు వారిని వెతుక్కుంటూ వచ్చేస్తోంది. ఒక్కొక్కరి ప్రాణాలు తీసేస్తోంది. గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో వరుసగా హతమవుతున్నారు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు. మొన్నటికి మొన్న కుల్ భూషణ్ జాదవ్ కిడ్నాప్ వెనకున్న మతపెద్ద హతమయ్యాడు. ఇప్పుడు.. 26/11 ముంబై దాడుల ప్రధాన సూత్రధారి అయిన హఫీజ్ సయీద్ మేనల్లుడు.. అబూ కతల్ పాకిస్థాన్‌లోనే ఖతమయ్యాడు. కొన్నాళ్లుగా గుర్తుతెలియని వ్యక్తులు అనేకమంది భారత వ్యతిరేక శక్తులను ఖతం చేస్తున్నారు. లేటెస్ట్‌గా.. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా వ్యవస్థాపకుడైన హఫీజ్ సయీద్ మేనల్లుడు.. అబూ కతల్ హతమయ్యాడు. తన అనుచరులతో కాన్వాయ్‌లో వెళ్తుండగా.. ఒక్కసారిగా గుర్తు తెలియని వ్యక్తులు బుల్లెట్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో అబూ కతల్‌తో పాటు అతని బాడీగార్డ్స్ కూడా చనిపోయారు. నిత్యం పాకిస్థాన్ ఐఎస్ఐ నీడలో సంచరించే అబు కతల్‌ని.. ఇలా లేపేయడం హాట్ టాపిక్‌గా మారింది. హఫీజ్ సయీద్, అబూ కతల్ హిట్ లిస్టులో ఉన్నారని ఐఎస్ఐకి తెలుసు. వాళ్లను.. పదేళ్లుగా జాగ్రత్తగా కాపాడుతూ వస్తుందనే సమాచారం ఉంది. అబూ కతల్‌కి ఐదు మారుపేర్లు ఉన్నాయి. హఫీజ్ సయీద్.. లష్కరే తోయిబాకి చీఫ్ అయినా.. తన మేనల్లుడైన అబూ కతల్‌ని చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా నియమించాడు. ప్లాన్ హఫీజ్ వేస్తే.. దానిని అమలు చేసేది అబు కతల్.లష్కరే తోయిబా ఉగ్రవాది అబూ కతల్.. ఇండియాలో మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా ఉన్నాడు. 2023లో రాజోరి జిల్లాలో జరిగిన ఉగ్ర దాడి, 2024 రియాసి జిల్లాలో జరిగిన బస్సు దాడిలో పాల్గొన్నాడు అబూ కతల్. ఇవి మాత్రమే కాదు జమ్ముకశ్మీర్‌లో అనేక దాడులకు ఇతనే బాధ్యుడు. అందువల్ల.. ఎన్ఐఏతో పాటు ఇండియన్ ఆర్మీ, ఇతర భద్రతా సంస్థల హిట్ లిస్టులో ఉన్నాడు. 2024 జూన్ 9న రియాసి జిల్లాలో.. శివకోరి గుహలో ఉన్న శివాలయాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్న హిందూ యాత్రికుల బస్సుపై దాడి చేశారు.అబూ కతల్ నాయకత్వంలో జరిగిన ఈ దారుణమైన దాడిలో.. 9 మంది పౌరులు మరణించారు. 40 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఉగ్రదాడి తర్వాత రియాసి జిల్లాలో కొత్త భయాందోళన మొదలైంది. 2023 జనవరిలో రాజోరి జిల్లాలోని దంగ్రీ గ్రామంలో నలుగురు ఉగ్రవాదులు ప్రవేశించి.. పౌరులని లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారు. ఈ ఉగ్రదాడిలోనూ అబూ కతల్ పాత్ర ఉంది. ఈ దాడిలో ఇద్దరు పిల్లలు సహా ఏడుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు.జమ్ముకశ్మీర్ సరిహద్దు గ్రామాల్లోని యువకులకు డబ్బు ఆశ చూపి.. లష్కరే తోయిబాలోకి రిక్రూట్ చేస్తున్నాడు అబు కతల్. అదొక్కటే కాదు.. మైనారిటీ సమాజానికి చెందిన పౌరులని, భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని ఎటాక్స్ చేయడంలో అబూ కతల్ పాత్ర ఉంటుంది. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడం, బోర్డర్ దాటి చొరబడటం, పౌరులని లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం, అశాంతి సృష్టించేందుకు ప్రయత్నించడం లాంటివన్నీ.. అబూ కతల్ కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. వీటన్నింటిపై లోతైన దర్యాప్తు తర్వాత ఐదుగురు నిందితులపై ఎన్ఐఏ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. వీరిలో ముగ్గురు పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా కమాండర్లు ఉన్నారు. అందులో.. అబూ కతల్, సైఫుల్లా అలియాస్ సాజిద్ జట్, మహమ్మద్ ఖాసిం ఉన్నారు.జమ్ముకశ్మీర్‌ని అస్థిరపరిచేందుకు దాడులు ప్లాన్ చేయడం, పాకిస్థాన్ నుంచి వచ్చే సూచనల్ని అమలు చేయడం లాంటివి చేయడంలో ఇతనిదే కీలకపాత్ర. అలాంటి.. అబూ కతల్ ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హతమవడంతో.. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదంపై పోరాటంలో.. ఓ ముఖ్యమైన పరిణామానికి నాంది పలుకుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయ్. పాకిస్థాన్ టెర్రరిస్టులకు, ఖలిస్థాన్ వేర్పాటువాదులందరికీ.. ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తుల భయం పట్టుకుంది. ఇదంతా.. కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. కొన్ని నెలలుగా నడుస్తున్న వ్యవహారమే. ఇప్పటికే.. ఈ తరహాలో చాలా మంది హతమయ్యారు. ఇక ముందు కూడా ఇది కొనసాగుతుందనే సంకేతాలిస్తున్నారు.ఊరు లేదు.. పేరు లేదు.. స్ట్రాంగ్ ఎవిడెన్స్ లేదు. ఉగ్రవాదులను ఏరిపారేస్తున్న గుర్తు తెలియని వ్యక్తుల జాడ కూడా తెలియట్లేదు. ఎవరు చంపేస్తున్నారో అస్సలు అర్థం కావట్లేదు. ఇదంతా.. మూడు నాలుగేళ్లుగా జరుగుతున్న వ్యవహారమే. ఇప్పటికే.. ఇలాంటి హత్యలు చాలానే జరిగాయ్. సిరీస్ ఆఫ్ ఈవెంట్స్‌ని చూశాక.. ఇప్పుడిప్పుడే అందరిలోనూ అనుమానం కలుగుతోంది. మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులందరినీ.. ఒకరి తర్వాత ఒకరిని హతమారుస్తున్నారు గుర్తు తెలియని వ్యక్తులు.ముఖ్యంగా.. భారత్‌కు శత్రువులుగా ఉన్న వాళ్లు, ఇండియా హిట్ లిస్టులో ఉన్న వాళ్లంతా.. విదేశాల్లో హతమైపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇలా.. గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేస్తుండటంతో.. చాలా మంది ఉగ్రవాదులు పాకిస్థాన్‌లోని రహస్య ప్రదేశాల్లో దాక్కుంటున్నారు. . లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు, జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు అత్యంత సన్నిహితులైన వాళ్లు కూడా.. గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యారు. భారత వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న ఎందరో తీవ్రవాదులు, ఖలిస్థానీ ఉగ్రవాదులంతా ఒక్కొక్కరిగా ప్రాణాలు కోల్పోతున్నారు. లష్కరే తోయిబాకు చెందిన అబ్దుల్ సలామ్ భుట్టావి, జియార్ రెహమాన్, అబూ ఖాసిం, ముఫ్తీ ఖైజర్ ఫరూక్, సర్దార్ హుస్సేన్ లాంటివాళ్లంతా.. పాకిస్థాన్ గడ్డ మీదే హత్యకు గురయ్యారు. ఇక.. జైషే మహ్మద్‌కు చెందిన ఉగ్రవాదులు దావూద్ మాలిక్, షాహిద్ లతీఫ్, అతని సోదరుడు హారిస్ హాషిమ్, జహూర్ మిస్త్రీ కూడా పాక్ నేల మీదే ప్రాణాలు కోల్పోయారు.నిషేధిత ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్దీప్ సింగ్ నిజ్జర్ కెనడాలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యాడు. అతనే కాదు.. ఖలిస్థాన్ ఉగ్రవాదులుగా పేరున్న సుఖ్దూల్ సింగ్, రిపుదామన్ సింగ్ కూడా కెనడాలోనే హత్యకు గురయ్యారు. అవతార్ సింగ్.. లండన్‌లో మర్డర్ అయ్యాడు. పరంజిత్ సింగ్, హర్విందర్ సింగ్ సంధూ.. లాహోర్‌లో గుర్తుతెలియని వారి చేతిలో చనిపోయారు. ఇక.. భారత్‌లో ఉగ్రదాడులకు పాల్పడిన బషీర్ అహ్మద్ పీర్, సయ్యద్ ఖలీద్ రజా, ఎజాజ్ అహ్మద్.. లాంటోళ్లంతా చనిపోయారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఎఐ-814 హైజాకర్లలో ఒకరైన మిస్త్రీ జహూర్ ఇబ్రహీంని కూడా కరాచీలో కాల్చి చంపారు.2022 నుంచి ఇప్పటివరకు ఇదే తరహాలో.. చాలా మంది ఉగ్రవాదులు, భారత వ్యతిరేక శక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఓ వైపు ఈ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్ని కనిపెట్టేందుకు భారత ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. ఇదే సమయంలో ఉగ్రవాదులంతా హత్యకు గురవడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఉన్న అనుమానాలు, ఆరోపణల మేరకు పాకిస్థాన్ సైన్యం ఎంత రక్షణ కల్పించినా.. ఏ ఉగ్రవాది కూడా సేఫ్‌గా లేడనే విషయం అర్థమవుతోంది. ఇందుకు.. వరుసగా జరుగుతున్న ఉగ్రవాదుల ఏరివేత ఎపిసోడ్లే బిగ్ ఎగ్జాంపుల్. ఏదో ఒకరోజు వాళ్లంతా.. గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో బలైపోక తప్పదంటున్నారు. ఎంత సెక్యూరిటీ ఉన్నా.. వాళ్లంతా సురక్షితంగా లేరనే విషయం తెలుస్తోంది. ఎక్కడున్నా.. ఎలాంటి చోట దాక్కున్నా.. ఎంత సేఫ్‌గా ఉన్నామని అనుకున్నా.. ఏదో ఒక రోజు చావు వాళ్ల దాకా వెళ్తుందనే విషయం.. ఇప్పటికే అర్థమై ఉంటుందంటున్నారు.

# ఇక ఇమ్మిగ్రేషన్స్ నిబంధనలు కఠినం

**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి: మార్చి 21,** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆ దేశంలో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే 38 వేల మంది అక్రమ వలసదారులను వారి దేశాలకు పంపించారు. మరికొందరిని అరెస్టు చేసి జూల్లో పెట్టారు. ఇక ఇమ్మిగ్రేషన్స్ నిబంధనలు కఠినం చేశారు. తాజాగా వీసా జారీలో సవరణలు చేశారు. సరికొత్త వ్యవస్థను తీసుకురావాలని నిర్ణయించారు. ఫారిన్ లేబర్ యాక్సెస్ గేట్వే వ్యవస్థలో ఐదేళ్ల కంటే పాత రికార్డులు, దరఖాస్తులను మార్చి 20 నుంచి తొలగించనున్నారు. దీంతో హెచ్?1బీ వీసా ప్రోగ్రామ్లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయితాజా ఆదేశాల ప్రకారం, మార్చి 20 నుంచి ఐదేళ్ల కంటే పాత రికార్డులను సిస్టమ్ నుంచి తొలగిస్తారు. ఉదాహరణకు, 2020 మార్చి 22న ఒక దరఖాస్తుపై తుది నిర్ణయం వెలువడి ఉంటే, 2025 మార్చి 22న ఆ రికార్డు తొలగించబడుతుంది. ఉద్యోగులకు సంబంధించి ఐదేళ్ల కంటే పాత వీసా రికార్డులను మార్చి 19లోగా డౌన్‌లోడ్‌చేసుకోవాలని సంస్థలకు సూచించారు. లేకపోతే ఆ రికార్డులు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హెచ్?1బీతో పాటు తాత్కాలిక మరియు శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ దరఖాస్తులపై ఈ తొలగింపు ప్రభావం చూపనుంది. ఆఫీస్ ఆఫ్ ఫారిన్ లేబర్ సర్టిఫికేషన్ ఈ మార్పులకు సంబంధించి నోటీసులు జారీ చేసింది.ఇక వీసా కోసం త్వరలో యూఎస్ ఇమ్మిగ్రేషన్‌విభాగం కొత్త దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించనుంది. ఈ నిర్ణయం దరఖాస్తుదారులకు పారదర్శక సేవలు అందించేందుకేనని ట్రంప్ ప్రభుత్వం తెలిపింది. అందుకే పాత రికార్డులను తొలగిస్తున్నామని వివరించింది. 2025 నుంచి హెచ్?1బీ వీసా జారీలో కొత్త విధానం అమలులోకి రానుంది. ఇకపై ఒక లబ్ధిదారు బహుళ దరఖాస్తులు సమర్పించినా, అవి ఒకే అప్లికేషన్‌గా పరిగణించబడతాయి. రిజిస్ట్రేషన్ల సంఖ్యతో సంబంధం లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు 'కేంద్రీకృత?ఎంపిక ప్రక్రియ'ని అమలు చేస్తున్నట్లు యూఎస్ పౌరసత్వ, వలస సేవల విభాగం పేర్కొంది. కొన్ని సంస్థలు బహుళ రిజిస్ట్రేషన్ల ద్వారా లాటరీ విధానంలో అనుచిత లాభాలు పొందుతున్నాయని, దీన్ని అరికట్టేందుకు ఈ నిబంధనలు తీసుకొచ్చామని వెల్లడించింది.

# మితిమీరిన వేగంతో కారు నడిపి ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టిన వ్యక్తి అదుపులో తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**మితిమీరిన వేగంతో కారు నడిపి ఓ వ్యక్తి పలు వాహనాలను ఢీ కొట్టిన సంఘటన అంబర్పేట్ లో చోటుచేసుకుంది బోరబండ లో నివాసముండే అఫ్జల్ అమెజాన్ కంపెనీలో కారు డ్రైవర్ గా పని చేస్తున్నాడు గురువారం రాత్రి కంపెనీ ఉద్యోగులను ఇంటి దగ్గర విడిచిపెట్టడానికి చే నెంబర్ వైపు నుంచి ఉప్పల్ కు వెళ్తున్నాడు ఫ్లైఓవర్ పై మితిమీరిన వేగంతో వాహనం నడిపిన అఫ్జల్ ఫ్లైఓవర్ దిగిన వెంబడి ట్రై కలర్ హాస్పిటల్ సమీపంలో వాహన వేగాన్ని అదుపు చేయలేక రోడ్డు పక్కగా టైలర్ షాప్ ముందు ఆపి ఉన్న ఆరు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు ఈ ఘటనలో వాహనాలపై ఉన్న నలుగురికి గాయాలయ్యాయి వేగంగా ఉన్న వాహనం టైలర్ షాప్ లోకి దూసుకువెళ్లడంతో టైలర్ షాపులోని సామాగ్రి ధ్వంసం అయింది ఘటనలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు సంఘటన కారణమైన డ్రైవర్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు

# కేసీఆర్ క్యాంపు కార్యాలయానికి టులెట్ బోర్డు

గజ్వేల్మాజీ సీఎం కేసీఆర్‌కు తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో బీజేపీ కాంగ్రెస్ శ్రేణులు షాకిచ్చాయి. గజ్వేల్.లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బీజేపీ నాయకులు టులెట్ బోర్డు పెట్టారు..గజ్వేల్ ఎమ్మెల్యే అయిన మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి రాకపోవడంపై వాంటెడ్ ఎమ్మెల్యే అంటూ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలిచి 15 నెలలైనా కేసీఆర్ ఒక్కసారి కూడా గజ్వేల్ వైపు చూడలేదని బీజేపీ శ్రేణులు ఈ సందర్భంగా అన్నారు. ప్రజలకు వద్దకు రాని కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు..మరోపక్క గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కనబడటం లేదంటూ గజ్వేల్, గౌరారం పోలీసుస్టేషన్లలో యూత్ కాంగ్రెస్ నేతలు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. కాగా,బీజేపీ నేతల నిరసనపై గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ఫైరయ్యారు..అల్లరిమూకలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తాళాలు పగలుగొట్టి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాయంటూ గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ

# ముగింపు దిశగా యుద్ధం

మాస్కో, మార్చి 22, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌భారీ మెజారిటీతో విజయం సాధించారు. జనవరి 20న అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌లో అడుగు పెట్టారు. ఈ క్రమంలో ఎన్నికల్లో ఇచ్చి హామీలు నెరవేర్చడంపై దృష్టి పెట్టారు. వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, కానిస్టిట్యూషనల్ ఆర్డర్స్ జారీ చేస్తున్నారు. మరోవైపు యుద్ధాలు ఆపేందుకు ఇటు రష్యా, ఉక్రెయిన్, అటు ఇజ్రాయెల్‌తో చర్చలు జరిపారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం చేయించారు. ఇప్పుడు రష్యా?ఉక్రెయిన్ యుద్ధం పూర్తిగా ఆపే ప్రయత్నంలో సక్సెస్ అయినట్లు కనిపిస్తోంది. వాషింగ్టన్ నుంచి వెలువడిన వార్తల ప్రకారం, ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని శాంతియుతంగా ముగించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అంగీకరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సుమారు రెండు గంటల ఫోన్ సంభాషణ తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్ హౌస్ తెలిపింది. ఈ సందర్భంగా ఇరు నేతలు శాశ్వత శాంతి స్థాపనతో యుద్ధానికి ముగింపు పలకాలని సంకల్పించారు. అమెరికా, రష్యా మధ్య సంబంధాలు మెరుగుపడాలని, ద్వైపాక్షిక సహకారం అవసరమని వారు ఒకరికొకరు వ్యక్తం చేశారు.రష్యా?ఉక్రెయిన్ యుద్ధం రెండు దేశాలకు తీవ్ర నష్టాలు మిగిల్చింది. అనేక ప్రాణాలు కోల్పోవడంతో పాటు భారీ నిధులు ఖర్చయ్యాయి. ఈ నిధులను ప్రజా సంక్షేమానికి ఉపయోగిస్తే ఎంతో అభివృద్ధి సాధ్యమయ్యేదని వైట్‌హౌస్ అభిప్రాయపడింది. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు తలెత్తకుండా సామరస్యపూర్వక పరిష్కారాలతో ఈ యుద్ధాన్ని ఇప్పుడే ముగించాలని పేర్కొంది. యుద్ధ విరమణకు తీసుకోవాల్సిన చర్యలపై ట్రంప్, పుతిన్ చర్చించారు. ముఖ్యంగా ఇంధన వనరులు, మౌలిక సదుపాయాలపై దాడులను ఆపడం, నల్ల సముద్రంలో కాల్పులను నియంత్రించడం వంటి అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సాంకేతిక సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని ట్రంప్ సూచించారు.

ఇజ్రాయెల్ అంశం కూడా..

ట్రంప్?పుతిన్ సంభాషణల్లో ఇజ్రాయెల్ అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఇరాన్ ఇజ్రాయెల్‌ను నాశనం చేసే స్థితిలో ఉండకూడదని ఇరు నేతలు అంగీకరించారు. అలాగే, వ్యూహాత్మక ఆయుధాల విస్తరణను నియంత్రించాలని చర్చించారు.

పుతిన్ షరతు..

అయితే, ఈ శాంతి ప్రక్రియకు పుతిన్ ఒక షరతు విధించారు. ఉక్రెయిన్‌కు విదేశీ సైనిక సాయం, నిఘా సమాచారం అందించడాన్ని పూర్తిగా నిలిపివేయాలని క్రెమ్లిన్ పేర్కొంది. ఈ షరతు ద్వారా వివాదం మరింత తీవ్రతరం కాకుండా రాజకీయ, దౌత్య మార్గాల్లో పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించింది. ట్రంప్ ఈ శాంతి కృషిని స్వాగతించినట్లు క్రెమ్లిన్ అభినందించింది. ఈ చర్చలు రెండు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలికే దిశగా ఒక అడుగుగా భావిస్తున్నారు.

# దేశంలో భారీగా పెరుగుతున్న కోటీశ్వరులు

ముంబై, మార్చి 22, (న్యూస్ పల్స్) ఇప్పటి వరకు, మన దేశంలో 9 కోట్లకు పైగా ప్రజలు 2024-25 ఆర్థిక సంవత్సరానికి (ఈజ25) ఆదాయ పన్ను రిటర్న్‌లుసమర్పించారు. 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్' విడుదల చేసిన తాజా డేటా ప్రకారం, నమోదిత ఆదాయపన్ను చెల్లింపుదార్లలో కేవలం 65 శాతం మంది మాత్రమే రిటర్న్‌లు దాఖలు చేశారు. 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్' రిపోర్ట్ ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) మార్చి 16, 2025 వరకు దాఖలైన ఐటీఆర్‌లలో, దాదాపు ఐదు లక్షలకు మంది పన్ను చెల్లింపుదారులు రూ. 1 కోటి కంటే ఎక్కువ ఆదాయం ఉన్నట్లు ప్రకటించారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, 4.69 లక్షల మంది వార్షిక ఆదాయం రూ. 1 కోటి దాటింది. అంటే, భారతదేశంలో ప్రస్తుతం ఉన్న కోటీశ్వరుల సంఖ్య 4.69 లక్షలు. ప్రస్తుతం, భారతదేశ జనాభా దాదాపు 144 కోట్లు. వీరిలో.. దాదాపు 14 కోట్ల మంది రిజిస్టర్డ్ టాక్స్‌పేయర్స్ ఉన్నారు. అంటే, మొత్తం జనాభాలో రిజిస్టర్డ్ టాక్స్‌పేయర్స్ సంఖ్య 10 శాతం కన్నా తక్కువే. ఈ లెక్క ఇక్కడితోనే అయిపోలేదు. ఈ 14 కోట్ల రిజిస్టర్డ్ టాక్స్ పేయర్స్‌లో కూడా, రూ. 1 కోటి ఆదాయం దాటిన వాళ్లు (కోటీశ్వరులు) 5 లక్షల మంది కూడా లేరు. ఇది ఆశ్చర్యపరిచే విషయమే. 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్' సమాచారం ప్రకారం.. 3.89 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు రూ. 1 కోటి నుంచి రూ. 5 కోట్ల మధ్య వార్షిక ఆదాయాన్ని ప్రకటించారు. 36,274 మంది టాక్స్ పేయర్లు రూ. 5 కోట్ల నుంచి రూ. 10 కోట్ల మధ్య వార్షిక ఆదాయం ఉన్నట్లు నివేదించారు. 43,004 మంది రూ. 10 కోట్లకు పైగా వార్షిక ఆదాయం ఉన్నట్లు వెల్లడించారు. దీంతో, ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక ఆదాయంగల పన్ను చెల్లింపుదారుల సంఖ్య (రూ. 1 కోటి కంటే ఎక్కువ ఆదాయం ఉన్న వాళ్లు) 4,68,658కి చేరుకుంది. ఆలస్య రుసుముతో కలిపి ఆదాయ పన్ను రిటర్నులను దాఖలు చేయడానికి చివరి తేదీ మార్చి 31, 2025. ఈ గడువుకు ఇంకా కొన్ని రోజుల సమయం ఉంది కాబట్టి, ఈ గణాంకాలు పెరుగుతాయని భావిస్తున్నారు. 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్' లెక్కల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు 9.11 కోట్లకు పైగా ప్రజలు ఎమ్ఖీలు దాఖలు చేశారు. భారతదేశంలో మొత్తం నమోదిత పన్ను చెల్లింపుదారుల సంఖ్య 13.96 కోట్లు. అంటే దాదాపు 65 శాతం మంది మాత్రమే రిటర్న్‌లను దాఖలు చేశారని అర్థం. ఎమ్ఖీ ఫైల్ చేసిన వాళ్లలో దాదాపు 8.56 కోట్ల మంది ఆ రిటర్న్‌లను ఈ-వెరిఫై చేశారు. ఆదాయ పన్ను విభాగం ఇప్పటి వరకు రూ. 3.92 లక్షల కోట్లను రిఫండ్ చేసింది.

రాష్ట్రాల వారీగా...

మహారాష్ట్రలో అత్యధికంగా 1.38 కోట్ల రిటర్నులు దాఖలయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో 90.68 లక్షల రిటర్న్‌లు దాఖలు కాగా, గుజరాత్‌లో 87.90 లక్షల రిటర్న్‌లు దాఖలయ్యాయి. ఢిల్లీలో 44.45 లక్షల మంది ఐటీఆర్‌లు సమర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో 30.76 లక్షల మంది, పంజాబ్‌లో 43.79 లక్షల రిటర్న్‌లు దాఖలు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 16, 2025 మధ్యకాలంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు గత ఆర్థిక సంవత్సరం (ఈజ24) ఇదే కాలంతో పోలిస్తే 16.2 శాతం పెరిగి రూ. 25.86 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఆదాయ పన్ను విభాగం గతంలో ప్రకటించింది.

# 165 లక్షల కోట్లకు చేరుకున్న అప్పులు

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి: మార్చి 21,** తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అప్పులు ఒక ముఖ్యమైన అంశంగా ఉన్నాయి. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌తో కలిపి ఉన్న అప్పుల్లో తెలంగాణ వాటా రూ. 1.52 లక్షల కోట్లుగా నిర్ణయించబడింది. అప్పటి నుంచి వివిధ ప్రభుత్వాలు అభివద్ధి పనులు, సంక్షేమ పథకాల కోసం అప్పులు తీసుకుంటూ వచ్చాయి. 2023?24 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి సుమారు రూ. 15 లక్షల కోట్లుగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే, అప్పుల స్థాయి గురించి ఖచ్చితమైన సమాచారం రాష్ట్ర బడ్జెట్ ప్రకటనలు, కాగ్(కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదికల ద్వారా తెలుస్తుంది. 2025?26 బడ్జెట్‌లో తెలంగాణ మొత్తం వ్యయం రూ. 3,04,965 కోట్లుగా ప్రకటించబడింది. ఇందులో అప్పుల గురించి స్పష్టమైన ప్రకటన చేశారు.2026 మార్చి నాటికి తెలంగాణ అప్పులు రూ.5,04,814 కోట్లకు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత 15 నెలల్లో రూ. 1.52 లక్షల కోట్ల అప్పు చేసింది.తెలంగాణ అప్పుల భారం ఒక వివాదాస్పద అంశంగా ఉంది. 2014లో విభజన సమయంలో రూ.1.52 లక్షల కోట్ల అప్పులతో ప్రారంభమైన రాష్ట్రం, 2025 మార్చి నాటికి రూ.5.04 లక్షల కోట్ల అప్పుల స్థాయికి చేరినట్లు చెబుతున్నారు. ఇందులో గత ప్రభుత్వం హయాంలో కాళేశ్వరం వంటి పెద్ద ప్రాజెక్టుల కోసం తీసుకున్న అప్పులు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత 15 నెలల్లో రూ. 1.52 లక్షల కోట్లు అప్పుగా తీసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. అయితే, ఈ అప్పుల్లో ఎంత భాగం అభివద్ధికి, ఎంత సంక్షేమ పథకాలకు ఉపయోగపడిందనేది స్పష్టమైన లెక్కలు లేకుండా చర్చనీయాంశంగా ఉంది.ప్రతి నెలా రూ. 6,500 కోట్లు అప్పులు, జీతాల కోసం ఖర్చు చేయబడుతుందని, మిగిలిన రూ. 12,000 కోట్లు అభివృద్ధి మరియు ఇతర అవసరాలకు వినియోగించబడుతుందని అంచనా. అప్పులు ఎ ఈ?కలో 33?35% ఉండవచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు, ఇది ఆర్థిక శాస్త్రపరంగా ఆమోదయోగ్యమైన స్థాయిలో ఉన్నప్పటికీ, దీర్ఘకాలంలో ఆదాయ వనరులు పెంచకపోతే భారంగా మారవచ్చు.2025?26 బడ్జెట్‌లో తెలంగాణ మొత్తం వ్యయం రూ.3,04,965 కోట్లుగా ప్రకటించబడింది. ఇందులో ఆరు గ్యారంటీలు (సంక్షేమ పథకాలు), విద్య, వైద్యం, వ్యవసాయం, మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వబడింది. రాష్ట్రం తన ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి రూ. 1 ట్రిలియన్ (సుమారు రూ. 83 లక్షల కోట్లు) స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. దీనికి ఐటీ, పారిశ్రామిక వద్ధి, మరియు వ్యవసాయ ఆధునీకరణ కీలకం కానున్నాయి.

అప్పుల భారం: అప్పులు పెరుగుతున్నప్పటికీ, వాటిని సమర్థవంతంగా ఉపయోగించి ఆదాయ వనరులను పెంచడం ఒక సవాలు.

సంక్షేమం ూా టఅభివృద్ధి: సంక్షేమ పథకాలకు భారీగా ఖర్చు చేస్తూ, అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడకుండా సమతుల్యం చేయడం అవసరం.

ప్రాంతీయ అసమానతలు: హైదరాబాద్ కేంద్రీకృత ఆర్థిక వృద్ధి ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి మందగించడం ఒక సమస్య.

## వర్గీకరణపై చర్చ పెట్టాలి

అమరావతి వర్గీకరణపై చర్చ పెట్టమని కోరితే ఈ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని మండలిలో విపక్ష నేత బోత్స సత్యనారాయణ అన్నారు. ఈ ప్రభుత్వ వైఖరిని వైయస్ఆర్ సీపీ తప్పు పడుతోంది. షెడ్యూల్ కులాల్లో ఉన్న అందరికీ మేలు జరగాలని, న్యాయం జరగాలని మేం డిమాండ్ చేస్తున్నాం. రాజకీయ స్వార్థం కోసం, అవసరాల కోసం, రాజకీయ ఎత్తుగడలతో ఈ కార్యక్రమం చేయడం తగదని కూటమిని హెచ్చరిస్తున్నామని అన్నారు.

## సికింద్రాబాద్ లో పది పరీక్షలు

సికింద్రాబాద్ పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో ఉదయం ఏడు గంటల నుండి విద్యార్థులు తల్లిదండ్రుల తో కలిసి పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. హాలు వద్ద ఏర్పాటుచేసిన బోర్డులో తమ హాల్ టికెట్ నంబరు ఈ తరగతి గదిలో కేటాయించారు అనే విషయాన్ని చెక్ చేసుకుని ఆత్రుతగా తమ తమ తరగతి గదులకు పరుగులు తీశారు. పరీక్ష కేంద్రాల వద్ద హాల్ టికెట్లను పరిశీలించడంతోపాటు క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోపలకు అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులను అనుమతించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. లా అండ్ ఆర్డర్ ట్రాఫిక్ పోలీసులు సైతం ట్రాఫిక్కును క్లియర్ చేయడంతో పాటు విద్యార్థులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా సహకరించారు. అంతేకాకుండా వారు పరీక్షలు బాగా రాయాలని శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్ల కార్డులు ప్రదర్శించారు.

# ఎస్సీ వర్గీకరణతో దేశానికి ఆదర్శంగా తెలంగాణ

## 30 ఏళ్ళ వర్గీకరణ పోరాటానికి దారి చూపిన కాంగ్రెస్



**,పెద్దపల్లి ప్రతినిధి:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చారిత్రాత్మకం, 11ఏళ్ళలో తెలంగాణకు బీజేపీ చేసిందేమీలేదని, సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్దత కల్పించి దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం పట్ల పెద్దపల్లి పట్టణం లోని చేకురాయి క్రాస్ నుండి రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈ సందర్భంగా జెండా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ, మాదిగ ఉపకులాలు చేసిన పోరాటానికి దారిచూపిన ఘనత కాంగ్రెస్ దేనన్నారు. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ పేరు ప్రఖ్యాతులు గల 4 గురు న్యాయవాదులను నియమించి 7 గురు న్యాయమూర్తుల ధర్మాసనానికి బలమైన వాదనలు వినిపించి 6 గురు న్యాయమూర్తులు వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పు వచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేశారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం జరిగిందన్నారు. అందరినీ సమన్వయం చేస్తూ ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి మండలికి కృతజ్ఞతలు తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాజ్యాంగం మేరకు రాష్ట్రంలో షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ ద్వారా ఎస్సీలను 3 భాగాలుగా విభజించిన 15 శాతం రిజర్వేషన్లు వాటా తేల్చామని అన్నారు. 1930లో బ్రిటీష్ కాలంలో కుల గణన జరిగిందని, 95 ఏళ్ళ తర్వాత తెలంగాణలో బీసీ కులగణన నిర్వహించడం చారిత్రాత్మకమన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించారని తెలిపారు. బీసీ బిల్లును కేంద్రానికి పంపి పార్లమెంటులో చట్టబద్దత పొందేవరకు పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ పోరాడాలని కోరారు. పార్లమెంటులో బీసీ బిల్లుకు ఆమోదం తెలిపి బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించు కోవాలని హితవు పలికారు. 11 ఏళ్ళ పాలనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసిందేమీలేదని విమర్శించారు. ఎన్డీయే పాలనలో దేశం ఆర్థికంగా దివాళ తీసిందని, మోడీ అసమర్థ పాలనకు ఇదే నిదర్శనమన్నారు.

కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు గుండు సున్నా ఇచ్చారని ఎద్దేవా చేశారు. నల్ల చట్టాల పేరుతో రైతులను ఢిల్లీ నడి ఒడ్డున కాల్చి చంపిన బీజేపీకి కాంగ్రెస్ పై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1200 కోట్లు సన్నవడ్లకు బోనస్ చెల్లిస్తే పెద్దపల్లి నియోజక వర్గ రైతులకు రు.58.62 కోట్లు సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించమని తెలిపారు. యువ వికాసం ద్వారా అర్హులైన యువతకు ఉపాధి కోసం సబ్సిడిపై రుణాలు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పారదర్శకంగా పాలన చేస్తూ అభివృద్ధి, సంక్షేమం సాధిస్తుంటే బీఆర్ఎస్ నేత కేటీఆర్ కళ్ళు, చెవులు లేని గుడ్డి, చెవిటి వాడిలా ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న యాసంగిలో కూడా గింజ కటింగ్ లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, సన్న వడ్లకు రూ. 500 బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించేందుకు నిరంతరం కాల్వల వెంట తిరుగుతున్నామని, పొలాలు ఎండకుండా సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పార్టీ కార్యకర్తల కృషితోనే పార్టీకి మనుగడ ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పునాది అని, యువ వికాసం పథకం ద్వారా అర్హులైన కార్యకర్తలకు సబ్సిడీ రుణాలు అందజేస్తామని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని వివరించారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, ప్రకాష్ రావు, తిరుపతి రెడ్డి, నాయకులు గోపగాని సారయ్య గౌడ్, మస్రత్, బూశనవేణ సురేష్ గౌడ్, సందనవేన రాజేందర్, బండారి సునీల్, ఆరె సంతోష్, కడార్ల శ్రీనివాస్, దొడ్డుపల్లి జగదీష్, జాని, బొడ్డుపల్లి శ్రీనివాస్, బూతగడ్డ సంపత్, సుధాకర్ రెడ్డి, నేత్తెట్ల కుమార్, గుజ్జుల కుమార్, ఆరగొండ రాజ్ కుమార్, రవీందర్, పరమేశ్వర్, దాసరి రాజేశం, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొల్లగొడుతున్న ప్రకృతి సంపద...

**ఆదిలాబాద్‌ప్రజాబలం ప్రతినిధి: మార్చ్ 21** ఆదిలాబాద్ జిల్లాలో అక్రమ మొరం తవ్వకాల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. మొరం వ్యాపారులు కొందమంది స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేక కొందరు, కొన్ని ప్రాంతాలకే అనుమతులు తీసుకొని పలు చోట్ల అక్రమంగా మొరం తవ్వేస్తున్నారు. అధికారుల నిఘా కరువవ్వడంతో వ్యాపారస్తులు విచ్చలవిడిగా తమ దందాను కొనసాగిస్తున్నారు.ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న మొరం బాకాసుర్లు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న కోట్లు దండుకొంటున్నారు. ఎత్తయిన గుట్టలతో పాటు సమాంతరంగా ఉన్న గట్టి నేలలను ఇలా దేన్ని వదలకుండా ఇష్టానుసారంగా దందా కొనసాగిస్తున్నారు. జిల్లాలోని బోథ్, తలమడుగు, తాంసి, నేరడిగొండ, భీంపూర్ బేలా, జైనథ్, అదిలాబాద్ రూరల్ మండలంలోని పలు ప్రాంతాలు, ఇచ్చోడ, వంటి ఏరియాలలో అక్రమ దందా కొనసాగుతున్నాయి. అక్రమంగ మొరం దందా చేస్తున్న వ్యాపారులు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. చెట్లు పుట్టలే కాదు పెద్దపెద్ద గుట్టలను సైతం వదలడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా అక్రమంగా మొరం తవ్వేస్తూ నెల మట్టం చేసేస్తున్నారు. ముఖ్యంగా మారుమూల మండలాల్లో మొరం తవ్వకాలు కొనసాగుతున్నాయి. దర్జాగా మొరం తవ్వకాలు చేపడుతున్న మొరం భకాసురులు కోట్లకు పడగేత్తుతున్నారు. ఫలితంగా విలువైన గుట్టలు, ప్రకృతి సంపద కనుమరుగు అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అక్రమ మొరం తవ్వకలతో పలు ప్రాంతాల్లో గుంతలు ఏర్పడుతు న్నాయి. గ్రామ శివారుల్లోని ప్రభుత్వ భూముల్లో మొరం కోసం లోతుగా తవ్వేస్తుండడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతు న్నాయి. దింతో ఈ గుంతల్లో వర్షపు నీరు నిండి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికి మొరం కోసం తవ్విన గుంతల్లో చిన్నారులు పడి మృతి చెందిన ఘటనలు చాలానే ఉన్నాయి.వన్య ప్రాణులు సైతం గుంతలలో పడి ప్రాణాలను కోల్పోతున్నాయి. ఇటీవల ఆదిలాబాద్ రూరల్ మండలం యపల్ గూడలో గుంతలో పడి ఓ బాలుడు మృతి చెందారు. బంగారు గూడ సమిపంలో గుంతలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడటంతో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఇలాంటి ఘటనలు పలు చోట్ల చోటుచేసుకున్నాయి.

జిల్లాలో కొనసాగుతున అక్రమ్న మొరం తవ్వకాలను కట్టడి చేయాల్సిన అధికారులు వ్యాపారస్తుల నుండి మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దింతో ఎలాంటి భయం లేకుండా మొరం బాకాసురులు నెలల తరబడి జేసీబీ, క్రేన్ ల సహాయంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా 24 గంటల పాటు మొరం ను తవ్వేస్తున్నారు.టిప్పర్ లలో తవ్విన మొరం ను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ దందా ను కట్టడి చేయాల్సిన అధికారులు నామమాత్రంగా దాడులు చేస్తూ వ్యాపారస్థులకు సహకరిస్తున్నరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడిగేవారు ఎవరు లేరు కదా అని విచ్చల విడిగా తమ పని కానిచ్చేస్తు ప్రభుత్వ ఖజానా కు గండి కొడుతున్నారు. గత పది సంవత్సరాల కాలం నుంచి తవ్వకాలు ఇంకా ఎక్కువగానే జరుగుతుండడం గమనార్హం. ఈ దందాను అడ్డుకునే నాథుడే కరువయ్యాడు.రోజుకు వందల కొద్ది టిప్పర్లలో మొరం ను తరలిస్తూ ప్రకృతిని కొల్లగొడుతున్నారు. మొరం భకానురులు చేస్తున్న ఈ ఆక్రమ తవ్వకాలపై అడ్డూ అదుపు లేకుండా పోయింది. పల్లెల్లో శివారు ప్రాంతాలన్నీ మొరం అక్రమ తవ్వకాలతో చెరువులను తలపిస్తున్నాయి ప్రకృతి సంపదను దోచుకుంటున్న మొరం భకాసురులపై ఇకనైనా ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించి కొరడా ఝులిపించాల్సిన అవసరం ఎంతైన ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద పెద్ద మొరం గుంతలు ఏర్పడే అవకాశం ఉంది.

# వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి ముఖ్యమంత్రి ఆలయ ప్రవేశం

తిరుమల తన మనవడు నారా దేవాన్ని పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సమేతంగా తిరుమల చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాత్రి పద్మావతి అతిథి గృహంలో బస చేశారు. శుక్రవారం ఉదయం సాంప్రదాయ వస్త్రాలతో చంద్రబాబు దంపతులు మనవడు దేవాన్ష్, కొడుకు లోకేశ్, కోడలు బ్రాహ్మణితో కలిసి వైకుంఠకు కాంప్లెక్స్ ద్వారా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. వీరికి ఆలయ అర్చకులు ఇఫ్రికాల్ స్వాగతం పలికారు.

# కేటీఆర్ పాదయాత్రకు అంతా సిద్ధం



**హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిధి: మార్చి 21,** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్త టూర్ ప్రారంభమైంది. తెలంగాణ జిల్లాల్లోని పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశమవుతున్నారు. సూర్యపేట జిల్లా బీఆర్ఎస్ కార్యకర్తలతో కేటీఆర్ భేటీ అయ్యారు. సడెన్‌గా ఇలా కార్యకర్తల వద్దకు వెళ్లాలనే నిర్ణయం వెనుక చాలా పెద్ద కారణమే ఉంది.ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం. 25 సంవత్సరాలు పూర్తి చేసుకోనుంది గులాబీ పార్టీ. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సంబరాలు తెలంగాణ వ్యాప్తంగా జరుపుకోవాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. పార్టీ ప్లీనరీ సభ, ఏప్రిల్ 10 నుంచి 27వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఏప్రిల్ 27వ తేదీన వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై కేటీఆర్ ఈ భేటీల్లో చర్చిస్తారు. దీని కోసం అన్ని జిల్లాల్లో సన్నాహక సభలు నిర్వహించనున్నారు.తెలంగాణ వ్యాప్తపర్యటన ఇప్పుడు పార్టీ వర్గాల్లోను, రాజకీయంగాను చర్చ సాగుతోంది. పార్టీకి కేటీఆర్ అండ్ హరీశ్‌రావు రెండు కళ్లు. 2018 ఎన్నికల తర్వాత కేటీఆర్‌కు వర్కింగ్ ప్రసిడెంట్‌గా కేసీఆర్ ప్రమోషన్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన తర్వాత కేసీఆర్ కేబినెట్‌లో కేటీఆర్‌తోపాటు హరీశ్‌రావుకు చోటు కల్పించలేదు. పార్టీలో కేటీఆర్‌కు ప్రమోషన్ ఇచ్చిన కేసీఆర్ హరీశ్‌కు ఏడాది తర్వాత ఆర్థికమంత్రిగా ఛాన్స్ ఇచ్చారు. గత శాసనసభ ఎన్నికల్లోను కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తే హరీశ్‌రావు మాత్రం మెదక్ జిల్లాకే పరిమితమయ్యారు. హరీశ్‌రావును కూడా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించేలా చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదన్న వాదన హరీశ్ అభిమానులు, పార్టీ నేతలు ప్రస్తావిస్తుంటారు. గతంలో ఇలా లీడ్ తీసుకొని పార్టీ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్న సందర్భాలు చాలా తక్కువ. ప్రత్యేక కార్యక్రమాలకే వెళ్లారు తప్ప ఇలా ఎప్పుడూ వెళ్లలేదు. ఇప్పుడు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా టూర్ పెట్టుకున్నారు. ఈ మధ్య కాలంలోనే కేటీఆర్ మనసులో మాట చెప్పారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. అప్పట్లో ఇదో పెద్ద చర్చకు దారి తీసింది. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచనతోనే ఈ ప్రకటన చేశారా లేక కేటీఆర్ తనకు తానుగానే కార్యాచరణ ప్రకటించారా అన్న డిస్కషన్ పార్టీ వర్గాల్లో నడిచింది. ఇప్పుడు పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తోంది. దీన్ని విజయవంతం చేసే బాధ్యతను వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఉన్న కేటీఆర్‌కు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ అప్పగించారు. అందుకే కేటీఆర్ రాష్ట్ర టూర్ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో సన్నాహక సభలు నిర్వహించి పార్టీ నేతలతో మాట్లాడతారు. ఇది కేవలం సిల్వర్ జూబ్లీ వేడుకల కోసం చేస్తున్న సన్నాహకం మాత్రమే కాదంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇది ఓ రకంగా పార్టీ అంతా కేటీఆర్ కనుసన్నల్లోకి తీసుకొచ్చే ఎత్తుగడగా చెబుతున్నారు. కేటీఆర్‌కు కీలక బాధ్యతలు అప్పగిస్తారని ఎప్పటి నుంచో చర్చ నడుస్తున్నా అదే టైంలో సీనియర్ అయిన హరీశ్ పరిస్థితి ఏంటీ ఏ బాధ్యతలు అప్పగిస్తారనే మాట కూడా వినిపిస్తోంది. గులాబీ పార్టీలో సీనియర్ లీడర్లలో హరీశ్ రావు ఒకరు. పార్టీ ట్రబుల్ షూటర్‌గా ఆయనకు పేరు ఉంది. కేసీఆర్ పార్టీపరంగా అప్పగించే ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించడంలో దిట్ట. పార్టీలో ఏ సంక్షోభం వచ్చినా దాన్ని చల్చార్చేది హరీశ్ రావేనని పార్టీ నేతలు చెబుతారు. అటు పార్టీ సీనియర్లను, జూనియర్లను సమన్వయం చేస్తూ పార్టీకి అనుసంధానకర్త పాత్ర పోషిస్తారని టాక్. పార్టీలో కేటీఆర్ కన్నా హరీశ్‌రావే సీనియర్. అయితే కేటీఆర్‌కు ప్రమోషన్ ఇచ్చిన కేసీఆర్ హరీశ్ రావు పాత్ర మాత్రం తేల్చలేదు. మరి ఇప్పుడు గులాబీ సంబరాల సన్నాహక సభలకు కేవలం కేటీఆర్ ఒక్కరే వెళ్తారా... లేక హరీశ్ రావు కూడా జిల్లాలు పర్యటిస్తారా అన్న స్పష్టత ఇంకా లేదు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సంబరాలు, పార్టీ సభ్యత్వ నమోదు, ఏప్రిల్ 27 నాటి బహిరంగ సభ నిర్వహణకు టైం లేదు. దీంతో జిల్లాల పర్యటన బాధ్యతలు హరీశ్‌రావుకు కూడా అప్పగిస్తారా అప్పగించరా అన్న ఉత్కంఠ నెలకొంది. సాధారణంగా భారీ బహిరంగ సభలను విజయవంతం చేసే బాధ్యతలను హరీశ్ రావుకే ఎక్కువగా కేసీఆర్ అప్పగించిన సందర్భాలు ఉన్నాయి. వాటిని విజయవంతం చేసిన చరిత్ర హరీశ్ రావుకు ఉంది. ఏప్రిల్ 27వ తేదీ భారీ బహిరంగ సభ బాధ్యతలు హరీశ్ రావుకే అప్పగించవచ్చన్న వార్తలు వస్తున్నాయి.పార్టీలో ఉద్యమం నాటి నుంచి తనకుంటూ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఎమ్మెల్సీ కవితకు అప్పగించే బాధ్యతలు ఏంటనే మరో చర్చ నలుగుతోంది. మద్యం కేసులో జైలుకు వెళ్లి వచ్చినప్పటి నుంచి కవిత దూకుడుగా రాజకీయాల్లో పాల్గొంటున్నారు. ఎస్సీ, బీసీ వర్గాల సమస్యలు, డిమాండ్లపై సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీకి కౌంటర్లు ఇస్తూ పార్టీని బలోపేతం చేసే విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమెకు కూడా ఎలాంటి పార్టీ పదవి ఇవ్వలేదు. కేటీఆర్‌కు పార్టీలో లీడింగ్ పోజిషన్ ఇచ్చిన కేసీఆర్, హరీష్ అండ్ కవితకు అప్పగించే బాధ్యతలు ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వీరంతా కేసీఆర్ కుటుంబ సభ్యులే. అయినా ఉద్యమాలు చేశారు. రాజకీయాల్లో కూడా ప్రూవ్ చేసుకున్నారు. పార్టీ క్యాడర్‌పై ఈ ముగ్గురి ప్రభావం చాలా ఉంటుంది. అందుకే హరీశ్రావు, కవితకు భవిష్యత్ ఏంటని పార్టీలో వారి పాత్ర గురించే అందరూ ఎదురు

# ఎంత వ్యత్యాసమో...
# రంగారెడ్డికి... ములుగుకు...

**హైదరాబాద్(ప్రజాబలం ప్రతినిధి: మార్చి 21,** తెలంగాణ రాష్ట్రంలో 2023-24 సంవత్సరపు 33 జిల్లాల జీడీడీపీ లెక్కలను ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టింది. తెలంగాణ సోషియో ఎకనామిక్ అవుట్ లుక్ -2025 బుక్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. 33 జిల్లాల్లో జీడీడీపీలో రంగారెడ్డి జిల్లా తొలిస్థానంలో ఉండగా, ములుగు జిల్లా చివరలో ఉంది.జీ.ఎస్.డీ.పీ అనేది రాష్ట్ర ప్రగతికి సూచికగా ఆర్థిక నిపుణులు చెబుతారు. జీ.ఎస్.డీ.పీ అంటే గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రోడక్ట్ అంటారు. అదే దేశం విషయానికి వస్తే జీడీపీగా అంటే గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్‌గా లెక్క గడతారు. ఇక జిల్లా పరిధిలో చూస్తే దాన్ని జీడీడీపీ అంటే గ్రాస్ డిస్ట్రిక్ డొమెస్టిక్ ప్రొడక్ట్‌గా లెక్క గడతారు. ఒక ఏడాదిలో ఆ దేశంలో ఉత్పత్తి అయిన వ్యవసాయ, పారిశ్రామిక, సేవల రంగాల ఉత్పత్తుల విలువను స్థూల జాతీయోత్పత్తి విలువ ( జీడీపీ) అదే రాష్ట్రంలో అయితే జీఎస్డీపీగా, జిల్లా పరిధిలో జీడీపీపీ లెక్క గడతారు. ఇలా చూస్తే 3,12,998 రూపాయలతో రంగారెడ్డి జిల్లా తొలి స్థానంలో ఉండగా రూ. 2,57,949 తో హైదరాబాద్ జిల్లా రెండోస్థానంలో నిలిచింది. మేడ్చల్ -మల్కాజ్ గిరి జిల్లా రూ.1,04,710తో మూడో స్థానంలో నిలిచాయి. ములుగు జిల్లా రూ.8,873తో చిట్ట చివరి స్థానంలో ఉంది. రాష్ట్రతలసరి ఆదాయం రూ.4 లక్షల దిశగా దూసుకెళ్తున్నది. 2024?25 సంవత్సరంలో 3.80 లక్షలకు చేరింది. నిరుడు పర్ క్యాపిటా ఇన్కం రూ.3,46,457 తో పోల్చినప్పుడు ఈసారి రూ.32,452 పెరిగి, 9.6% వృద్ధి రేటు నమోదు చేసింది. దేశ తలసరి ఆదాయం రూ.2,05,579 కన్నా ఇది 1.8 రెట్లు ఎక్కువ. కాగా, తలసరి ఆదాయంలో రంగారెడ్డి, హైదరాబాద్మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతుండగా, వికారాబాద్ చిట్టచివరన నిలిచింది. ఈ సారి హనుమకొండ, వికారాబాద్తప్ప మిగిలిన జిల్లాలన్నింటి తలసరి ఆదాయం 2 లక్షల మార్క్ దాటడం విశేషం. 2024--?25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్డీపీ (గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్) రూ.16 లక్షల12 వేల 579 కోట్లకు చేరింది. గతేడాది రూ.14,64,378 లక్షల కోట్లతో పోల్చినప్పుడు 10.1శాతం వృద్ధి రేటు నమోదైంది. దేశ వృద్ధి రేటు(9.9)తో పోలిస్తే ఇది 0.2 ఎక్కువ కావడం విశేషం. దేశ జీడీపీలో తెలంగాణ వాటా ఈ ఏడాది 4.9 శాతం కాగా, అంతకుముందు రెండేండ్లలో వరుసగా 5, 4.8, 4.9 శాతంగా ఉంది. ఈ లెక్కన నిరుడితో పోలిస్తే జీడీపీలో తెలంగాణ వాటా స్వల్పంగా 0.1 శాతం తగ్గింది. మరోవైపు తెలంగాణ జీఎస్డీపీ కి జిల్లాల నుంచి కంట్రిబ్యూషన్ లో చాలా తేడా కనిపిస్తున్నది. ఐటీ, ఫార్మా, నిర్మాణ, తదితర రంగాలతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి, సంగారెడ్డి, నల్గొండ లాంటి జిల్లాల్లో జీడీడీపీ (గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్) ఎక్కువగా ఉంటే పారిశ్రామికంగా వెనుకబడి, వ్యవసాయం తప్ప మరే ఇతర ఆదాయ వనరులు పెద్దగా లేని ములుగు, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, నారాయణపేట లాంటి జిల్లాల్లో జీడీడీపీ అతి తక్కువ గా ఉంది. ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల జిల్లాల్లోనే ఏర్పాటుకావడం, ఇక్కడే రియల్ ఎస్టేట్, సేవా రంగం కూడా విస్తరించడమే ఇందుకు కారణమంటున్నారు. మిగిలిన జిల్లాల్లో ఐటీ, ఇతర పరిశ్రమల ఏర్పాటును ప్రభుత్వాలు ప్రోత్సహించకపోవడంతో కొన్ని జిల్లాలు ఆర్థికంగా వెనుకబడుతున్నాయి. ఫలితంగా ఆయా జిల్లాల నుంచి హైదరాబాద్కు ఉపాధి కోసం వలసలు పెరుగుతున్నాయి.

తలసరి ఆదాయంలో రంగారెడ్డి టాప్.. వికారాబాద్ లాస్ట్..

2024?--25 సంవత్సరానికి తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా రూ. 10 లక్షల55 వేల913తో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవగా.. వికారాబాద్ జిల్లా రూ. 1,98,401తో చివరి స్థానంలో ఉంది. తలసరి ఆదాయంలోనూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, మేడ్చల్లాంటి జిల్లాలు మొదటి నాలుగు స్థానాల్లో ఉండగా, నారాయణపేట, మహబూబాబాద్లాంటి జిల్లాలు అట్టడుగున నిలిచాయి.

2014?-15లో 1.24 లక్షలుగా ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం పదేండ్లలో రూ.3.80 లక్షలకు పెరిగింది. అదే సమయంలో పదేండ్ల కింద 2014?-15లో రూ.72,658 కోట్లుగా ఉన్న రాష్ట్ర అప్పులు ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికి 7 లక్షల38 వేల 707 కోట్లకు చేరాయి. అంటే తలసరి ఆదాయం 305 శాతం పెరిగితే రాష్ట్ర అప్పులు మాత్రం ఏకంగా వెయ్యి రెట్లు పెరగడం గమనార్హం. అంటే రాష్ట్ర అప్పులు పెరిగిన నిష్పత్తిలో తలసరి ఆదాయం పెరగడం లేదని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

అతి ఎక్కువ తలసరి ఆదాయం కలిగిన 5 జిల్లాలు

| జిల్లా | తలసరి ఆదాయం |
|---|---|
| రంగారెడ్డి | 10,55,913 |
| హైదరాబాద్ | 5,54,105 |
| సంగారెడ్డి | 3,45,478 |
| మేడ్చల్? మల్కాజ్గిరి | 3,43,130 |
| భద్రాద్రి కొత్తగూడెం | 3,21,281 |

అతి తక్కువ తలసరి ఆదాయం కలిగిన 5 జిల్లాలు

| జిల్లా | తలసరి ఆదాయం |
|---|---|
| వికారాబాద్ | 1,98,401 |
| హనుమకొండ | 1,99,490 |
| జగిత్యాల | 2,05,273 |
| నారాయణపేట | 2,07,784 |
| మహబూబాబాద్ | 2,12,232 |

2023-24 సంవత్సరానికి జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ)

ప్రస్తుత ధరల వద్ద జిల్లా జీడీడీపీ

| జిల్లా | జీడీడీపీ |
|---|---|
| రంగారెడ్డి | రూ.3,17,898 కోట్లు |
| హైదరాబాద్ | రూ.2,57,949 కోట్లు |
| మేడ్చల్ మల్కాజిగిరి | రూ.1,04,710కోట్లు |
| సంగారెడ్డి | రూ.65,190 కోట్లు |
| నల్గొండ | రూ.53,771 కోట్లు |

అతి తక్కువ జీడీడీపీ జిల్లాలు

| జిల్లా | జీడీడీపీ |
|---|---|
| ములుగు | రూ. 8,873 కోట్లు |
| భూపాలపల్లి | రూ. 12,932 కోట్లు |
| కుమ్రంభీమ్ | రూ.13,700 కోట్లు |
| నారాయణపేట | రూ.13,818 కోట్లు |
| రాజన్న సిరిసిల్ల | రూ. 13,981 కోట్లు |

# సీసీఐపై సన్నగిల్లుతున్న ఆశలు

**అదిలాబాద్(ప్రజాబలం ప్రతినిధి: మార్చి 21,** ఆదిలాబాద్ జిల్లాలో పరిశ్రమల పునరుద్ధరణ, కొత్త పరిశ్రమల ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. జిల్లాలో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ భారీ పరిశ్రమలేవీ లేకపోవడంతో అభివృద్ధిలో వెనుకబడింది. ఇటీవల వరంగల్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సైతం అనుమతి వస్తుందని ప్రజలంతా భావించారు. కానీ వరంగల్‌కు అనుమతి ఇచ్చిన కేంద్రం.. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టును మాత్రం పక్కన పెట్టింది.మరో వైపు ముప్పై ఏండ్ల కింద మూతబడిన సీసీఐ (సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఫ్యాక్టరీని అయినా తిరిగి ప్రారంభిస్తారన్న ఆశతో ఉన్న ప్రజలకు మరోసారి నిరాశ తప్పలేదు. ఫ్యాక్టరీలోని సామగ్రిని తుక్కు కింద అమ్మేందుకు కేంద్రం టెండర్లు పిలవడంతో ప్రజలంతా హతాశులయ్యారు. ఫ్యాక్టరీని తిరిగి తెరిపించాలంటూ ఆందోళన బాట పడుతున్నారు.ఆదిలాబాద్ పట్టణ శివారులో ఏర్పాటైన సీసీఐ ఫ్యాక్టరీలో 1982 ఆగస్టు 15న సిమెంట్ ఉత్పత్తి ప్రారంభమైంది. సీసీఐకి సొంతంగా 870 ఎకరాలు ఉండగా మరో 2 వేల ఎకరాల భూమిని లీజుకు తీసుకుంది. ఫ్యాక్టరీలో సుమారు 4 వేల మంది ఉద్యోగులు, కార్మికులకు పనిచేసేవారు. 1984లో అప్పటి సీఎం ఎన్‌టీ.రామారావు, కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి తివారీ చేతుల మీదుగా జాతికి అంకితం చేశారు. అప్పటినుంచి 1991 వరకు సిమెంట్ ఉత్పత్తి చేస్తూ దేశంలోని నలుమూలలకు సరఫరా చేశారు.1991, 1992, 1993లో మూడేళ్ల పాటు వేల కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో ప్రభుత్వం లేవీ పద్ధతి (60 శాతం ప్రభుత్వ కొనుగోళ్లు)ని రద్దు చేయడంతో సీసీఐకి బడ్జెట్ కేటాయింపులు నిలిచిపోయాయి. దీంతో 1993 అక్టోబర్‌లో సీసీఐలో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఫ్యాక్టరీని తెరిపించాలని ముప్పై ఏండ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తూనే ఉన్నా ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదు.ముప్పై ఏండ్లుగా మూతబడిన ఫ్యాక్టరీ ఎన్నటికైనా తిరిగి ప్రారంభం అవుతుందని స్థానిక ప్రజలు ఎంతో ఆశతో ఉన్నారు. కానీ సీసీఐ ఫ్యాక్టరీలోని యంత్రాలకు సంబంధించిన సామగ్రిని తుక్కు కింద అమ్మేందుకు కేంద్రం మార్చి 7న టెండర్లు ఆహ్వానించింది. సిమెంటు ఉత్పత్తికి వినియోగించిన యంత్రాల సామగ్రి, ఇతర అవసరాలకు వినియోగించిన ఇనుము, పాత వాహనాలు.. ఇలా మొత్తం 71 యంత్రాలు, భవనాల ఇనుప తుక్కు సామగ్రిని అమ్మేందుకు నిర్ణయించిన కేంద్రం, మొత్తం రూ.43.30 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది.దీనిపై పెద్దఎత్తున వ్యతిరేకత రావడం, జిల్లాలో ఆందోళనలతో పాటు కార్మిక సంఘాలు కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో యాజమాన్యం టెండర్ ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేసింది. కానీ ఎప్పటికైనా సీసీఐని అమ్మాలన్న ఉద్దేశంతోనే కేంద్రం ఉందంటూ జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే సీసీఐని కాపాడుకునేందుకు పార్టీలు, సంఘాలకు అతీతంగా ఉద్యమ బాట పడుతున్నారు.సీసీఐ ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభించాలంటూ మూడేండ్ల కిందే సీసీఐ సాధన కమిటీని ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. ఇందులో భాగంగా పట్టణ బంద్‌తో పాటు దీక్షలు, రాస్తారోకోల వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. సీసీఐ ఫ్యాక్టరీ సామాగ్రిని తుక్కు కింద అమ్మేందుకు 2022లోనూ యాజమాన్యం టెండర్లు పిలిచింది. అప్పుడు ఆందోళనలు జరగడంతో ఆ ప్రక్రియ కాస్తా నిలిచిపోయింది. తాజాగా మరోసారి తుక్కు కింద అమ్మాలని నిర్ణయిండంతో సీసీఐ సాధన కమిటీ ఉద్యమబాట పట్టింది.ఇందులో భాగంగా రెండు రోజులుగా ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్నారు. సీసీఐ పునరుద్ధరణపై ఎన్నికల సమయంలో బీజేపీ లీడర్లు హామీలు ఇస్తున్నారే తప్ప.. ఆచరణలో పెట్టడం లేదని, ఫ్యాక్టరీ పునరుద్ధరణలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు విఫలం అయ్యారంటూ ఆరోపిస్తున్నారు. ఈ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే సీసీఐ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

# కటకటాల్లోకి నిమ్మకాయల బాబా

**కరీంనగర్,(ప్రజాబలం ప్రతినిధి: మార్చి 21,**ఎన్ని మోసాలు జరుగుతున్నా ఎంతమంది మోసపోతున్నా బాబాలపై నమ్మకాలు చచ్చిపోవడం లేదు. అందుకే దీన్నే అవకాశంగా తీసుకుంటున్న కేటుగాళ్లు బాబాల అవతారంలో జనాలను నిలువు దోపిడీ చేస్తున్నారు. అలాంటి ఘటన సిరిసిల్లా జిల్లాలో వెలుగు చూసింది. నిమ్మకాయలతో ఆరోగ్యాలు బాగు చేస్తానని చెప్పే ఓ బాబా మోసాలకు పోలీసులు చెక్ పెట్టారు. ఆర్థిక, వ్యక్తిగత, మానసిక, ఆరోగ్య సమస్యలు నయం చేస్తామంటూ వేములవాడకు చెందిన ఓ వ్యక్తి బాబా అవతారం ఎత్తాడు. బాపు స్వామి పేరుతో స్థానికంగా ప్రజలను తన వద్దకు రప్పించుకొని మోసాలకు పాల్పడేవాడు. ఈ బాపు స్వామి నిజస్వరూపం తెలియని ప్రజలు అమాయకంగా నమ్మారు. ఆ నమ్మకాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్నాడు బాపు స్వామి. పూజలు చేసి సమస్యలు లేకుండా చేస్తామని చెప్పి మహిళలను లోబరుచుకుంటున్నాడు. మంత్రించిన నిమ్మకాయలు ఇస్తే అన్నీ నయం అవుతాయని నమ్మించి మోసాలకు పాల్పడ్డాడు. ప్రత్యేక పూజలు పేరుతో నిమ్మకాయలను ఇచ్చేవాడు. అందులో ఎవరికీ తెలియకుండానే మత్తుమందు చల్లేవాడు. దాని వాసన పీల్చే మహిళలు స్పృహతప్పి పడిపోయేవాళ్లు. అలాంటి వాళ్లపై లైంగిక దాడులకు పాల్పడేవాడు ఈ బాబా. ఆ దృశ్యాలను రికార్డు చేసి బాధితులను బ్లాక్ మెయిల్ చేసేవాడీ బాబా. చాలా మంది బాబా బాధితులు భయంతోనో వేర్వేరు కారణాలతో నోరు విప్పేందుకు భయపడేవాళ్లు. అయినా కొందరు పోలీసులు ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు నిఘా పెట్టారు. దొంగబాబాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అందులో వందల మంది మహిళల వీడియోలు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో బాబాను అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఇలాంటి బాబాలను అసలు నమ్మొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# 1000 కోట్లతో వరంగల్ కార్పొరేషన్ బడ్జెట్

**వరంగల్,(ప్రజాబలం ప్రతినిధి: మార్చి 21,**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) 2025?26 ఆర్థిక సంవత్సరానికి భారీ బడ్జెట్ ను ప్రతిపాదించింది. గతేడాది రూ.650.12 కోట్లతో గ్రేటర్ బడ్జెట్ పెట్టగా.. ఈసారి అంచనాలు భారీగా పెంచేసి రూ.1071.41 కోట్లతో ముసాయిదా బడ్జెట్ ప్రవేశ పెట్టారుఇందులో రూ.337 కోట్ల 38 లక్షలు సాధారణ పన్నుల ద్వారా, రూ.728 కోట్ల 10 లక్షలు వివిధ గ్రాంట్ల ద్వారా, రూ 600 కోట్లు డిపాజిట్లు, అడ్వాన్సుల ద్వారా సమకూరుతాయని అంచనా వేశారు. ఈ బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పరకాల, వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.బల్దియా సొంత ఆదాయం ద్వారా వచ్చే 337 కోట్ల 38 లక్షల రూపాయలలో 100 కోట్ల రూపాయలు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది జీతభత్యాలు, 29 కోట్ల 92 లక్షల రూపాయలు పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగించనున్నారు. మరో 34 కోట్ల 30 లక్షల రూపాయలు విద్యుత్తు చెల్లింపులు, 33 కోట్ల 74 లక్షల రూపాయలు గ్రీన్ బడ్జెట్, 41 కోట్ల 5 లక్షల రూపాయలు ఇంజనీరింగ్ విభాగానికి కేటాయించారు. 21 కోట్ల 15 లక్షల రూపాయలు సాధారణ నిర్వహణకు, కోటి 40 లక్షల రూపాయలు టౌన్ ప్లానింగ్ కోసం, కోటి 50 లక్షల రూపాయలు డిజాస్టర్ రెస్పాన్స్ కొరకు కేటాయించారు.విలీన గ్రామాలు, బలహీనవర్గాలు నివసించే ప్రాంతాల్లోని స్లమ్ ఏరియాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.24 కోట్ల 77 లక్షలు, అలాగే ప్రజా సౌకర్యాల కల్పన, పార్కుల అభివృద్ధి, జంతువధ శాలలు, వీధి వ్యాపారులు, వెండింగ్ జోన్లు, ఓపెన్ జిమ్ ల ఏర్పాటుకు రూ. 10 కోట్ల 40 లక్షలు, వార్డుల వారీగా అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.39 కోట్ల 15 లక్షలు కేటాయించారు.

ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రూ.187 కోట్ల స్టాంప్ డ్యూటీ ఫండ్స్ ను ముఖ్యమంత్రి మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా ఆ బడ్జెట్ పారిశుధ్య కార్మికులు, ఎలక్ట్రికల్ వర్కర్ల జీతభత్యాలు పెంచడానికి స్లమ్ ఏరియాల అభివృద్ధికి 1/3 బడ్జెట్ కేటాయించేందుకు తోడ్పడిందన్నారు.గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారని, రాష్ట్ర రెండో రాజధానిగా డెవలప్ చేస్తున్నారని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ అభివృద్ధిలో మనమంతా భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగరాన్ని అన్నివిధాలా సుందరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో టెల్ పార్క్ , విమానాశ్రయం, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, స్ట్రోమ్ వాటర్ డ్రైన్, ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయాల కతీతంగా వరంగల్ నగరాభివృద్ధికి అందరు సమష్టిగా కృషి చేయాలని కోరారు.గ్రేటర్ వరంగల్ పాలకవర్గం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యం గా ఉందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన 13 విలీన గ్రామాలున్నాయని, వాటిని అభివృద్ధి పరిచేలా నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారుపరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ కు ధీటుగా వరంగల్ ను అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారన్నారు. అభివృద్ధిలో కార్పొరేషన్కు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. బల్దియాలో అభివృద్ధి జరగాలంటే వివిధ పన్నుల ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని సూచించారు.

# కోటి డెబ్బై లక్షల ఆస్తి పన్ను చెల్లించిన కోర్టు



**మెదక్ ప్రజాబలం ప్రతినిధి:**2004 నుండి పెండింగ్ లో సుమారు ఒక కోటి 70 లక్షల పైచిలుకు ఆస్తి పన్నును మెదక్ జిల్లా కోర్టు సముదాయం యొక్క ఆస్తి పన్ను మున్సిపల్ కమిషనర్ సహకారంతో, ఆర్ ఓ మేడం భవాని. వార్డ్ ఆఫీసర్ ప్రహ్లాద్ మరియు మున్సిపల్ సిబ్బంది కృషితో 1,70,42.046. మున్సిపల్ కార్యాలయానికి కోర్టు వారు చెల్లించారు. సహకరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి లక్ష్మీ శారద కి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# కాళేశ్వరాన్ని చతికిలపడుతోందా... పడేస్తున్నారా

**కరీంనగర్‌ప్రజాబలం ప్రతినిధి: మార్చి 21,** నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వారి పర్యవేక్షణలో రెండు అడుగులు కుంగిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును మళ్లీ కట్టాలని అంటున్న ఈ తరుణంలో తెలంగాణలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి ఇబ్బందికరంగా మారే పరిస్థితులు వచ్చే అవకాశముందని కాంగ్రెస్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్ శాసన సభలో ప్రకటన చేయడం చర్చకు దారితీసింది.అంటే కాళేశ్వరం గొప్పతనాన్ని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకున్నట్లేననే ప్రచారానికి బీఆర్ఎస్ పార్టీ వర్గాలు తెరలేపారు. అయితే ఆ ప్రకటన ఏ సందర్భంలో చేశారు. ఎందుకు ఒక ఎమ్మెల్యే ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయించిందనే విషయమై సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన ప్రధాన బ్యారేజీ మూడు గేట్లు కుంగిపోవడంతో ప్రమాదకరమని భావించి, గద్దెనెక్కిన కొన్ని రోజుల వ్యవధిలోనే బ్యారేజీలో ఉన్న నిలువనీటిని పూర్తిగా విడిచిపెట్టారు. ఇది తొందరపాటు చర్య అని బీఆర్ఎస్ తీవ్రంగా ప్రభుత్వంపై విరుచుకుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో కుట్ర పూరితంగా వ్యవహరించిందని, మూడు గేట్లు కుంగిపోవడం వల్ల జరిగే నష్టం ఏమిలేదని, వాటిని మరమ్మతు చేస్తే సరిపోతుందని బీఆర్ఎస్ నాయకులు నెత్తినోరు మొత్తుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీస్టేజీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా పిలువబడే ఈ ప్రాజెక్టు ఇలాగే కొనసాగితే అపర భగీరథుడని కేసీఆర్ పేరు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుందని, లేనిపోని ఆరోపణలు చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు జరిగాయని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారమని ఆరోపించారు. అయితే ఒకవైపు ఈ విషయమై ట్రిబ్యునల్ ప్రాజెక్టు నిర్మాణంలో బాధ్యులైన వారందరినీ ప్రశ్నించే ప్రక్రియ నడుస్తుండగా, మరోవైపు ఈ ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేసి నీటి నిలువ చేయకుంటే సాగు, తాగు నీటి సమస్యలు తలత్తే అవకాశాలు ఉన్నాయని తన అభిప్రాయం వ్యక్తం చేసింది.ప్రాజెక్టు ఎత్తిపోతల మూలంగా గోదావరి ఎగువ ప్రాంతంలో నీటి సమస్య లేకుండా జలకళ ఉట్టిపడింది. అలాగే భూగర్భ జలాలు పెరిగి సాగుకు సమస్య లేకుండా చేశాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు చతికిల పడడంతో నీరు ఎతిపోసే అవకాశం లేకుండా పోవడంతో జలశయాల్లో నీటి మట్టం రోజురోజుకు తగ్గుముఖం పట్టడం వల్ల ఆందోళనకు కారణమవుతోంది. గత రబీ, ఖరీఫ్ సీజన్లలో నీటి సమస్య పెద్దగా కనిపించలేదు. ప్రస్తుత రబీకి పంట పొలాలకు నీరందించడమే కాకుండా తాగునీటికి కూడా సమస్యగా పరిణమించవచ్చని భావిస్తున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు పడుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ప్రస్తుతం వేసవి కాలంలో సమస్యలు తలత్తే అవకాశాలున్నాయని, అందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలకు సహకరించాలని ముందస్తు శాశనసభ వేదికగా ఒక ఎమ్మెల్యే ద్వారా దీనికి సంబంధించి ఒక ప్రకటన విడుదల చేయడం వెనుక ఆంతర్యం బోధపడుతోంది. ఈ ప్రకటన ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనాన్ని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుందనే ప్రచారానికి ఊతమిచ్చినట్లైంది. ఇప్పటి వరకు కాళేశ్వరం ప్రాజెక్టు లోపభూయిష్టమని, పనికిరాని ప్రాజెక్టు కట్టి ప్రజల నెత్తిన అప్పుల భారం మోపారని, ప్రాజెక్టు ఆగిపోయినా అనుకున్న స్థాయిలో సాగుతో పాటు ఎక్కువ దిగుబడి వచ్చిందని ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు శాశనసభ సమావేశాల్లో ఒక ఎమ్మెల్యేతో ఇలాంటి ప్రకటన చేయించడానికి కారణాలేమై ఉంటాయని చర్చ మొదలయ్యింది. నిజంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మూలంగా సాగుబడి ఎక్కువైందా, తాగునీటి సమస్య పూర్తిగా లేకుండా పోయిందా అనే విషయం మళ్లీ చర్చకు దారితీసిందిఅయితే ఈ ప్రాజెక్టు నిర్మాణం, ఎత్తిపోతల ద్వారా ప్రధాన జలాశయాలను నీటితో నింపడమనే ప్రక్రియతో ఎక్కడ చూసినా జలకళ కనిపించిన మాట వాస్తవమే. కాని శ్రీపాదసాగర్(ఎల్లంపల్లి), శ్రీరాంసాగర్ ప్రాజెక్టులకు దిగువ కాళేశ్వరం ప్రాజెక్టు కింద భాగం వరకు కొత్తగా ఒక్క ఎకరానికి ఈ ప్రాజెక్టు మూలంగా నీరు అందలేదని ఆయా ప్రాంతాల రైతులు చెబుతున్నారు. ఎకబిగిన వరుసగా నీటిని ఎత్తిపోసే ప్రక్రియలో తమ భూములకు నీరు అందించాలనే ఆలోచన పాలకులు చేయలేదని ఆరోపించారు. కేవలం కొన్ని ప్రాంతాలకు మాత్రమే కాలువల ద్వారా నీరందించారని, తమ ప్రాంతంలో కనీసం కాల్వల నిర్మాణం చేయలేదని అంటున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అద్భుతమే కాని తమకు మాత్రం ఈ ప్రాజెక్టు వల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని వారు అభిప్రాయపడ్డారు.

## అగ్గిపెట్టెలో ఇమిడే చీరకు అబ్బురపడిన మిస్ వరల్డ్




**సిరిసిలప్రజాబలం ప్రతినిధి;** నేతన్న ప్రతిభకు మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా అబ్బురపడ్డారు. జిల్లా కేంద్రానికి చెందిన నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ నేసిన అగ్గిపెట్టెలో ఇమిడే చీరను చూసి ఆశ్చర్యానికి గురయ్యారు.ఇంత చిన్న అగ్గిపెట్టెలో అమరిన చీరను నేసిన నేతన్నను అభినందించారు. వివరాల్లోకి వెళితే 2025 మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం 2024 మిస్ వరల్డ్ పోటీలలో విజేతగా నిలిచిన చెక్ రిపబ్లిక్ అందాల భామ క్రిస్టినా హైదరాబాద్ సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని చేనేత కళాకారుల అద్భుత పనితీరును మిస్ వరల్డ్ క్రిష్టినాకు పరిచయం చేశారు. అందులో భాగంగా సిరిసిల్ల నేతన్నల ప్రతిభను ఖండాంతరాలకు వ్యాపింప చేసిన వెల్ది హరిప్రసాద్ తాను నేసిన చేనేతలను మిస్ వరల్డ్ కు చూపించారు. అద్భుత నైపుణ్యంతో నేసిన చేనేత వస్త్రాలను చూసిన మిస్ వరల్డ్ క్రిస్టినా నేతన్న పనితీరుకు మంత్రముగ్ధులయ్యారు.అగ్గిపెట్టెలో ఇమిడి చీరను ప్రత్యేకంగా తన భుజాలపై వేసుకొని ఫోటోలకు ఫోజులిచ్చారు. మిస్ వరల్డ్ సిరిసిల్ల చేనేతలను ప్రశంసించడం పట్ల నేత కళాకారుడు హరి ప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. సిరిసిల్ల నేతన్నల కీర్తిని విశ్వవ్యాప్తం చేసే దిశగా మరిన్ని ఆవిష్కరణలను రూపొందిస్తానని హామీ ఇచ్చారు.

## ట్రావెల్స్ బస్సు ఢీకొని ఏఆర్ జవాన్ మృతి



కడప దువ్వూరు మండలం ఇడమడక చెక్పోస్ట్ వద్ద తెల్లవారుజామున కానిస్టేబుల్ ను కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఘటనలో ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ బండి నారాయణకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం స్థానిక చాగలమర్రి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. నారాయణకు భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీలకు గాయాలు

మహబూబాబాద్‌నర్సింహులపేట మం. పెద్దనాగారం స్టేజి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం 17 మంది మహిళ కూలీలతో వెళుతున్న ఆటో ను లారీ ఢీకొంది. ఐదుగురి పరిస్థితి విషమంగా వుంది. , మరో 8 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్ లలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు అందరూ తొర్రూర్ మండలం చెర్లపాలెం గ్రామానికి చెందినవారు. మిర్చి తోట ఏరడానికి బంగ్లా వైపు వెళుతుండగా ప్రమాదం జరిగింది.

# బొట్టు బొట్టును ఒడిసిపట్టు.. భవిష్యత్ తరాలకు నీటిని అందించు

## –నేడు ప్రపంచ నీటి దినోత్సవం




ప్రపంచ నీటి దినోత్సవాన్ని ప్రతిసంవత్సరము మార్చి 22 వ తేదీన నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించినది. ప్రపంచ నీటి దినోత్సవాన్ని అంతర్జాతీయంగా పాటించాలన్న ఆలోచన, పర్యావరణం, ప్రగతి అనే అంశంపై 1992లో రియో డి జెనేరోలో జరిగిన ఐక్యరాజ్యసమితి మహాసభ " (యు ఎన్ సి ఇ డి) లో రూపుదిద్దుకున్నది. ఇందులో భాగంగా, 2010 సంవత్సరాన్ని " ఆరోగ్యవంతమైన ప్రపంచంకోసం, పరిశుభ్రమైన నీరు " అనే, నిర్దిష్ట భావనతో పాటించడం జరుగుతుంది. మనం నివసించే భూగోళంలో 70 శాతానికిపైగా నీరే. అయితే, ఇందులో శుభ్రమైన నీరు చాలా స్వల్ప భాగం మాత్రమే. మొత్తం భూగోళంలోని నీటిలో దాదాపు 2.7 శాతం మాత్రమే శుభ్రమైన నీరు కాగా, ఇందులోనూ 75.2 % ధృవప్రాంతాలలో మంచురూపంలో ఘనీభవించి వుంటే, మరో 22.6 % నీరు భూగర్భంలో వుంది. మిగతా నీరు సరస్సులు, నదులు, వాతావరణం, గాలిలోని తేమ, భూమిలోని చెమ్మ, చెట్టు చేమలలో వుంటుంది. ఇంతేకాదు, సరస్సులు, నదులు, భూగర్భ జలాలలో కూడా మానవ వినియోగానికి, ఇతర అవసరాలకు చక్కగా ఉపయోగపడగలిగిన నీరు, చాలా కొద్ది పరిమాణం మాత్రమే.ప్రపంచం మొత్తంలో లభ్యమయ్యే, పరిశుభ్రమైన నీటిలో, 1 % కంటెకూడా తక్కువ పరిమాణంలో, ( లేదా, భూమిపై లభించే మొత్తంనీటిలో దాదాపు 0.007 % మాత్రమే) నీరు మానవ వినియోగానికి నేరుగా ఉపయోగపడుతుంది. ప్రతిరోజూ , మనకు కనీసం 30–50 లీటర్ల పరిశుభ్రమైన, సురక్షితమైన నీరు అవసరం. కాని, ఇప్పటికీ, 88.4 కోట్ల మంది( 884 మిలియన్ల మంది) ప్రజలకు సురక్షితమైన నీరు అందుబాటులో లేదు.ప్రపంచవ్యాప్తంగా, ప్రతిఏటా , 1,500 ఘన కిలోమీటర్ల పరిమాణంలో, వ్యర్థమైన నీరు వస్తుంటుంది. వ్యర్థ పదార్థాలను, వ్యర్థమైన నీటిని పునర్వినియోగ ప్రక్రియ ద్వారా, ఇంధనోత్పత్తికి, వ్యవసాయ అవసరాలకు వినియోగించవచ్చు. కాని, సాధారణంగా , అలా జరగడం లేదు. అభివృద్ధిచెందుతున్న దేశాలలో, తగిన నిబంధనలు, వనరులు లేనికారణంగా, 80 శాతం వ్యర్థాలను పునర్వినియోగ ప్రక్రియకు మళ్ళించకుండానే పారవేస్తున్నారు. పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక ప్రగతికూడా, కొత్తరకాల కాలుష్యానికి మూలమవుతున్నాయి. ఇదే దామాషాలో, పరిశుభ్రమైన నీటి అవసరం పెరుగుతున్నది. ఈ కారణంగా, ఇటు వర్తమానంలోను, అటు భవిష్యత్తులోను మానవ ఆరోగ్యానికి , పర్యావరణ స్వచ్ఛతకు ముప్పు పొంచివుండగా ; తాగడానికి ఉపయోగపడే పరిశుభ్రమైన నీటికి, వ్యవసాయ అవసరాలకు కావలసిన నీటికి తీవ్రమైన కొరత ఏర్పడుతున్నది. అయినప్పటికి, నీటి కాలుష్యం 'అత్యవసరంగా దృష్టిసారించవలసిన అంశం' అనే ప్రస్తావన, అరుదుగా కాని రావడంలేదు.నీళ్లు–నిజాలువేసవి వస్తోందంటేనే భయమేస్తోంది. నీటి కొరత దడ పుట్టిస్తుంది. బిందెలతో బారులు తీరే జనాలు కనిపిస్తారు. మరి నీటి సమస్య అంత విస్తృతమైనది. నీరు లభించని ప్రాంతాలలో ఎదురయ్యే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. నేల తల్లి నెర్రెలిచ్చి నీటిచుక్కకోసం ఆబగా ఎదురుచూస్తుంటే ఇక మానవమాత్రులెంత! గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళు నడిచిపోవాల్సిన పరిస్థితి. పరిశుభ్రమైన నీళ్లు దొరక్క కుంటల్లో, గుంటల్లో అడుగుబొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితి. ఇలాంటి కఠోర వాస్తవాలు కొన్ని...ప్రపంచంలో 80 దేశాలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. భూమండలంమీద లభించే నీటిలో ఉప్పు సుమద్రాల వాటా 97 శాతం. మిగిలిన దానిలో 69 శాతం హిమపాతం, మంచుగడ్డలే. భూమి మీద లభించే నీటిలో 0.008 శాతం మాత్రమే స్వచ్ఛమైన నీరు.క్రీశ 2025 నాటికి 48 దేశాల్లో తీవ్రమైన నీటికొరత వస్తుందని చికాగోలోని జాన్ హాప్కిన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హెచ్చరించింది.3.575 మిలియన్ల మంది ప్రతి సంవత్సరం నీటికి సంబంధించిన వ్యాధులతో మరణిస్తున్నారు. నీటిమూలంగా సంభవించిన 43 శాతం మరణాలకు అతిసారవ్యాధే కారణం.పైన పేర్కొన్న మరణాలలో 84 శాతంమంది 14 ఏళ్ల లోపువారే.98 శాతం మరణాలు అభివృద్ధి చెందుతున్న దేశాలలోనే సంభవిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆసుపత్రులలో చికిత్సపొందుతున్న రోగులలో సగం మంది నీటి సంబంధ వ్యాధులతో బాధపడుతున్నవారే. భూమిమీదున్న నీటిలో ఒక్క శాతానికంటే తక్కువ మొత్తం నీళ్లు మాత్రమే మానవాళి వెనువెంటనే వాడుకునేలా వున్నాయి.అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని మురికివాడల్లో నివసించే ఒక వ్యక్తి రోజుమొత్తంమీద ఉపయోగించే నీరు ఒక అమెరికన్ స్నానానికి వాడే నీటితో సమానం.లీటరు నీటికి మురికివాడల్లో నివసించే పేదలు, అదే నగంలోని ధనికులకంటే 5–10 రెట్లు అధికధర చెల్లిస్తున్నారు.ఆహారం లేకుండా మనిషి కొన్ని వారాలపాటు వుండగలడు. కానీ నీరు లేకుండా కొద్దిరోజులు మాత్రమే వుండగలడు.ప్రతి 15 సెకన్లకు ఒక చిన్నారి నీటి సంబంధ వ్యాధితో చనిపోతోంది. లక్షలాది మంది మహిళలు, పిల్లలు రోజుమొత్తం మీద అనేక గంటల సమయాన్ని సుదూర ప్రాంతాలనుంచి నీళ్లు తేవడం కోసం వెచ్చిస్తారు.నీటి కోసం ఒక రోజును ఎందుకు కేటాయించారు? నీరు లేని భూమిని ఒకసారి ఊహించుకోండి. పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహా సముద్రాలు ఏమీ ఉండవు. ఇవేవీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి. అంతటి అమూల్యమైన నీటి విలువను తెలుసుకోడానికి, దానిని వృథా చేయకుండా అవగాహన కల్పించడానికి ఈ రోజును కేటాయించారు. ఐక్య రాజ్య సమితి 1993 నుంచి ప్రతి ఏడాది మార్చి 22ను అంతర్జాతీయ జలదినోత్సవంగా గుర్తించాలని నిర్ణయించింది. మన భూమ్మీద నీటి గురించి కొన్ని నిజాలు తెలుసుకుంటే అదెంత విలువైనదో అర్థం అవుతుంది. భూమి ఏర్పడినప్పుడు ఎంత నీరు ఉందో ఇప్పుడూ అంతే ఉంది. పెరగడం కానీ తరగడం కానీ కాలేదు. కానీ ఆ నీటిని వాడుకునేవారి జనాభా మాత్రం విపరీతంగా పెరిగిపోయింది. అందుకే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది నీటి కోసం కటకటలాడుతున్నారు. భూమ్మీద ఉన్న నీరు ఎండకు ఆవిరవుతూ, మేఘాలుగా మారుతూ, వర్షంగా కురుస్తూ, భూమిలో ఇంకుతూ, సముద్రంలో కలుస్తూ వేర్వేరు రూపాల్లోకి మారుతూ ఉంటుంది. అంటే ఒకప్పుడు డైనోసార్లు ఎంగిలి చేసిన నీటినే ఇప్పుడు మనం కూడా తాగుతున్నామన్నమాట. భూమ్మీద మూడొంతులు నీరే ఉంది. కానీ అందులో 97 శాతం ఉప్పునీరే. కేవలం 3 శాతమే మంచి నీరు. ఇందులో కూడా 2 శాతం మంచురూపంలో ఉంది. మిగతా ఒక శాతం నీరులో 0.59 శాతం భూగర్భంలో ఉంటే, మిగతాది నదులు, సరస్సుల్లో ప్రవహిస్తోంది. ఉన్న మంచి నీటిని మనం పొదుపుగా వాడకపోగా కలుషితం కూడా చేస్తున్నాం. ప్రపంచంలో 500కు పైగా మంచినీటి నదులు కలుషితమైపోయాయి. ప్రపంచంలో భారీ యుద్ధాల్లో చనిపోయిన వారి కన్నా, కలుషిత నీటి వల్ల మరణించిన వారే ఎక్కువ. ఏడాదికి 40 లక్షల మంది కలుషిత నీరు తాగి చనిపోతున్నారు. అమెరికాలో ఒక వ్యక్తి తన అవసరాలకి రోజుకి 500 లీటర్ల నీటిని ఉపయోగిస్తుంటే, ఆఫ్రికాలోని గాంబియా దేశంలో ఒక వ్యక్తి రోజుకి కేవలం 4.5 లీటర్ల నీటిని మాత్రమే వినియోగిస్తున్నాడు. గాంబియాలాంటి చాలా దేశాల్లో తాగేందుకు కూడా నీరు దొరకడం లేదు.మనమేం చేయాలి? ఎక్కడైనా కొళాయిల్లోంచి నీరు వృథాగా పోతున్నట్టు కనిపిస్తే వెంటనే కట్టేయండి. షవర్‌తో స్నానం చేయడం మానేసి, బకెట్ నీళ్లతో చేయండి. దీని వల్ల రోజులో 150 లీటర్ల నీటిని కాపాడవచ్చు.×పళ్లు తోముకున్నంత సేపూ సింక్‌లోని కొళాయిని వదిలి ఉంచకండి. ఇలా చేయడం వల్ల నెలకి 200 లీటర్ల నీరు వృథా అవుతుంది. టాయిలెట్ ఫ్లష్‌లో సుమారు 8 లీటర్ల నీరు పడుతుంది. లీటర్ నీరు పట్టే రెండు బాటిళు తీసుకుని దానిలో ఇసుక లేదా చిన్న చిన్న రాళ్లు నింపి, టాయ్‌లెట్ ఫ్లష్‌లో పెట్టేయండి. దీనివల్ల ఒకసారి వాడే నీటిలో రెండు లీటర్ల నీళ్లు ఆదా అవుతాయి. అక్వేరియంలోని నీళ్లు పారేయకుండా మొక్కలకి పోయండి. కొళాయిలకి లీకేజీలు ఉంటే దానిని అరికట్టండి. దీనివల్ల నెలలో 300 గ్యాలన్ల నీరు ఆదా అవుతాయి. స్కూళ్లో, మీ ఇంటి చుట్టుపక్కల మొక్కలు పెంచండిమీకు తెలుసా? ఒక కిలో బియ్యాన్ని పండించడానికి 5000 లీటర్ల నీరు అవసరమవుతుంది. ఒక వార్తాపత్రికలో వాడే కాగితం తయారీకి 300 లీటర్ల నీరు ఖర్చవుతుంది. ప్రపంచంలోని మంచినీటిలో 70 శాతాన్ని వ్యవసాయంలో, 22 శాతం పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నారు. ప్రపంచంలో నీటిపై జరుగుతున్న వ్యాపారం విలువ 400 బిలియన్ డాలర్లు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం




అన్నమయ్య బి.కొత్తకోట మండ ం, కనికిల తోపు లో శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని 58ఏళ్ళ వ్యక్తి మృతి చెందాడు. కొత్తకోట మండలంలోని గోళ్లపల్లి సమీపంలోని దొడ్లడైరీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడన్న సమాచారం అందుకున్న బి.కొత్తకోట పోలీసులు, వెంటనే గోళ్ళపల్లి వద్దకు చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. పంచనామ అనంతరం పోస్టు మార్టం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది

# పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 21 మార్చి 2025** పవిత్ర ఉమ్రా క్షేత్రం నకు మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ అజీమ్ నాయకత్వంలో వెళ్లి వచ్చిన షేక్ అరిఫ్ మొహమ్మద్, మొహమ్మద్ అస్సీమ్ ల ఆద్వర్యంలో మణికొండ పరిధి నెక్నంపూర్ పాయినేర్ ఎస్టేట్ లోని మస్జీద్ ప్రక్కన ఏం.కే టవర్స్ లో గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందుకు బీ.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్ రెడ్డి విచ్చేసిన సందర్భముగా స్థానికులు కలీం, అరీఫ్ శా మొహిద్దిన్, అజిముద్దీన్ బైగ్, ఫారతుల్ల భైగ్ లతో పాటు సీతారాం ధూళిపాళ, కుంబగళ్ళ ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేందర్నాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, రామసుబ్బా రెడ్డి, కీర్తి లత గౌడ్, దిలీప్, రాజేంద్ర ప్రసాద్, విజయ లక్ష్మి, మల్యాద్రి నాయుడు, యాలాల కిరణ్, భాను చందర్, సుమనళిని, సుమన్, బొడ్డు శ్రీధర్, మహేందర్, కృపాకర్, యాలాల బెన్నీ, దీపక్ సింగ్ తది తరులు హాజరైనారు.

# సమస్యలతో విసిగెత్తిన మణికొండ ప్రజానీకం




**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 21 మార్చి 2025** గుడ్ మార్నింగ్ మణికొండ బీ.ఆర్.ఎస్ పార్టీ మార్నింగ్ వాక్ శుక్రవారం రోజున పుప్పాలగుడా శ్రీ లక్ష్మినరసింహ స్వామి నగర్ వీదులలో ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలుగా: జనావాసాల మధ్యలో ఈ.ఐ.పీ.ఎల్ రెడీ మిక్స్ ప్లాంట్ నడుపుతున్న కారణంగా దుమ్ము, ధూళి, శబ్ద, వాయు కాలుశ్యాలతో చిన్నా పెద్దలు అనారోగ్య పాలవడం, నిద్ర లేమితో బాధపడుతూ ఇట్టి సమస్యల గురించి పలుమార్లు స్థానిక నాయకులకు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నప్పటికీ స్పందన లేదని వాపోయారు. రెడీ మిక్స్ ప్లాంట్ లేబర్ క్యాంప్ గుడిసెలు వేసిన కారణంగా పుప్పాలగూడ గ్రామ స్మశాన వాటికకు పాత కాలం నుండి ఉన్న బండ్ల బాట కబ్జాకు గురి కావడం, స్వచ్ఛత పాటించక పోవడం, రాత్రి పూట అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు వాపోయారు. తదుపరి షేక్పేట్ నుంచి ఓ.ఆర్.ఆర్ సర్వీస్ రోడ్డు వరకు చేపట్ట వలసిన రేడియేల్ రోడ్ (నెంబర్ 5) అసంపూర్తిగా ఉన్న కారణంగా మణికొండ ప్రజానీకం తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నారని కావున హెచ్.ఎం.డి.ఏ అధికారులు ఈ రోడ్డు పనిని త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారరు మంచినీరేమో నిర్ణీత సమయంలో రాకుండా, వచ్చినా అరగంట నుంచి 45 నిమిషాలు రావడం వలన సరిపోవడం లేదని తెలియ పరచారు. ఇక్కడ దాదాపు 70 నుంచి 80 వీధి కుక్కల కారణంగా పిల్లలు పెద్దళ్లు చాలా ఇబ్బంది పడుతున్నారు కాబట్టి మున్సిపాలిటీ వారు సత్వరమే స్పందించి వీధి శునకాలకు షెల్టర్ హొమ్స్ ఏర్పాటు చేయ వలసిందిగా కోరడమైనది. రహదారులకు మున్సిపాలిటీ ప్యాచ్ వర్క్ చేయించని కారణంగా స్థానికులే ప్యాచ్ వర్క్ చేసినట్టు తెలిపారు. ఇక రోడ్డు లెవెల్ పాటించని కారణంగా వర్షాకాలంలో కొన్ని చోట్ల మోకాళ్ళ లోతు నీళ్లు నిలుస్తున్నవని చెప్పినారు. మున్సిపాలిటీ వారు రోడ్లు శుభ్రం చేసే కార్యక్రమం నెలకి మూడు లేక నాలుగు సార్లు మాత్రమే చేస్తున్నారని స్థానికులు తెలియజేశారు. కావున పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, హైదరాబాద్ వాటర్ వర్క్స్, హెచ్.ఎం.డి.ఏ మరియు మణికొండ మున్సిపాలిటీ అధికారులందరూ పై సమస్యలకు పరిష్కార దిశగా వెంటనే చర్యలు చేపట్టాలని మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదని అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేందర్నాథ్ రెడ్డి, సంగం శ్రీకాంత్, దిలీప్, కిరణ్ యాలాల, భాను చందర్, సుమనళిని, సుమన్, బొడ్డు శ్రీధర్, మహేందర్, తిరుపతి తది తరులు తెలియ పరచారు.

# తెలంగాణాలో చేపట్టిన వర్గీకరణ చెల్లదు.




**ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** అసలు వర్గీకరణ చెల్లదు దీనికి రాజ్యాంగ చట్టబద్ధత లేదు పార్లమెంట్ లో ఆమోదం లేకుండా ఎస్సీలను వర్గీకరించే శక్తి సుప్రీంకోర్టుకి లేదు. అని పోరాటం జరుగుతున్నదో అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో జరిగినటువంటి వర్గీకరణ కూడా చెల్లదు అని ఈరోజు మాజీ ఎంపీ జీవి హర్ష కుమార్ గారు హైదరాబాద్ వేదికగా పత్రికా సమావేశంలో మాట్లాడుతూ తేల్చి చెప్పారు.

ఇందులో భాగంగా సుప్రీంకోర్టు ఆర్డర్ చెల్లదు అని పోరాటం జరుగుతున్నటువంటి సమయంలో సుప్రీంకోర్టు ఆర్డర్ని యధావిధిగా అమలు పరచకుండా వాళ్ల ఇష్టారాజ్యంగా అమలు చేయడం ఏంటి?

తను న్యాయ నిపుణులతో టచ్ లో ఉన్నానని ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణలో ప్రవేశపెట్టిన వర్గీకరణ బిల్లు కొట్టి వేయబడుతుంది అని విశ్వాసం వ్యక్తం చేశారు.

గత వారం రోజులుగా హైదరాబాదులోనే ఉంటూ దగ్గర నుండి వర్గీకరణ బిల్లును పర్యవేక్షిస్తున్న హర్ష కుమార్ గారు దాంట్లో జాగ్రత్తగా అబ్జర్వ్ చేసి కీలకమైన పాయింట్లుతో హైకోర్టులో బిల్లు చల్లదని రిప్పిటేషన్ వేయడానికి కాసుకు కూర్చున్నట్లు సమాచారం.
వేచి చూడాలి వర్గీకరణ తెలంగాణలో జరుగుతాదా లేదా కోర్టు స్టే విధిస్తాదా అనేది.

# పదవ తరగతి పరీక్షల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 21:** శుక్రవారం నుండి మొదలైన పదవ తరగతి పరీక్షల నిర్వహాణను పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం.

దుండిగల్ మండలంలోని మల్లంపేట లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల నిర్వహాణను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టరు పరీక్షలు జరుగుతున్న తరగతి గదులలో తిరిగి విద్యార్థులు పరీక్షలు వ్రాయడాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మంచినీరు, లైట్లు, ఫ్యాన్లు సౌకర్యాలు ఉన్నాయా అని ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. పదవతరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పరీక్షలు సజావుగా నిర్వహించేలా చూడాలని కలెక్టరు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలని కలెక్టరు తెలిపారు. అదే విధంగా స్కూలులో ఎంత మంది విద్యార్థులున్నారని, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబులు ఉన్నాయా అని కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. దుండిగల్ మండలంలో మొత్తం ఎన్ని ఉన్నత పాఠశాలలు ఉన్నాయని అడిగారు. కంప్యూటర్ ల్యాబ్ ను రోటరీ క్లబ్ వారు ఏర్పాటు చేసారని ఎంఈఓ తెలుపగా, ఎన్ని కంప్యూటర్లు ఉన్నాయని, ఇన్ స్ట్రక్టర్ ఉన్నారా అని అడిగారు. విద్యార్థులకు కంప్యూటర్ క్లాసులు ఏవిధంగా నిర్వహిస్తున్నారని కలెక్టరు ప్రశ్నించగా, వారానికి రెండు క్లాసుల చొప్పున ప్రతి సెక్షన్ వారికి కంప్యూటర్ క్లాసులు నిర్వహిస్తున్నామని ఎంఈఓ బదులిచ్చారు.

అనంతరం శామీర్ పేట మండలంలోని తూంకుంటలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టరు సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తరగతి గదులలో తిరిగి విద్యార్థులు పరీక్షలు వ్రాయడాన్ని కలెక్టరు తనిఖీ చేసారు. కలెక్టరు స్కూల్ యాజమాన్యాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ పర్యటనలో దుండిగల్ తహాసీల్దారుస మతీన్, శామీర్ పేట తహాసీల్దారు యాదగిరిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రయోగార్థం నీటి సరఫరా లైన్ పెంచండి


MANIKONDA QUARTERS
WEAKER SECTIONS COLONY
D.No.4-64/9, MANIKONDA - 500089

Dated the 21st March, 2025

To
The General Manager,
O AND M DIVISION 18,
HMWSSB Manikonda.

Respected Sir,

Sub:- Laying of 6 inches drinking water pipe line – Request – Regarding.

Ours is a weaker section colony with 3000 population on a little bit hilly terrain when compared to other colonies or basthis nearby. Presently we are having 4 inches drinking water pipe line laid by erstwhile gram panchayat and the pipe line is very old apart from the pressure is not at all sufficient to meet the requirements of the families living in this area. Also, the Manikonda Municipality is planning to lay new roads on the existing roads. In view of the above situation, we would request you to consider to lay 6 inches drinking pipe line in place of 4 inches pipe line before the new roads are laid. Please consider the request of the weaker sections colony and arrange to provide the 6 inches drinking water pipe line at the earliest.

Thanking you,

Yours sincerely,
(Bhanuchander)
M-9030657335



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 21 మార్చి 2025**హైదరాబాద్ నగరంలోనే అభివృద్ధికి మారు పేరుగా పేరుగాంచిన ప్రాంతాలలో మణికొండ మునిసిపాలిటీ ప్రథమంగా ఉన్నదని అట్టి ప్రాంతంలో 1987 వ సంవత్సరంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు కరకమలములచే మధ్యతరగతి ప్రజలకు 90 గజాల వైశాల్యం గల ప్లాట్ లను వితరణ చేయడం జరిగినది, అట్టి చిన్నపాటి స్థలంలో మధ్య తరగతి కుటుంబ సభ్యుల సంఖ్యా పరంగా పెరుగుతూ వచ్చినను త్రాగు నీటి సరఫరాకు ఎప్పుడో పాత కాలంలో వేసిన 4 ఇంచిలా పైప్ లైన్ ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదని అందుకు గాను శుక్రవారం రోజున స్థానికులు మణికొండ జలమండలి 18 వ డివిజన్ అధికారిని కలసి ప్రజా ప్రయోగార్థం పాత లైన్ స్థానంలో కొత్తగా 6 లేదా 8 ఇంచీల పైప్ లైన్ వేసి నీటి సరఫరా పెంచ వలసినదిగా వినతి పత్రం అంద జేయడంలో కీలక పాత్ర పోషించిన భాను చందర్, హుస్సేన్, దీపక్ సింగ్, భరత్, దిపక్, సంగం శ్రీకాంత్ తది తరులు

## మహా రక్తదాన శిబిరం

## – 23 న జోగిపేట్ పోలీస్ స్టేషన్ శాఖ ఆధ్వర్యంలో



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 21 (ప్రజాబలం )** స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన, యోధులు భగత్ సింగ్, శివరాం, రాజగురుల, వర్ధంతి సందర్భంగా, ఈనెల 23వ తేదీ ఆదివారం నాడు జోగిపేట పోలీస్ శాఖల ఆధ్వర్యంలో మహా రక్తదాన శిబిరం,కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, జోగిపేట ఎస్సై పాండు,తెలిపారు పోలీస్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే, ఈ రక్తదాన శిబిరంలో, దాతలు పెద్ద సంఖ్యలో వచ్చి పాల్గొని విజయవంతం చేయాలని ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసే దాతలకు, సర్టిఫికెట్, అందిస్తామని అన్నారు, రక్తదానం చేసేవారు ముందుగా, సెల్ నంబర్ 8374115556, లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని, తెలియజేశారు, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని, రక్తదానం ప్రాణదానం తో సమానం అని ఎస్సై పాండు, అన్నారు, అన్ని దానాలలో కన్నా రక్తదానం ఉత్తమమైనదని, పోలీస్ శాఖలో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని దాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు, ఈ రక్తదాన శిబిరం జోగిపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో జరుగుతుందని ఉదయం 9, గంటల నుంచి సాయంత్రం 4, గంటల వరకు ఈ రక్తదాన శిబిరం, కొనసాగుతుందని జోగిపేట ఎస్సై పాండు, తెలియజేశారు...

# పదోన్నతులు పోలీస్ లకు మరింత బాధ్యతను పెంచుతాయి




**రాజన్న సిరిసిల్ల జిల్లా,మార్చ్ -21(ప్రజాబలం ప్రతినిధి)**పదోన్నతులు జీవన శైలిని మార్చే విధంగా ఉత్సాహాన్ని కలిగిస్తాయి. ఇల్లంతకుంటా పోలీస్ స్టేషన్లో విధులు హెడ్ కానిస్టేబుల్ గా నిర్వహిస్తున్నా బి.శ్రీనివాస్ హెడ్ కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐగా పదోన్నతి పొందినసందర్భంగా ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ మహేష్ బి గితే .ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ..పోలీస్ శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు, పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు,గౌరవ మర్యాదలు లభిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంటా ఎస్.ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# సేవా సమితి ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మార్చి 21 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శివ సాయి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా నిరుపేద ముస్లింలకు 15 మంది కుటుంబాలకు 22,500 రూపాయల విలువ ఒక్కొక్కరికి 1500 రూపాయల(రంజాన్ తోఫా)కిరాణం నిత్యవసర సరుకులను శుక్రవారం రోజున అందజేయడం జరిగినది.ఈ కార్యక్రమం సమితి అధ్యక్షుడు పాటిబండ్ల ప్రసన్న శ్రీరామ మూర్తి ఆధ్వర్యంలో జరిగినది.శుక్రవారం ఈ కార్యక్రమంలో పాల్గొన్న సమితి సభ్యులు నార్ల సుమతమ్మ, నరేందుల భీమన్న,నరేందుల ప్రభాకర్,తాటికొండ శ్రీనివాస్,నల్మాస్ ధనలక్ష్మి శ్రీనివాస్ జైన శ్రీనివాస్, కొంజర్ల ప్రసాద్,మైనార్టీ సభ్యులు గఫూర్ తదితరులు పాల్గొన్నారు

## రాజీవ్ యువ వికాసం పథకం సద్వినియోగం చేసుకోండి

### - మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి



**అందోల్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 21 (ప్రజాబలం)** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం హర్హులు అందరూ దరఖాస్తు చేసుకోవాలని రైకోడ్ మునిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, సుధాకర్ రెడ్డి తెలిపారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు,రాజీవ్ యువ వికాసం పథకం కింద ప్రభుత్వం ఈనెల 17 నుండి దరఖాస్తులనుస్వీకరిస్తుందని తెలిపారు, కేటగిరి -1 కింద రూ , లక్ష వరకు రుణం అందించి, 80% రాయితీ ఇస్తుందని, క్యాటగిరి -2 కింద రు, లక్ష నుంచి రూ ,2, లక్షల వరకు రుణాలను మంజూరు చేసి 70% రాయితీ కల్పిస్తుందని, కేటగిరి-3 కింద రూ , 2, లక్షల నుండి రూ ,3, లక్షల వరకు రుణాలను అందజేసి 60% రాయితీ ఇవ్వనుందని తెలిపారు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న, ఈ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, యువత అర్హులైన వారందరూ వచ్చేనెల ఏప్రిల్ 5,వ తారీకు వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు..

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి ::

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

### ఓటరు జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా , మార్చి 21(ప్రజాబలం ప్రతినిధి)**జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఓటర్ జాబితా సవరణ పై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ జాబితా సవరణ పకడ్బందీగా జరగాలని, ప్రజాస్వామ్య విలువలు నెలకొల్పేందుకు ఓటర్ జాబితా చాలా కీలకమని, సరైన ఓటర్ జాబితాతో ఎన్నికల నిర్వహిస్తే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అన్నారు. ఓటర్ జాబితా, పారదర్శకమైన పోలింగ్ సిబ్బంది, ఈవిఎం యంత్రాలు, బ్యాలెట్ ఎన్నికల వ్యవస్థకు కీలకమని కలెక్టర్ అన్నారు. ఎన్నికల సమయంలో కాకుండా ఓటర్ జాబితా సవరణ పై రాజకీయ నాయకుల ప్రతినిధులు ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఓటర్ జాబితా నుంచి పేర్లు తొలగించే సమయంలో తప్పనిసరిగా నిర్దేశిత మార్గదర్శకాలు పాటించాలని అన్నారు.ఓటరు జాబితాలో డబల్ ఎంట్రీ ల తొలగింపుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. మన జిల్లాలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా కొంతమందికి ఓట్లు ఉన్నట్లు వస్తున్న ఫిర్యాదులను జాతీయ ఓటర్ సర్వీస్ పోర్టల్ వివరాలు పరిశీలిస్తూ పరిష్కరిస్తామని అన్నారు.ప్రతి సంవత్సరం 4 సార్లు ఓటర్ జాబితా సవరణ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజాప్రతినిధుల చట్టం 1950 సెక్షన్ 31 ప్రకారం ఓటర్ నమోదు సమయంలో తప్పుడు సమాచారం అందిస్తే నేరమని, మోసపూరిత ఉద్దేశాలతో రెండు చోట్ల ఓటు హక్కు కల్గి ఉండే ఓటర్ల వివరాలు ఆదారాలతో అందిస్తే తప్పనిసరిగా విచారించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.మన రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వీటి పరిధిలో ఇప్పటివరకు 2 లక్షల 30 వేల 157 మంది పురుష ఓటర్లు, 2 లక్షల 47 వేల 977 మంది మహిళా ఓటర్లు, 38 మంది ఇతరులు మొత్తం 4 లక్షల 77 వేల 182 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.గత అసెంబ్లీ, పార్లమెంట్ , ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు వ్యయ వివరాలు నిర్దిష్ట సమయంలో నమోదు చేయాలని , లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోతారని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని కోరారు. ఓటర్ జాబితా సవరణపై ఎటువంటి సందేహాలు ఫిర్యాదులు సూచనలు ఉన్న తెలియజేయాలని అన్నారు.ఈ సమావేశంలో సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు రాధాబాయి రాజేశ్వర్ భాజాపా పార్టి ప్రతినిధి నాగుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సంపత్, భారస పార్టీ ప్రతినిధి రాజన్న, బి.ఎస్.పి పార్టీ ప్రతినిధి రమేష్, సి.పి.ఐ(ఎం) పార్టీ ప్రతినిధి రమణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సిబ్బంది రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన

## జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 21(ప్రజాబలం)సంగారెడ్డి** జిల్లా/తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నాడు ప్రారంభమైన 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల,కరుణా హై స్కూల్ మరియు సాహితీ హై స్కూల్ పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్.ప్రత్యక్షంగా సందర్శించి,అక్కడి బందోబస్తు ఏర్పాట్లను మరియు పరీక్షా రాయడానికి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు ఉండవలసిన కనీస సదుపాయాలు, అత్యవసర మెడికల్ సేవల గురించి పర్యావేక్షించారు,అనంతరం ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 10వ తరగతి పరీక్షల నిర్వాహణ గైడ్ లైన్స్ పాటిస్తూ, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 యాక్ట్ -2023 అమలులో వుంటుందని, పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపియస్.గారు వివరించారు.,పరీక్షా కేంద్రాల దగ్గర ఉన్నటువంటి అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని ముందుగానే నోటీసులు జారీ చేసి, మూసివేయించడం జరిగింది అన్నారు,విద్యార్థులకు, ఇన్విజిలేటర్స్ మరియు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్స్ ఎవ్వరికి కూడా పరీక్ష కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావడానికి అనుమతించబడవు పరీక్షా కేంద్రం వద్ద ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లైతే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీసు వారికి సమాచారం అందించాలని సూచించారు.

## ప్రతి మహిళను నాయకత్వం కోసం శక్తివంతం చేయడమే మా లక్ష్యం...

### శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఇందుమతి




**కూకట్పల్లి (ప్రజబలం)మార్చ్ 21:** మహిళలు రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నప్పుడే నిజమైన సమానత్వం మరియు న్యాయం సాధించబడతాయి ఇందిరా ఫెలోషిప్ తెలంగాణ కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇందిరా ఫెలోషిప్ బూట్ క్యాంపు ఇందిరా ఫెలోషిప్ కన్వీనర్ విజయలక్ష్మి, రమణి రెడ్డి ఆధ్వర్యంలో బేగంపేట్ లోని తాతచారి నగర్ లో నిర్వహించిన జిల్లా స్థాయి బూట్ క్యాంప్ గొప్ప విజయాన్ని సాధించింది. బూట్ క్యాంపు కి ముఖ్య అతిథిగా విచ్చేసిన సనత్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ కోట నీలిమ, శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఇందుమతి శ్రీరంగం, జాతీయ పరిశోధనా అధిపతి హానికా రేషే ఏఐసీసీ, మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజానోళ్ళ లక్ష్మి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ హాజరు కావడం ద్వారా ఈ కార్యక్రమం మరింత సుసంపన్నమైంది. ఇందులో ప్రముఖ అతిథి ఆహ్వానితుల నుండి శక్తివంతమైన మరియు ప్రేరణాత్మక ప్రసంగాలు చేసారు. సనత్ నగర్ నియోజకవర్గం ఇంచార్జి కోట నీలీమా తన మాటలతో హాజరైన వారిని ప్రేరేపించారు. శ్రీరంగం ఫౌండేషన్ సహ వ్యవస్థాపకురాలు ఇందు శ్రీరంగం మహిళలను శక్తివంతం చేయడం మరియు మహిళలకు నిజమైన నాయకత్వం అనే తన అద్భుతమైన ప్రయాణాన్ని పంచుకున్నారు. సమాన హక్కులు యాజమాన్యం అనే ఆలోచన ఆధారంగా మహిళా కేంద్రీకృత రాజకీయాలను బలోపేతం చేయడం, అట్టడుగు స్థాయి మహిళా రాజకీయ నాయకులను సృష్టించడం శక్తి అభియాన్ లక్ష్యం అని అన్నారు. ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వడంలో ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. వారి సమిష్టి కృషి ఈ కార్యక్రమాన్ని పాల్గొన్న వారందరికీ చిరస్మరణీయమైన ప్రభావవంతమైన అనుభవంగా మార్చింది. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా బ్లాక్ అధ్యక్షురాళ్లు, డివిజన్ మహిళా అధ్యక్షులురాళ్లు కృష్ణవేణి, రాధ, రజిత, జోజమ్మ, చంద్రకళ, జ్యోతి, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 10వ తరగతి వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 21 :** జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయని, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని ఆర్.బి.హెచ్.వి.,జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య,తహశిల్దార్ రఫతుల్లా లతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... 10వ తరగతి పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.త్రాగునీరు, విద్యుత్ సరఫరా,ఆర్.టి.సి. బస్సులు,ప్రశ్నా,జవాబు పత్రాల రవాణా, బందోబస్తు,పారిశుద్ధ్యం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు,ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని,పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ కొరకు 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షల మొదటి రోజు 9 వేల 183 మంది హాజరు కావలసి ఉండగా 9 వేల163 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని,ఒకసారి అనుత్తీర్ణులైన వారు 6 మంది హాజరు కావలసి ఉండగా ఇద్దరు హాజరయ్యారని,99.74 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని తెలిపారు.విధులలో నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు మొదటి రోజున జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష 2 గంటల ఆలస్యంగా ప్రారంభమైందని తెలిపారు.రోజు వారిగా,ప్రశ్నా పత్రాల సెట్ల వారిగా పోలీస్ స్టేషన్ నుండి ప్రశ్నాపత్రాలను బందోబస్తు మధ్య ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలకు తరలించడం జరుగుతుందని,ఆఖరి నిమిషం వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకునే ప్రశ్నాపత్రాల వివరాలు ఎవరికి తెలియదని తెలిపారు. మంచిర్యాల పోలీస్ స్టేషన్ నుండి స్టేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తరలించవలసి ఉంటుందని, ఈ క్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం-03015 కు తరలించే ట్రంక్ బాక్సులో రెండవ రోజు పరీక్ష సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఉన్నాయని గమనించి,పరీక్షా కేంద్రానికి రావలసిన ప్రశ్నాపత్రాలు బాక్సును వెతకడంలో 1.30 గంటల సమయం పట్టిందని, ఉన్నతాధికారుల అనుమతి పొంది,పరీక్షా కేంద్రానికి తరలించి, విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను అందించడంలో మొత్తం 2 గంటల ఆలస్యం జరిగిందని,విద్యార్థులు పరీక్ష వ్రాసేందుకు ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిబంధనల ప్రకారం 3 గంటల సమయం ఇవ్వడం జరిగిందని,2 గంటల ఆలస్యంగా పరీక్ష ప్రారంభమైనందున విద్యార్థులకు స్నాక్స్ అందించడం జరిగిందని తెలిపారు.ట్రంక్ బాక్స్ లో గుర్తించి రెండవ రోజు పరీక్ష ప్రశ్నాపత్రాలను తెరువలేదని, రాష్ట్ర ప్రభుత్వ సీల్తో పోలీస్ స్టేషన్లో అలాగే భద్రపర్చబడి ఉందని తెలిపారు.సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, ఒక ప్రశ్నాపత్రానికి బదులు మరొక ప్రశ్నాపత్రం ఇచ్చారని,పేపర్ లీక్ అయింది అంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తెలిపారు.విధులలో నిర్లక్ష్యం,అలసత్వం వహించిన పరీక్షా కేంద్రం ముఖ్య పర్యవేక్షకులు మీర్ సప్టర్ అలీఖాన్,శాఖ అధికారి ఎన్.ఆర్.పద్మజ లను సస్పెండ్ చేయడం జరిగిందని,వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అకాల రాళ్ల వర్షంతో

## రైతులకు ఎంతో నష్టం

**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ మార్చి 21 :** మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి,మండలంలోని కొర్విచెల్మ గ్రామంలోని అకాల రాళ్ల వర్షంతో కూడిన,గాలి వాన కారణంగా రైతుల యొక్క చేతికి వచ్చినటువంటి మొక్కజొన్న,వరి ఎంతో నష్టం జరిగిందని రైతులు ఆవేదన,ఇలా నష్టం జరిగినందుకు,సంబంధిత అధికారులు,సర్వే నిర్వహించి రైతులు న్యాయం జరగాలని ఆవేదన వ్యక్తపరిచారు.

## అవసరమైనచోట కొత్త బూతులను ఏర్పాటు చేస్తాం

## అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతం




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 21:**ఎన్నికల సమయంలోనే కాకుండా క్రమం తప్పకుండా సమావేశమై అన్నీరాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలను, సూచనలను పరిగణలోనికి తీసుకోని భారత ఎన్నికల కమీషన్ కు పంపుతామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు/జిల్లా ఎన్నికల అధికారి గౌతం తెలిపారు.

శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ విసి హాల్ లో ఏర్పాటు చేసిన ఆల్ పార్టీ మీటింగ్ కు అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టరు గౌతం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో జనాభా పెరుగుతున్నందున ఓటర్లు కూడా పెరగడం జరుగుతుందని అందుకనుగుణంగా బూత్ లెవెల్ ఏజెన్సీలను నియమించాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు. సరళీకృత ఓటరు జాబితాలను అవసరమైన మేరకు ఎప్పటికపప్పుడు మార్పులు, చేర్పులు చేస్తూ అట్టి మార్పుల వివరాలను ను బిఎల్ ఎలు ఓటర్లకు తెలియజేయాలని తెలిపారు. సాధారణ అభ్యర్థనలు ఏమైన ఉంటే కమీషన్ దృష్టికి తీసుకువళ్లడం జరుగుతుందన్నారు. బూతులను షిఫ్ట్ చేయడం కష్టమని, అవసరమైన మేరకు కొత్త పోలింగ్ బూతులను కూడా ఏర్పాటు చేస్తామని కలెక్టరు తెలిపారు. ఒకే కుటుంబ సభ్యులు వేరు వేరు బూతులలో ఓటరు నమోదు ఉన్నట్లయితే వారు ఫామ్ -8 లో బూతు మార్పుకు అప్లై చేసుకోవచ్చని సూచించారు.పార్టీ ప్రతినిధుల సూచనల మేరకు తండాలలో పరిశీలించి అవసరమైన చోట కొత్త బూతులను ఏర్పాటు చేస్తామని కలెక్టరు తెలిపారు. ఇవన్ని చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహాకారం అందించాలని పార్టీల ప్రతినిధులను జిల్లా ఎన్నికల అధికారి కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే తప్పనిసరిగా క్లియర్ చేసుకొవాలని పార్టీ ప్రతినిధులకు కలెక్టరు సూచించారు. ఏవైనా సమస్యలున్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ,రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణిత సమయంలో వస్త్ర ఉత్పత్తులు పూర్తి చేయాలి::జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

### ప్రభుత్వ ఆర్డర్ల పురోగతి పై సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వ్యాపారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి 21 (ప్రజా బలం ప్రతినిధి)**సిరిసిల్ల జిల్లా చేనేత వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం కేటాయించిన ఆర్డర్లను నిర్ణిత సమయంలో వస్త్ర ఉత్పత్తులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆర్డర్ల పురోగతి పై సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమగ్ర శిక్ష శాఖ, సంక్షేమ శాఖలకు సంబంధించి ప్రభుత్వం వస్త్ర పరిశ్రమకు అందించిన ఆర్డర్ల వస్త్ర ఉత్పత్తిని నిర్ణీత సమయంలో పూర్తిచేసి సప్లై చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా సంఘాలకు ఒక్కొక్కరికి రెండు చీరలు చొప్పున పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించి సంబంధిత ఆర్డర్ ను సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కేటాయించడం జరిగిందని అన్నారు.ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద చీరల పంపిణీ కోసం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు వచ్చిన ఆర్డర్ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత సమయంలో గడువులోగా ఉత్పత్తి చేసి సప్లై చేయాలని అన్నారు.ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ అధికారి రాఘవరావు, టెస్కో ప్రతినిధి శంకరయ్య,వస్త్ర పరిశ్రమ వ్యాపారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖండాలలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు

### జిల్లా పాలనాధికారి రాజర్షి షా.




**అదిలాబాద్ ప్రజాబలం ప్రతినిది** శుక్రవారం ఖండాల గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఖండాల గ్రామం లో 68 కుటుంభాలు, 342 జనాభా ఉందని, ఖండాల గ్రామము నుండి 4 km దూరం లో వాగు వద్ద borewell వేసి అక్కడి నుండి పైపు లైను ద్వార ఖండాల గ్రామము లోని %+రూ=% ట్యాంకు ద్వారా ఉదయం 7:00 గం. లకు, సాయంత్రం 6:00 గం. లకు రోజుకు 10,000 లీటర్ల నీటిని సరఫరా చేయడము జరుగుతుందన్నారు.. ఉదయము ఒక గంట పాటు, సాయంత్రము ఒక గంట నీటిని సరఫరా చేయడం జరుగుతుందనీ ఆన్నారు.

ముఖ్యంగా ఖండాల గ్రామము లో బూగర్భ జలాలు అడుగంటి పోవడము తో నీటి సరఫరా నిర్ణీత సమయం లో చేయడము జరుగుతుందని , ప్రత్యామ్నాయ దిశగా ట్యాంకర్ల ద్వారా నీటిని అవసరమైన సందర్భం లో గ్రామ పంచాయితి ట్యాంకరు ద్వార సరాఫరా చేయడము జరుగుతుందన్నారు.

మిషన్ భగీరథ నీరు రెండు రోజులకోసారి వస్తున్న సందర్భం లో తీవ్ర సమస్య ఏర్పడుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారని , అయితే గ్రామస్థులకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా గ్రామంలో నిర్మించిన చిన్నపాటి ట్యాంకు కు సమీపంలోని బోరుబావి నుంచి పైపులైన్ కనెక్షన్ యిచ్చి . దీని ద్వారా ప్రతి రోజు ఉదయం , సాయంత్రం రెండు సార్లు ఆ ట్యాంకు ను నింపడం జరుగుతుందని,దీంతో ఉదయం 5 వేల లీటర్లు, సాయంత్రం ఐదు వేల లీటర్ల ను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. భూగర్భజలాలు అడుగంటి పోవడం ద్వారా నీటి సమస్య తలెత్తుతుందని అందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.బావుల్లో నీరు అడుగంటిపోతున్న సందర్భం లో నీరు బురదగా వస్తున్నాయని, గ్రామస్తులు అవే నీరు త్రాగటం వల్ల అనారోగ్యానికి గురవుతారని, ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎక్కడో దూరం లో ఉన్న బావి దగ్గరికి వెళ్లి నీరు తెచ్చుకోవడం కన్నా ఇంట్లోనే భగీరథ నల్లాల ద్వారా నీటిని వినియోగించుకోవాలని, కోరారు.

## కారుణ్య నియామక పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి 21: (ప్రజా బలం ప్రతినిధి)**

సిరిసిల్ల మున్సిపాలిటీలో ప్రజారోగ్య విభాగంలో పని చేసి మరణించిన వారి వారసులకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కారుణ్య నియామక పత్రాలు అందజేశారు.

ప్రజారోగ్య విభాగంలో పబ్లిక్ హెల్త్ వర్కర్ గా విధులు నిర్వర్తించిన సిరిగిరి నర్సింహులు అనే ఉద్యోగి అనారోగ్య కారణాలతో 2020 సంవత్సరంలో మరణించగా, వారి కుమారుడు సిరిగిరి రాజుకు ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. అలాగే అదే విభాగంలో పబ్లిక్ హెల్త్ వర్కర్ గా విధులు నిర్వర్తించిన నగునూరి నాంపల్లి అనారోగ్య కారణాలతో 2023 సంవత్సరంలో మరణించగా అతని భార్య నగునూరి లత కు ఉద్యోగ నియామక పత్రం కలెక్టర్ అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉండగా, ఈరోజు నియామక పత్రాలను అందజేసినందుకు ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రశాంత వాతావరణం లో పదవ తరగతి పరీక్షలు



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి మార్చి 21** జమ్మికుంటలో ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు జమ్మికుంట మండల విద్యాధికారి హేమలత టౌన్ సిఐ వరగంటి రవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మికుంట మండల వ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి తెలిపారు. ఆరు సెంటర్లలో మొత్తం విద్యార్థులు 1048 మంది పరీక్షలు రాస్తున్నట్లు 6 సెంటర్ లలో 70 మంది ఇన్విజిలేటర్ లను ఏర్పాటు చేసి పరీక్ష కేంద్రాలను కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. జమ్మికుంట టౌన్ సిఐ వరగంటి రవి, మాట్లాడుతూ విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులకు లేకుండా అన్ని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటులు చేసి బందోబస్తు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు పరీక్ష గదులలో, ఫ్యాన్ లు మంచినీటి వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## మసాలా తయారీ కేంద్రాలు మరియు రెస్టారెంట్లలో టాస్క్ ఫోర్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 21:**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు, పసుపు కారం మరియు మసాలాల తయారీ కేంద్రాలు మరియు నిల్వ, విక్రయ కేంద్రాలపై, మరియు పలు రెస్టారెంట్లపై దాడులు.

తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్. రోహిత్, శ్రీషిక,పి.స్వాతి, జగన్నాథ్ లతో కూడిన బృందం మేడ్చల్ జిల్లా నందు గల కిష్టాపూర్ షామీర్ పేట్, సర్వే నెంబర్ 819 , హైదరాబాద్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ( సూర్య మసాలా మరియు స్పైసెస్), లో ఆకస్మిక తనిఖీలు జరపగా,తనిఖీల్లో బయటపడ్డ ముఖ్యమైన ఉల్లంఘనలు

హైదరాబాద్ ఫుడ్ ప్రొడక్ట్స్ (సూర్య మసాలా %ఆ% స్పైసెస్), ఐడీఏ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా తనిఖీ లో సంబంధిత రాష్ట్ర టాస్క్ ఫోర్స్ అధికారుల బృందం హైదరాబాద్ ఫుడ్ ప్రొడక్ట్స్ (సూర్య మసాలా %ఆ% స్పైసెస్) పరిశ్రమను తనిఖీ చేసింది. ఈ తనిఖీలో పలు ఆహార పరిరక్షణ ఉల్లంఘనలు గుర్తించబడ్డాయి.

శుభ్రత మరియు పారిశుద్ధ్యం లోపం %–% మసాలాలు మరియు

లేబుల్ లోపాలు %–% మసాలా ఉత్పత్తిలో ఉపయోగిస్తున్న ముడి పదార్థాలపై తగిన లేబుల్ సమాచారం లేకపోవడం,పెచ్చులు

ఉడిపోయిన గోడలు మరియు దుమ్ము ధూళితో మురికిగా పాడై ఉండటం, అపరిశుభ్రమైన పరిసరాలు %ఆ% కలుషిత వాతావరణం,

తయారైన ఆహార పదార్థాల నిల్వ %–% పికిల్స్, అల్లం-వెల్లుల్లి పేస్ట్ వంటి పదార్థాలు పూర్తిగా శు భ్రత లేని ఫంగస్ తో కూడిన ప్లాస్టిక్ కంటైనర్లలో నిల్వ,

కీటకాల ప్రభావిత పదార్థాలు.

ఈ తనిఖీల్లో 46.75 క్వింటాళ్ల తయారైన సెమి ఆహార పదార్థాలు (పికిల్స్, అల్లం-వెల్లుల్లి పేస్ట్) మరియు మసాలా పొడులు కలిగి ఉన్న రూ. 3 లక్షల 3 వేల విలువైన నిల్వను సీజ్ చేసి, లోపభూయిష్టమైన నమూనాలను ల్యాబ్‌కి పంపించగా, మురికిగా ఉన్న కంటైనర్లు, ఫంగస్ పెరిగిన పదార్థాలు, వాడుక తేదీలు లేకపోవడం, అధిక దుర్వాసన కారణంగా కొన్ని ఉత్పత్తులను ధ్వంసం (డిస్కార్డ్) చేయడం జరిగింది.

అపరిశుభ్రత వాతావరణం లో తుప్పు పట్టిన మిషనరీ ఉపయోగించి పలు ఆహార పదార్థాలు తయారీని జరుగుతున్నట్లు గుర్తించడం జరిగింది. సంబంధిత సంస్థకు తగిన నోటీసులు జారీ చేయబడ్డాయి. అనుమానిత ఆహారపదార్థాలను పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు తరలించడం జరుగుతుందని తెలిపారు.నివేదికలో కల్తీ అని నిర్ధారణ అయితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని టాస్క్ ఫోర్స్ ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు.

ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో, ఆహార భద్రతా నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని హెచ్చరించడం జరిగింది. మరియు అపరిశుభ్ర ప్రాంతంలో మూతలు తీసిన దుమ్ము ధూళి ఈగలతో కూడిన వండిన ఆహార పదార్థాలను మరియు అధికంగా పలుమార్లు వేడి చేసిన వంట నూనెను ఆహార పదార్థాలలో వాడుతుండడం గమనించి ,ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు పలు ఎఫ్ ఎస్ ఎస్ ఏ సెక్షన్ల కింద నోటీసులు జారీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వ్యాపారాలలో అవకతవకలకు పాల్పడే సదరు వ్యాపారుల మీద తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రతా టాస్క్ ఫోర్స్ అధికారులు ఆహార నాణ్యత, మరియు ఆహార పరిరక్షణ మీద తీవ్ర హెచ్చరికలు చేశారు.

ఈ పరిస్థితుల్లో ఆహార పదార్థాలు తయారుచేసి, నిలువ చేసి రవాణా చేసి,విక్రయించే వ్యాపారులు ప్రజలకు సురక్షిత ఆహారం అందించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలు నోటీసులు,సూచనలు జారీ చేశారు.

ప్రజల ఆరోగ్య రక్షణ కోసం తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉంది.నిబంధనలు పాటించని, అనుమతులులేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే సీజ్ చేస్తామని రాష్ట్ర టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి.జ్యోతిర్మయి తేల్చిచెప్పారు. వ్యాపారులు నిబంధనలు పాటిస్తూ బాధ్యతతో వ్యవహరించాలని రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్ అయిన వి. జ్యోతిర్మయి మరియు టాస్క్ ఫోర్స్ అధికారులు సూచించడం జరిగింది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com